ప్రభాత
# నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | TGTEL/25/A0100 | వాస్తవాలే వార్తలుగా..

6.7.2025 ఆదివారం Sunday | సంపుటి (volume): 1 సంచిక (Issue): 35 | పేజీలు : 14 Pages : 14 | వెల రూ. 2.00 | Published from : Hyderabad Circulated to : Telangana

రిపోర్టర్లు కావలెను
జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి సాక్షి ఆహ్వానం పలుకుతుంది.
తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.
9119949944
7897222788 - 7897222789

# చర్చకు సిద్ధమే

**సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఈనెల 8న సిద్ధంగా ఉంటా**

**ఎవరు రైతులకు మేలు చేశారో...చేయలేదో తెలుస్తాం**

**ఈ చర్చకు కేసీఆర్ అవసరం లేదు.. : కేటీఆర్ ప్రతిసవాల్**



వ్యవసాయంపై ఎక్కడ చర్చ పెట్టినా రావడానికి సిద్ధమని బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పార్టీ నేతలతో కలిసి ఆయన మాట్లాడారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఈనెల 8న సిద్ధంగా ఉంటానని, సీఎం రేవంత్‌రెడ్డి చర్చకు రావాలన్నారు.

02

## ఆస్పత్రి నుంచి కేసీఆర్ డిశ్చార్జ్




## చిన్నారులు, మహిళల భద్రతకు
# ప్రాధాన్యం

లైంగిక వేధింపుల నుంచి పూర్తిస్థాయి రక్షణకు చర్యలు

- పిల్లలు, మహిళల రక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నాం
- లైంగిక దాడులపై సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ :** చిన్నారులు, మహిళల భద్రతకు తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. భరోసా కేంద్రాల ద్వారా బాధితులకు అండగా ఉంటున్నట్లు చెప్పారు. 'లైంగిక దాడుల బాధిత చిన్నారుల రక్షణ, భద్రత' అంశంపై హైదరాబాద్‌లో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. చిన్నారులపై లైంగిక హింసను అందరూ

మిగతా 2 లో



02

## స్టాంప్ సవరణ చట్టం కోసం కసరత్తు

అసెంబ్లీలో సవరణకు నిర్ణయం
అధికారులతో సమీక్షలో మంత్రి పొంగులేటి



04

## టెక్సాస్‌లో భారీ వర్షాలతో వరదలు

24మంది మృతి ..30మంది బాలికల గల్లంతు



## భారీ వర్షాలు వరదలతో
# హిమాచల్ అతలాకుతలం

వరదలతో కొట్టుకుపోయిన రోడ్లు, భవనాలు, వంతెనలు
ఇప్పటికే 72 మంది మృతి
చెందారని వెల్లడి
700 కోట్లకు పైగానష్టం
వాటిల్లిందన్న సీఎం సుఖ్వీందర్

04



02

## అసెంబ్లీలోనే చర్చిద్దాం రండి

ఏ అంశమైనా చర్చకు మేం సిద్ధం
బనకచర్ల కావచ్చు..మరేదైనా కావచ్చు
ప్రెస్‌క్లబ్ కాదు..అసెంబ్లీలో సరైన వేదిక
కేటీఆర్ వ్యాఖ్యలపై మంత్రి పొన్నం స్పందన

# నచ్చకపోతే పోవచ్చు!

**బిజెపి విధానాలు నచ్చని వారు పార్టీని వీడినా నష్టం లేదు**

**బీజేపీ బలోపేతానికి స్పష్టమైన కార్యచరణ**
**అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన రామచంద్రరావు**

గజమాలతో సత్కరించిన బిజెపి అగ్రనేతలు

**హైదరాబాద్ :** భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్.రామచందర్‌రావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కాషాయ నేతలు ఆయన్ను గజమాలతో సత్కరించారు. హైదరాబాద్ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలను రామచందర్ రావుకు కిషన్ రెడ్డి అప్పగించారు. ఈ సందర్భంగా కొత్త అధ్యక్షుడికి

మిగతా 2 లో





## రాజాసింగ్‌ను వదిలించుకునేందుకు..

ఇక ఎంతమాత్రం ఉపేక్షించరాదన్న భావన
త్వరలోనే బిజెపి నిర్ణయం తీసుకునే అవకాశం

02

06

## పెద్దపులి భయమే
# చంపేసిందా!?

- కోరుట్ల ఆదర్శ నగర్‌లో 'మర్డర్ మిస్టరీ'?
- 'ఐదేళ్ల పాప-మిస్సింగ్' అని సోషల్ మీడియాలో వైరల్
- రాత్రి పక్కింటి 'బాత్రూంలో పాప మృతదేహం లభ్యం'
- గొంతు కోసారని.. నల్లా దిగబడిందని కథనాలు
- 'అనుమానాస్పద మృతి'పై దర్యాప్తు చేస్తున్న పోలీసులు





ప్రభాత
నేటి సాక్షి
TGTEL/25/A0100 | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాల వార్తలు..



# చిన్నారులపై లైంగిక దాడి కేసుల్లో కఠిన శిక్షలు

మొదటి పేజీ తరువాయి

ఖండించాలన్నారు. ఇలాంటి కేసుల్లో నిందితులను కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. సామాజిక మాధ్యమాల విషయంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సదస్సులో సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ సూర్యకాంత్, హైకోర్టు న్యాయమూర్తులు, డీజీపీ జితేందర్, పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. స్టేట్ లెవెల్ స్టేక్ హోల్డర్స్ కన్సల్టేషన్ మీట్-2025 కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. వాయిస్ ఫర్ ది వాయిస్ లెస్ అనే థీమ్ తో.. తమ బాధను చెప్పుకోలేని వారికి రక్షణ కల్పించేందుకు ప్రస్తుత పరిస్థితుల్లో ఇలాంటి రాష్ట్రస్థాయి సమావేశం ఏర్పాటు చేయడం చాలా అవసరం అన్నారు. ఎంతో కీలకమైన అంశంపై సదస్సు నిర్వహిస్తున్న తెలంగాణ పోలీసు, ఇతర నిర్వాహకులను అభినందిస్తున్నా.. ఇలాంటి నేరాలను నియంత్రించడమే కాకుండా బాల బాధితులకు చట్టపరమైన అన్ని రకాల రక్షణ కల్పించాల్సి ఉంది. లైంగిక వేధింపుల నుంచి అన్ని రకాలుగా రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మా ప్రభుత్వం పిల్లలు, మహిళల రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుంది. బాలికల సంరక్షణ కోసం తెలంగాణ భరోసా ప్రాజెక్టును తీసుకొచ్చిందన్నారు. అనుసంధానంగా 29 కేంద్రాలు పనిచేస్తున్నాయి. ఈ కేంద్రాల ద్వారా పోలీసు సహాయమే కాకుండా న్యాయ పరమైన సహాయం, వైద్య సహాయం, కౌన్సెలింగ్ వంటి సేవలను అందిస్తున్నాయి. హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న భరోసా కేంద్రం ద్వారా చైల్డ్ ఫ్రెండ్లీ కోర్టులను ప్రారంభించిన మొదటి రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. కేసులను వేగవంతంగా పరిష్కరించడమే కాకుండా పిల్లలకు సంపూర్ణ రక్షణ, వారిలో విశ్వాసం, అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవడం ఈ కేంద్రాల లక్ష్యం అని వివరించారు. పోక్సో చట్టం, జ్యువెనైల్ చట్టాలు మన ప్రగతిశీల సాధనాలుగా పనిచేస్తున్నాయి. అయితే ఆచరణలో కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయి. ఆ చట్టాలు బాధితులకు ఎలాంటి హాని కలిగించకుండా, వారి భవిష్యత్తుకు రక్షణగా సంపూర్ణ సహాయకారిగా ఉండాలి. సోషల్ మీడియా ద్వారా పిల్లలపై జరిగే దురాగతాలు, దుర్వినియోగం చేస్తున్న వారి పట్ల ఎలాంటి కరుణ చూపకుండా దోషుల విషయంలో కఠినంగా వ్యవహరించాలి. ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉంది. న్యాయం కేవలం కోర్టుల్లోనే కాకుండా ప్రతి దశలోనూ రక్షణ ఉండాలి. పోలీస్ స్టేషన్, బాలల సంక్షేమ కేంద్రాలతో అన్ని పక్రియల ద్వారా పిల్లలకు న్యాయం దక్కాలి. రక్షణ కల్పించాలని సిఎం అన్నారు. గౌరవ న్యాయమూర్తులు, పోలీసు అధికారులు బాలల సంక్షేమ కమిటీ-లు, ఇతర అభివృద్ధి భాగస్వామ్య సభ్యులందరికీ... విజ్ఞప్తి చేస్తున్నాను. ఇలాంటి విషయాల్లో అందరం కలిసికట్టు-గా ముందుకు సాగుదాం. న్యాయమంటే కేవలం శిక్షలు విధించడం వరకే కాదు. బాధితుల జీవితానికి భరోసా కల్పించాలి. వారికి అవసరమైన రక్షణ, సమాజంలో తగిన గౌరవం

కల్పించేలా చర్యలు తీసుకుని వారి బాల్యాన్ని తిరిగి పొందేలా చర్యలు ఉండాలని అన్నారు.



# స్టాంప్ సవరణ చట్టం కోసం కసరత్తు



## అసెంబ్లీలో సవరణకు నిర్ణయం
## అధికారులతో సమీక్షలో మంత్రి పొంగులేటి

**హైదరాబాద్,జూలై5 :** రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా సాధారణ ప్రజలకు నష్టం కలిగించకుండా వ్యాపార ఒప్పందాలపై పారదర్శకత ఉండేలా స్టాంప్ విధానాన్ని అమలు చేయాలనుకుంటున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ఇందుకు అనుగుణంగా తెలంగాణ సవరణ బిల్లు-2025ను తీసుకురావాలని నిర్ణయించినట్లు పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఈ బిల్లును తీసుకువచ్చేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని వెల్లడించారు. ఈ సవరణ బిల్లుపై శనివారం నాడు డాక్టర్ బి. ఆర్.అంబేద్కర్ సచివాలయంలో ముఖ్యమంత్రి కార్యాలయ ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, రెవెన్యూ శాఖ కార్యదర్శి డి. ఎస్.లోకేష్ కుమార్, న్యాయ వ్యవహారాల కార్యదర్శి రెండ్ల తిరుపతి, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు, ముఖ్యమంత్రి కార్యాలయ ఒఎస్డి వేముల శ్రీనివాస్ తదితరులతో సమావేశం నిర్వహించారు. భారతీయ స్టాంపు చట్టం 1899 ప్రకారం, తెలంగాణ పరిధిలో నాలుగు సెక్షన్లను మరియు 26 ఆర్టికల్స్ ను సవరించుట కొరకు 2021 సంవత్సరంలో శాసనసభలో సవరణ బిల్లును ఆమోదించి కేంద్రప్రభుత్వం ఆమోదం కొరకు పంపడం జరిగిందని అయితే ఈ బిల్లుపై కేంద్రం వ్యక్తం చేసిన అభ్యంతరాలకు సమాధానం ఇచ్చినప్పటికీ 2023 జనవరిలో భారత ప్రభుత్వం ఈ సవరణ బిల్లును రాష్ట్ర ప్రభుత్వానికి తిరిగి పంపించడం జరిగిందని ఈ సందర్భంగా అధికారులు మంత్రి దృష్టికి తీసుకవచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 2021లో ప్రవేశపెట్టిన సవరణ బిల్లును ఉపసంహరించుకొని ప్రస్తుత కాలానికి అనుగుణంగా 2025 సవరణ బిల్లును తీసుకురావాలని నిర్ణయించినట్లు- వెల్లడించారు. సామాన్య ప్రజలను దృష్టిలో పెట్టుకుని, నిబంధనలు కట్టుదిట్టమైన రూపంలోకి తీసుకురావడం కొత్త ఒప్పందాలకు చట్టబద్దత కల్పించడం లక్ష్యంగా బిల్లును రూపొందించాలని అలాగే పాత చట్టంలో లేనివాటిని కొత్త చట్టం పరిధిలోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. వచ్చే శాసనసభ సమావేశాల్లో ఈ సవరణ బిల్లును ప్రవేశపెట్టాలని సూచించారు. సామాన్య మధ్యతరగతి ప్రజానీకంపై ఎలాంటి భారం పడకుండా ప్రస్తుత మార్కెట్ విలువలకు అనుగుణంగా భూముల ధరలను సవరించాలని ఇందుకు అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఎలాంటి విమర్శలకు తావులేకుండా శాస్త్రీయ పద్ధతిలో భూముల ధరల సవరణ జరగాలన్నారు. ఏఏ ప్రాంతాల్లో ఎక్కువ వ్యత్యాసం ఉంది అక్కడ హేతబద్ధంగా ఎంత శాతం పెంచేందుకు అవకాశం ఉంది తదితర అంశాలపై లోతైన అధ్యయనం చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళాభ్యుదయం కోసం ఎన్నో చర్యలు చేపడుతోందని దీనిలో భాగంగా మహిళలకు స్టాంప్ డ్యూటీ- తగ్గించాలన్న ఆలోచన చేస్తున్నామని అలాగే కొత్త, పాత అపార్ట్‌మెంట్ లకు స్టాంప్ డ్యూటీ- ఒకే విధంగా ఉందని పాత అపార్ట్ మెంట్‌లకు రిజిస్ట్రేషన్ తేదీలను పరిగణనలోకి తీసుకొని స్టాంప్ డ్యూటీ- తగ్గించాలన్న ఆలోచన చేస్తున్నామని ఈ రెండు అంశాలపై గౌరవ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించి విధివిధానాలపై తుది నిర్ణయం తీసుకుంటామన్నారు.

## ప్రతి రెవెన్యూ గ్రామానికి గ్రామ పరిపాలనా అధికారి

### రెవెన్యూ ఉద్యోగ సంఘాలతో మంత్రి పొంగులేటి

ప్రతి రెవెన్యూ గ్రామానికి గ్రామ పరిపాలనా అధికారి ఉంటారని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రెవెన్యూ ఉద్యోగ సంఘాలతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సమావేశమయ్యారు. రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా గ్రామ పరిపాలనా అధికారుల నియామకాన్ని చేపట్టినట్లు- పేర్కొన్నారు. వీఆర్‌వో, వీఆర్‌ఏలుగా పని చేసినవారికి జీపీవోలుగా అవకాశం ఇస్తున్నట్లు చెప్పారు. ప్రత్యేక పరీక్ష ద్వారా 3,454 మంది అర్హత సాధించారని వెల్లడించారు. రెవెన్యూ ఉద్యోగ సంఘాల విజ్ఞప్తి మేరకు వీఆర్‌వో, వీఆర్‌ఏలకు మరో అవకాశం ఇవ్వాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. అర్హత పరీక్ష త్వరలోనే నిర్వహిస్తామని మంత్రి వెల్లడించారు.

## మంత్రి సీతక్కకు వచ్చిన మావోల లేఖ ఫేక్

**వరంగల్,జూలై5 :** మంత్రి సీతక్కకు వార్నింగ్ ఇస్తూ వారం క్రితం మావోయిస్టులు విడుదల చేసిన లేఖ ఫేక్ అని తేలింది. ఇలాంటి లేఖ ఏదీ తాము రాయలేదని ఇప్పుడు మావో అధికార ప్రతినిధి పేరుతో ఓ లేఖ విడుదలయ్యింది. ఆ లేఖ మేం రాయలేదంటూ మరో లేఖ విడుదల చేయడంతో ఫేక లేఖ ఎవరిదన్నది ఇప్పుడు బయటపడాల్సి ఉంది. మంత్రి సీతక్కను హెచ్చరిస్తూ మావోయిస్టులు రిలీజ్ చేసిన లేఖపై మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి జగన్ క్లారిటీ- ఇచ్చారు. ఈ మేరకు ఒక అధికారిక పత్రికా ప్రకటన విడుదల చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) తెలంగాణ రాష్ట్ర కమిటీ- పేరుతో 26.06.2025న మంత్రి సీతక్కపై వచ్చిన తాము రాయలేదని.. మా పార్టీకీ, ఆ లేఖకు ఎలాంటి సంబంధం లేదని తాజా లేఖలో స్పష్టం చేశారు. అలాగే మావోయిస్టు రాష్ట్ర కార్యదర్శి బడే చొక్కారావ్ అలియాస్ లొంగుబాటులో వాస్తవం లేదని తెలిపారు.

## కోరుట్లలో కలకలం..
### 5 ఏళ్ల బాలిక అనుమానాస్పద మృతి

**కోరుట్ల, జూలై 5:** జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో శనివారం రాత్రి హృదయ విదారక సంఘటన చోటు చేసుకుంది. ప్రతి ఒక్కరిని కలిచి వేసే ఈ సంఘటనతో ఒక్కసారిగా కాలనీవాసులను భయభ్రాంతులకు గురి చేసింది. స్థానికుల వివరాల ప్రకారం.. పట్టణంలోని ఆదర్శ నగర్ కాలనీకి చెందిన ఆకుల రాము - కూతురు హితిక్ష (5) సాయంత్రం నుంచి కనిపించకుండాపోయింది. కుటుంబ సభ్యులు వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. పోలీసులు వెతకగా, ఒక ఇంట్లోని బాత్రూంలో గుర్తు తెలియని వ్యక్తి మెడపై కత్తితో కోసి పడేశారు. ఈ సంఘటన కోరుట్ల పట్టణ ప్రజలను కలిచి వేసింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపడుతున్నారు. బాలిక మృతికి గల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



## బీజేపీ బలోపేతానికి స్పష్టమైన కార్యచరణ

మొదటి పేజీ తరువాయి



బీజేపీ శ్రేణులు అభినందనలు తెలిపారు. బాధ్యతల స్వీకరణ అనంతరం రామచందర్ రావు మీడియాతో మాట్లాడుతూ.. సామాన్య కార్యకర్త స్థాయి నుంచి అధ్యక్షుడి వరకు రావడం బీజేపీలోనే సాధ్యమని.. ఇందుకు తన ఎన్నికే నిదర్శనమన్నారు. రాష్ట్రంలో బీజేపీ బలోపేతానికి స్పష్టమైన కార్యచరణతో ముందుకెళ్తామని చెప్పారు. రాష్ట్రంలో బీజేపీకి ఒక అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరుతామన్నారు. మోసపూరిత హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. కాంగ్రెస్ చేసిన రైతు రుణమాఫీ పూర్తి స్థాయిలో జరగలేదని ఆరోపించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదని తెలిసి ఇష్టమొచ్చినట్లు హామీలు ఎందుకు ఇచ్చారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులు ఉసురు తగులుతుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసమే రైతు భరోసా ఇచ్చారని ఆరోపించారు. రాష్ట్రంలో యూరియా కొరతపై దుష్ప్రచారం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. ఈ అంశంలో రాష్ట్ర ప్రభుత్వం రైతులను తప్పుదోవ పట్టిస్తుందని మండిపడ్డారు. కేంద్రం ఇచ్చిన యూరియాను రాష్ట్ర పాలకులు తినేశారా అని ఆరోపించారు. మోడీ, బీజేపీని తిట్టడమే కాంగ్రెస్ సామాజిన న్యాయ సభ ఉద్దేశమా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ డీకే అరుణ, పలువురు సీనియర్ నేతలు పాల్గొన్నారు. అంతకుముందు తన నివాసం నుంచి ర్యాలీగా వచ్చిన రామచందర్‌రావు ఉస్మానియా వర్సిటీలోని సరస్వతీ దేవాలయంలో, చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ బీజేపీ విధానాలు నచ్చనివారు పార్టీని వీడినా నష్టం లేదంటూ వ్యాఖ్యానించారు. బీజేపీ విధానాలు, నిర్ణయాలు నచ్చక ఎవరు పార్టీని వీడినా నష్టం లేదని రామచంద్రావు అన్నారు. పార్టీని నమ్ముకున్నవారిని బీజేపీ ఎప్పుడూ మోసం చేయదని, అందుకు తానే ఉదాహరణ అని చెప్పారు. పార్టీ అభివృద్ధికి పని చేసిన వారందరికీ అవకాశాలు వస్తాయన్నారు. కాంగ్రెస్ పార్టీ దోపిడీకి తెలంగాణ అక్షయ పాత్రగా మారిందని బిజెపి తెలంగాణ అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు ఆరోపించారు. కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు కాంగ్రెస్ పార్టీ దోపిడీకి అక్షయపాత్రలుగా మారాయని వ్యాఖ్యానించారు. ఏడాదిన్నర కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఒక్క హామీని కూడా సమర్థంగా అమలు చేయలేకపోందని, ప్రజలకు ఏం సమాధానం చెబుతుందని ఆయన నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సభ సందర్భంగా రామచంద్రరావు స్పందిస్తూ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణలో 6 గ్యారంటీ-లు, 13 హామీలు అంటూ భారీగా హడావుడి చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు ఏ హామీని పూర్తిస్థాయిలో అమలు చేయలేకపోయిందని అన్నారు. కులగణన పేరిట బీసీలకు అన్యాయం చేసి, ముస్లింలను బీసీ కోటాలో చేర్చడమే కాంగ్రెస్ సామాజిక న్యాయమా అని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలు మళ్లీ మోసపోరని అన్నారు. కాంగ్రెస్ పార్టీ 70 ఏళ్ల పాలనలో వెనుకబడిన వర్గాల వారిని ఎన్నడూ ప్రధానమంత్రి గాని ముఖ్యమంత్రిగా చేయలేద ని విమర్శించారు.

## రాజాసింగ్‌ను వదిలించుకునేందుకు సిద్ధం

### ఇక ఎంతమాత్రం ఉపేక్షించరాదన్న భావన
### త్వరలోనే బిజెపి నిర్ణయం తీసుకునే అవకాశం



**హైదరాబాద్,జూలై5 :** పంటి కింద రాయిలా పరిణమించిన గోషామహల్ శాసనసభ్యుడు రాజాసింగ్‌ను వదిలించుకోవాలని బీజేపీ భావిస్తున్నట్టు- తెలుస్తున్నది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక తీరుపై కేంద్ర నాయకత్వం మీద నిరసన గళం విప్పిన రాజాసింగ్ ఏకంగా పార్టీకి రాజీనామా చేస్తూ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి లేఖ రాశారు. ఈ లేఖ ఆధారంగా స్పీకర్‌కు లేఖ రాసి తన అసెంబ్లీ సభ్యత్వాన్ని కూడా రద్దు చేయించాలని మాట్లాడారు. తాను ఇక ఏమాత్రం బీజేపీ సభ్యుడిని కానని కూడా ప్రకటించారు. దీంతో ఇదే అదునుగా ఆయనను పార్టీ నుంచి బయటకు పంపాలని రాష్ట్రంలోని పలువురు నేతలు పావులు కదుపుతున్నట్టు- తెలిసింది. పలుమార్లు పార్టీని, పార్టీ నేతలను ఇరుకున పెట్టేలా వ్యవహరించిన రాజాసింగ్‌ను వదిలించుకోవడానికి ఇదే కలిసి వచ్చిన సమయమని వారు భావిస్తున్నట్టు సమాచారం. ఇంకెంతకాలం ఆయనను భరించాలని పలువురు నేతలు పార్టీ అధిష్ఠానం పెద్దల వద్ద ప్రస్తావించినట్టు తెల్సింది. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి, సంస్థాగత వ్యవహారాల జాతీయ కార్యదర్శి తదితరులకు ఇదే విషయాన్ని రాష్ట్ర పార్టీ నివేదించినట్టు- సమాచారం. ఈ మేరకు రాష్ట్ర పార్టీ కేంద్ర పార్టీకి ఒక లేఖను కూడా పంపినట్టు- తెలిసింది. లేఖపై సంతకం చేసిన వారిలో కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండిసంజయ్, కొత్త అధ్యక్షుడు రాంచందర్‌రావు సహా ముఖ్య నేతలంతా ఉన్నట్టు- చెప్తున్నారు. కేంద్ర నాయకత్వం నుంచి గ్రీన్‌సిగ్నల్ ఇస్తే స్పీకర్‌కు రాజాసింగ్‌పై పార్టీ నిర్ణయాన్ని వివరిస్తూ లేఖ రాయాలని నిర్ణయించినట్టు- తెలిసింది. పార్టీ ఆదేశాలు వస్తే అప్పుడు స్పీకర్‌కు లేఖ ఇస్తామని బీజేపీకి చెందిన కీలక నేత ఒకరు వెల్లడించారు. ఒకవేళ బీజేపీ కేంద్ర నాయకత్వం సమ్మతిస్తే జూలై నెలాఖరులోపే రాజాసింగ్ వ్యవహారం తేలిపోతుందని బీజేపీ వర్గాలు చెప్తున్నాయి. పార్టీతోపాటు- అసెంబ్లీ స్పీకర్ కూడా ఆయన రాజీనామాను ఆమోదిస్తే గోషామహల్‌లో ఉప ఎన్నిక తప్పదని తెలుస్తున్నది. జూబ్లీహిల్స్‌తోపాటే గోషామహల్‌కు కూడా ఉప ఎన్నిక జరిగే అవకాశాలు ఉంటాయి. బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు అక్టోబర్‌లో షెడ్యూల్ విడుదల కానుంది. అప్పుడే రాష్ట్రంలోని ఈ రెండు నియోజకవర్గాలకు కూడా ఉప ఎన్నికకు సంబంధించిన నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉంది.

# కోటి మహిళలను కోటీశ్వరులను చేస్తాం

### అద్దె బస్సులు అందించిన మహిళా సంఘాలకు చెక్కులు
### ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో భట్టి

**హైదరాబాద్,జూలై5 :** అవకాశం ఉన్న ప్రతిచోట మహిళలకు ఆర్థిక భరోసా కల్పిస్తామని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. తమ ప్రభుత్వం మహిళా సంఘాలకు అండగా ఉంటుందని చెప్పారు. ప్రజాభవన్‌లో ఇందిరా మహిళా శక్తి సంబరాలు నిర్వహించారు. ఆర్టీసీకి అద్దె బస్సులు అందించిన మహిళా సంఘాలకు చెక్కులు పంపిణీ చేశారు. తొలి నెల అద్దె కింద రూ.1.49 కోట్లు- ఆయా సంఘాలకు.. మంత్రులు భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్, సీతక్క అందించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. మహిళలు వ్యాపారవేత్తలుగా రాణించేందుకు ప్రోత్సహిస్తున్నా మన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నట్లు చెప్పారు. ఐదేళ్లలో వారికి రూ.లక్ష కోట్ల రుణాలు ఇవ్వాలనేది లక్ష్యమన్నారు. ఈ నెల 8న అన్ని మండలాల్లో ప్రభుత్వ కార్యక్రమాలపై చర్చించాలి. మహిళలకు ప్రభుత్వం కల్పిస్తున్న లబ్ధి గురించి చర్చించాలి. గ్రామాలు, మండలాల్లో మహిళా సమాఖ్య సమావేశాలు ఏర్పాటు- చేయాలి. ఈనెల 10 నుంచి 16 వరకు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సమావేశాలు ఉంటాయి. వడ్డీ లేని రుణాల నగదును చెక్కుల రూపంలో అందిస్తాం. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయంపై ప్రజలకు వివరించాలని భట్టి విక్రమార్క తెలిపారు.



ప్రజల
నేటి సాక్షి
TGTEL/25/A0100 | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాల వార్తలుగా..
ఆదివారం
6 జూలై 2025
హైదరాబాద్


# వ్యవసాయంపై ఎక్కడ చర్చ పెట్టినా సిద్ధమే

**సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఈనెల 8న సిద్ధంగా ఉంటా**

**ఎవరు రైతులకు మేలు చేశారో...చేయలేదో తేలుస్తాం**

**ఈ చర్చకు కేసీఆర్ అవసరం లేదు... నేను చాలు**

**మీడియా సమావేశంలో రేవంత్‌కు కేటీఆర్ ప్రతిసవాల్**




**హైదరాబాద్, జూలై 5 :** వ్యవసాయంపై ఎక్కడ చర్చ పెట్టినా రావడానికి సిద్ధమని బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పార్టీ నేతలతో కలిసి ఆయన మాట్లాడారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఈనెల 8న సిద్ధంగా ఉంటానని, సీఎం రేవంత్‌రెడ్డి చర్చకు రావాలన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పాలనపై కేటీఆర్ ధ్వజమెత్తారు. రైతుల బాగుపై కాంగ్రెస్ పార్టీ నేతల మాటలు.. దయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉందని ఎద్దేవా చేశారు. ఇందిరమ్మ రాజ్యం అంటే ఎరువులు, విత్తనాల కోసం రైతులు క్యూలైన్లలో చెప్పులు పెట్టడమేనా అని ప్రశ్నించారు. కొత్త రాష్ట్రాన్ని కేంద్రం ఇబ్బందులు పెట్టినా కేసీఆర్ నిలబడ్డారని గుర్తు చేశారు. తెలంగాణను కోటి ఎకరాల మాగాణిగా మార్చిన ఘనత కేసీఆర్‌దేనని అన్నారు. నీటికి పల్లం ఎలా తెలుసో తెలంగాణ కు నీరు ఎవరు తీసుకు వచ్చారో అందరికి తెలుసు.. తెలంగాణ లో ఏ రైతును, ఎద్దును అడిగినా వ్యవసాయం పండుగ ఎవరు చేశారో చెప్తారు.. సీఎం నిన్న రంకెలు వేశాడు.. ఆయన సభ పెట్టాడంటే బూతులతోనే మాట్లాడతాడు.. మా పార్టీ తరుపున మీ సవాలు స్వీకరిస్తున్నాం.. ఎక్కడ చర్చ పెట్టినా వస్తాం.. మీకు కేసీఆర్ అవసరం లేదు.. మేము చాలు.. 72 గంటలు ఇస్తున్నాం.. మీరు ప్రిపేర్ అయి రండి.. సీఎంకు బేసిన్ లు తెలియదు బెండకాయలు తెలియదు.. సమైక్య రాష్ట్రంలో నీళ్లు ఇవ్వలేదు కాబట్టే తెలంగాణ ఉద్యమం పుట్టింది..సీఎం రేవంత్ రెడ్డి హయాంలో నీళ్లు ఆంధ్రకు, నిధులు ఢిల్లీకి, నియామకాలు ఆయన అనునాయులకు వచ్చాయని అంటూ విమర్శలు గుప్పించారు. ఇందిరమ్మ రాజ్యం గొప్పతనం తెలియాలి అంటే బట్టలు విప్పి కొడతాం అన్నారు.. బనకచర్ల ద్వారా మీ గురువు చంద్రబాబు తీసుకెళ్తుంటే మీ తీరు తెలంగాణ సమాజం చూస్తూనే ఉంది. బురద జల్లి తప్పించుకునే అలవాటు సీఎం కి ఉంది.. 8 వ తారీఖు 11 గంటలకు సోమజిగూడా ప్రెస్ క్లబ్ కు మేము వస్తాము.. మీరు రండి మీడియా ముందే చర్చిద్దాం.. కేసీఆర్ ప్రభుత్వం నాట్లు వచ్చినప్పుడు రైతు బంధు ఇచ్చేది... ఓట్లు వచ్చేముందు రైతు భరోసా ఇస్తుంది కాంగ్రెస్.. ఇప్పటి వరకు రైతులకు ఎకరానికి 19 వేలు ఎగ్గొట్టారు. అన్నదాతకు సున్నం పెట్టింది కాంగ్రెస్ ప్రభుత్వం.. మందికి పుట్టిన బిడ్డలు నా బిడ్డలు అనడానికి సిగ్గు లేదా.. మేము ఇచ్చిన ఉద్యోగాలు మీరు ఇచ్చినట్లు- చెప్పుకుంటున్నారు.. అశోక్ నగర్ లో చర్చకు వస్తావా.. ఈ మూడు రోజులు మీకు టైం ఇస్తున్నాం.. అప్పటివరకు మీరు చెప్పకుంటే.. 8వ తేదీన మేము సోమజిగూడా ప్రెస్‌క్లబ్ లో సిద్ధం గా ఉంటాం.. మీలాగా మందబలంతో కాకుండా 10,15 మందితో వస్తాం.. ఈయన ఇచ్చే డబ్బులతో ఢిల్లీ టకీ టకీ అని మోగుతున్నాయి.. కాంగ్రెస్ ఎమ్మెల్యే చెప్పినట్లు- చంద్రబాబు కోవర్ట్ రేవంత్ రెడ్డినే.. ఆ ఎమ్మెల్యే చాలా కరెక్టు గా చెప్పాడు.. అలా చెప్పిన ఎమ్మెల్యేను అభినందిస్తున్నాను అని కేటీఆర్ తెలిపారు.

## ఆస్పత్రి నుంచి కేసీఆర్ డిశ్చార్జ్

**హైదరాబాద్,జూలై5 :** మాజీ ముఖ్యమంత్రి, భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ సోమాజిగూడ యశోద ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. సాధారణ ఆరోగ్య పరీక్షల్లో భాగంగా ఆయన గురువారం ఆసుపత్రిలో చేరారు. బ్లడ్ షుగర్, సోడియం స్థాయిలు మానిటర్ చేయడానికి ఆసుపత్రిలో చేరాల్సిందిగా వైద్యులు సూచించారు. దీంతో ఆయన రెండు రోజులు అక్కడే ఉండి చికిత్స పొందారు. ప్రస్తుతం కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి మెరుగుపడటంతో శనివారం ఉదయం ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయి నందినగర్‌లోని నివాసానికి వెళ్లారు.

# అసెంబ్లీలోనే చర్చిద్దాం

**ఏ అంశమైనా చర్చకు మేం సిద్ధం**

**కెటిఆర్ వ్యాఖ్యలపై మంత్రి పొన్నం స్పందన**



**హైదరాబాద్,జూలై5 :** ఏ అంశమైనా చర్చకు అసెంబ్లీ దేవాలయం లాంటిదని, అక్కడే అన్ని విషయాలు చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ సవాల్ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. బనకచర్ల , రాష్ట్రంలో అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలకు సంబంధించి ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ శాసనసభ స్పీకర్‌కి లేఖ రాస్తే అసెంబ్లీలో చర్చకు సిద్ధమని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. విదేశాలకు వెళ్లడంతో ఈ విషయం కేటీఆర్‌కి తెలియకపోవచ్చని ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రజలకు వాస్తవాలు తెలియాలంటే దేవాలయం లాంటి అసెంబ్లీలో చర్చ జరగాలని అన్నారు. ఎక్కడో ప్రెస్‌క్లబ్‌లో ఇలాంటి చర్చలు సహేతుకం కాదన్నారు. అసెంబ్లీలో చర్చకు సిద్ధమని సవాల్ చేయాల్సిన కేటీఆర్ ప్రెస్ క్లబ్‌లో చర్చ చేద్దాం అంటున్నారని ఎద్దేవా చేశారు. ప్రెస్ క్లబ్‌లో చర్చ చేయడం సరైన విధానం కాదు. తెలంగాణ ప్రజానీకానికి తెలియాలంటే అసెంబ్లీలోనే చర్చ జరగాలి. చర్చకు మేము సిద్ధమని స్పష్టం చేశారు. కేటీఆర్‌కు సవాల్ విసురుతున్నా.. చర్చ బషీర్ బాగ్‌లో కాదు శాసన సభలో చేద్దాం. ప్రత్యేక అసెంబ్లీ సమావేశం ఏర్పాటు చేయండని కేసీఆర్‌తో లేఖ రాయించండని సూచించారు. బనకచర్లకు పునాది వేసింది బీఆర్ఎస్.. బేసిన్లు, భేషజాలు లేవని ఏపీకి నీటిని కట్టబెట్టింది ఆ పార్టీనేనని ఆరోపించారు. గతంలో ఏపీ మాజీ సీఎం జగన్‌తో నీటి ఒప్పందాలు చేసుకుంది ఎవరని ప్రశ్నించారు. పోతిరెడ్డిపాడు, బనకచర్లపై అప్పుడు మౌనంగా ఉన్నది ఎవరని నిలదీశారు. తెలంగాణకు అన్యాయం చేసింది ముమ్మాటికీ బీఆర్ఎస్ పార్టీనేనని విమర్శించారు. ఇవన్నీ మరచి సవాళ్లు చేస్తే ప్రజలు నమ్మరని అన్నారు. అలాగే కేసీఆర్ను అసెంబ్లీకి వచ్చి చర్చలో పాల్గొనమని చెప్పండన్నారు. మేము చర్చకు భయపడే వాళ్లం కాదన్నారు. అసెంబ్లీకి రాకుండా బయట సవాళ్లు చేయడం ఏంటని ఫైర్ అయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచి చూపిస్తామని కేటీఆర్ వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చారు.

# భర్తలను పొట్టన పెట్టుకుంటున్న భార్యలు

**పరాయి మగాడి మోజులు హత్యలు.. బాచుపపల్లిలో మరో ఘటన**



**హైదరాబాద్,జూలై 5 :** ఈ మధ్య ప్రియుడి కోసం భార్యలు కట్టుకున్న భర్తలను క్రూరంగా హతమారుస్తున్న ఘటనలు వెలుగు చూస్తేనే ఉన్నాయి. తాజాగా అలాంటి ఓ ఘటన నారాయణపేట జిల్లా పరిధిలో చోటు- చేసుకుంది. ప్రియుడితో మాట్లాడొద్దని చెప్పినందుకు కట్టుకున్న భర్తని దారుణంగా హత్య చేసింది ఓ భార్య. భర్తను హత్య చేసి ఆత్మహత్యగా క్రియేట్ చేసింది. తాగిన మత్తులో ఉన్న భర్త ఛాతిపై కూర్చొని గొంతు నులిమి కిరాతకంగా చంపింది. కర్ణాటక సరిహద్దులోని నారాయణపేట జిల్లా(మండలం) కోటకొండ గ్రామానికి చెందిన అంజిల(32)కు ధన్వాడ మండలం రాంకిష్టయ్య పల్లి గ్రామానికి చెందిన రాధతో పదేళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు. బతుకుదెరువు నిమిత్తం హైదరాబాద్‌లోని బాచుపల్లికి వచ్చారు. ఇక్కడే కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇంతలో రాధ ధన్వాడకు చెందిన ఓ యువకుడితో వివాహేతర బంధం పెట్టుకుంది. ఈ విషయం కాస్త అంజిలప్పకు తెలిసింది. దీంతో ఆ యువకుడితో మాట్లాడొద్దని అంజిలప్ప రాధను మందలించాడు. దీంతో భర్తను అడ్డుతొలగించుకోవాలని భార్య ప్లాన్ వేసింది. గత నెల 23న తాగిన మత్తులో ఉన్న భర్త అంజిలప్ప పడుకుని ఉండగా.. గొంతు నులిమి హత్య చేసింది.తన భర్త అకస్మాత్తుగా చనిపోయాడని అందరినీ నమ్మించింది. అంత్యక్రియల కోసం భర్త మృతదేహాన్ని గ్రామానికి తీసుకెళ్లింది. మృతదేహం గొంతుపై ఉన్న గాయాలు గమనించిన కుటుంబీకులు పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. పోస్టుమార్టంలో గొంతుపై ఒత్తిడి వేయడం వల్ల అంజిలప్ప మరణించినట్లు- తేలింది. దీంతో భార్యను అనుమానించిన పోలీసులు.. తమదైన రీతిలో విచారించారు. భర్తను తానే చంపినట్లు భార్య రాధ ఒప్పుకుంది. తన ప్రియుడితో మాట్లాడ వద్దని మందలించడం వల్లనే చంపానని చెప్పింది. ఆమెను అరెస్ట్ చేసిన బాచుపల్లి పోలీసులు రిమాండ్ కు తరలించారు.

# డెడ్ అయిన పార్టీ డెడ్‌లైన్లు పెట్టడమేంటి?

**కెటిఆర్ వ్యాఖ్యలపై మండిపడ్డ సీతక్క**

**హైదరాబాద్,జూలై5 :** కేటీఆర్ గుర్తింపు సమస్యతో బాధపడుతున్నాడని, ఏం మాట్లాడుతున్నారో ఆయనకే అర్థం కావడం లేదని మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. అసెంబ్లీ లో చర్చిద్దాం రా అంటే...ప్రెస్ క్లబ్ కు రమ్మనడం ఏంటని మంత్రి సీతక్క సెటైర్ వేశారు. మంత్రి సీతక్క ప్రజా భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి విసిరిన సవాల్‌కు కేటీ-ఆర్ స్పందించిన తీరుపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి విసిరిన సవాల్ కు కేటీ-ఆర్ కు అర్థం కానట్లు- ఉందని, విదేశాలలో ఉన్న కేటీఆర్ తెలంగాణకు వచ్చినట్లు- చెప్పేందుకే ప్రెస్ మీట్ పెట్టినట్టుగా ఉందన్నారు. ప్రజలు ఎమ్మెల్యేలుగా ఎన్నుకున్నది ప్రెస్‌క్లబ్ లో చర్చించడానికి కాదని, అసెంబ్లీలో చర్చించ మంటే.. ప్రెస్ క్లబ్ కు రావాలని కోరడం ఏంటని ఆమె అన్నారు. 72 గంటల డె÷-లడైన్ అంటూ అర్థం పర్థం లేని మాటలు మాట్లాడుతున్నాడని, డెడ్ అయిన పార్టీ డెడ్ లైన్ పెట్టడం విడ్డూరంగా ఉందని, నీ సొంత చెల్లే ..నిన్ను నాయకునిగా గుర్తించడం లేదని, ప్రతిపక్ష నాయకుడు అసెంబ్లీ కి రాడా... సమస్యల పై చర్చిందాం రా అంటే భయమెందుకు అని ఆమె ప్రశ్నించారు.

# అసెంబ్లీకి రమ్మంటే భయమెందుకు

**చర్చటంలే ప్రెస్ క్లబ్‌లో పెడతారా**

**కెటిఆర్, హరీష్ సెకండ్ బెంచ్ లీడర్స్**

**బిఆర్ఎస్ నేతల తీరుపై మండిపడ్డ జగ్గారెడ్డి**



**హైదరాబాద్,జూలై5 :** తీవ్ర విమర్శలు, ప్రతివిమర్శలతో తెలంగాణ రాజకీయాలు వేడెక్కుతున్న క్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీలో చర్చ జరగాలన్న సీఎం రేవంత్ రెడ్డి పిలుపుపై బీఆర్ఎస్ నేతలు చర్చకు భయపడుతున్నారని, అసెంబ్లీని తప్పించుకుంటున్నారని ఆయన ధ్వజమెత్తారు. తెలంగాణలో విచిత్రమైన పరిస్థితి కనిపిస్తోంది. ప్రతిపక్ష పార్టీలు అధికార పక్షాన్ని అసెంబ్లీ పెట్టాలని కోరుతాయని, కానీ అందుకు విపక్ష బిఆర్ఎస్ సిద్దంగా లేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ పెడతా, ప్రతిపక్ష నాయకుడు రావాలి అంటున్నాడు, కానీ కెసిఆర్ అందుకు సిద్దంగా లేదని జగ్గారెడ్డి పేర్కొన్నారు. అసెంబ్లీ చర్చను పక్కనపెట్టి ప్రెస్ క్లబ్‌కు, బోట్స్ క్లబ్‌కు రావాలని కేటీఆర్ పిలవడాన్ని ఆయన ఎద్దేవా చేశారు. ఇంకా రెండు రోజులు గడిస్తే... కల్లు దుకాణం దగ్గర రా అంటాడేమో కేటీఆర్, అంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష నాయకుడి స్థానంలో సెకండ్ బెంచ్ నాయకులు మాట్లాడుతుండటాన్ని కూడా జగ్గారెడ్డి తీవ్రంగా ఖండించారు. కేటీఆర్, హరీష్‌రావు లాంటి నేతలు మొదటి బెంచ్‌కు చెందకుండా సెకండ్ బెంచ్‌లో ఉంటూ మాట్లాడుతున్నారు. అసలు అసెంబ్లీలో చర్చకు రావాలంటే వీళ్లెందుకు మధ్యలో వస్తున్నారని ఆయన ప్రశ్నించారు. కేటీఆర్, కేసీఆర్ గతంలో ఆంధ్రావారిపై చేసిన వ్యాఖ్యలను గుర్తు చేస్తూ, ఇప్పుడు వారి తీరుపై ప్రశ్నించారు. 'ఆంధ్రోళ్లను తిట్టింది నువ్వే. కాళ్లకు ముళ్ళు గుచ్చుకుంటే నోటితో తీయమన్నది కేసీఆర్. కానీ ఇప్పుడు నీళ్లను దొంగతనం చేసినవాళ్లను ఇంటికి పిలిచి మీటింగ్ పెడుతున్నారని జగ్గారెడ్డి విమర్శించారు. పోలీసులను అడ్డం పెట్టుకుని బీఆర్ఎస్ పాలన కొనసాగిందని, ఫోన్ ట్యాపింగ్ జరిగిందని ఆరోపించారు. మా ఫోన్లు వింటూ మీరు పరిపాలించారు. ఇప్పుడు అదే మీ ఇంట్లో జరిగితే కోపం రాకుండా ఉంటుందా? అని ప్రశ్నించారు. ఇక చంద్రబాబు, కేసీఆర్ మధ్య సంబంధాన్ని గుర్తు చేస్తూ... 'కేసీఆర్ కూడా చంద్రబాబుకే శిష్యుడు. ఇద్దరూ యూత్ కాంగ్రెస్‌లో పనిచేశారు. రేవంత్ మీద చంద్రబాబు కోవర్ట్ అన్న ఆరోపణల ముందు... మీ గతాన్ని కూడా గుర్తు పెట్టుకోండని అంటూ విమర్శలు చేశారు. కేసీఆర్ పాలనలో చేసిన పద్ధతులకు రేవంత్ ఇంకా ఓపికగా స్పందిస్తున్నారని, ఆయన గడ్డం పట్టుకుని మాట్లాడుతున్నారు. అసెంబ్లీలో చర్చ చేద్దామంటే... బయట వేదికలు ఎందుకని అన్నారు.

# పనివేళలను సవరించిన ప్రభుత్వం

**హైదరాబాద్,జూలై 5 :** వాణిజ్య కేంద్రాల్లో ఉద్యోగుల పని వేళల పరిమితిని తెలంగాణ ప్రభుత్వం సవరించింది. రోజుకు 10 గంటల వరకు పని చేసేందుకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వారంలో పని వేళలు 48 గంటలు మించరాదని స్పష్టం చేసింది. పరిమితి దాటితే ఓటీ వేతనం చెల్లించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. రోజులో 6 గంటల్లో కనీసం అరగంట విశ్రాంతి ఇవ్వాలని, విశ్రాంతితో కలిపి 12 గంటల కంటే ఎక్కువ పని చేయించరాదని ఆదేశించింది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా పని వేళలు సవరించినట్లు ప్రభుత్వం వెల్లడించింది.

# అడ్వాన్స్‌డ్ పీజీ డిప్లొమా పరీక్షలు వాయిదా

**హైదరాబాద్, జూలై 5 :** ఉస్మానియా యూనివర్సిటీ- పరిధిలోని అడ్వాన్స్‌డ్ పీజీ డిప్లొమా ఇన్ బయో ఇన్ఫర్మేటిక్స్ పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు ఓయూ ఎగ్జామ్స్ కంట్రోలర్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు రెండో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈనెల ఏడవ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు- గతంలో ప్రకటించినప్పటికీ, వివిధ కారణాల రీత్యా ఈ పరీక్షలను వాయిదా వేసినట్లు- చెప్పారు. ఈ పరీక్షలను తిరిగి ఈ నెల 23వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు- ప్రకటించారు. పరీక్ష కేంద్రం, సమయంలో మార్పు ఉండబోదని స్పష్టం చేశారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్‌లో చూసుకోవాలని సూచించారు.

# శ్రీకృష్ణనగర్ బస్తీలో మురుగునీరు పారకం

**మున్సిపల్ అధికారుల తీరుపై కేంద్రమంత్రి ఆగ్రహం**

**హైదరాబాద్,జూలై5 :** కాలనీల్లో మురుగునీరు ప్రవహిస్తున్నా చర్యలు తీసుకోరా అంటూ.. మున్సిపల్ అధికారులపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ ఇంటిముందు ఇలా ఉంటే ఎలా ఉంటుందో ఊహించారా అని అన్నారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని శ్రీకృష్ణనగర్ బస్తీలో శనివారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పర్యటించారు. స్థానిక కమ్యూనిటీ- హాల్ సీ బ్లాక్‌లో ఇళ్ల ముందు పెద్ద ఎత్తున మురుగునీరు పారుతుండటంతో తీవ్ర అసహనానికి గురయ్యారు. గత కొన్ని రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతోందని స్థానికులు కిషన్‌రెడ్డి ఎదుట వాపోయారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఫిర్యాదు చేశారు. దీంతో తీవ్ర ఆగ్రహం చెందిన ఆయన.. జీహెచ్‌ఎంసీ కమిషనర్‌తో ఫోన్లో మాట్లాడారు. వెంటనే మురుగు సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. 'మీ ఇంటి ముందు ఇలా మురుగు ఉంటే ఒక్క నిమిషమైనా ఉండగలరా?' అని తీవ్రంగా మందలించారు. వారం రోజుల్లోగా సమస్యను పరిష్కరించాలన్నారు.



# భారీ వర్షాలు వరదలతో హిమాచల్ అతలాకుతలం




## టెక్సాస్‌లో భారీ వర్షాలతో వరదలు

**24మంది మృతి ..30మంది బాలికల గల్లంతు**

**న్యూయార్క్:** అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రంలో గత కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురు-స్తున్నాయి. దీంతో వరదలు సంభవించాయి. టెక్సాస్ రాష్ట్రంలో భారీ వర్షాలు కురవడంతో నదులు ప్రమాద స్థాయిని దాటి ప్రవహిస్తున్నాయి. టెక్సాస్ వరదలు ముంచెత్తడంతో ప్రజలు విలవిలలాడి పోతున్నారు. భారీ వరదలు విలయతాండవం సృష్టించడంతో 24 మంది మృతి చెందారు. 30 మంది బాలికలు గల్లంతైనట్టు సమాచారం. పోలీసులు, రెస్క్యూ సిబ్బంది గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. గ్వాడాలు పే నది ఉప్పొంగ ప్రవహిస్తుండడంతో లోతట్టు- ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఈ ప్రకృతి విపత్తులో ఇప్పటివరకు 24 మంది ప్రాణాలు కోల్పోగా.. మరో 20 మందికి పైగా బాలికలు గల్లంతయ్యారు. వీరికోసం రెస్క్యూ సిబ్బంది ముమ్మరంగా గాలిస్తున్నారు. వర్షాల కారణంగా హంట్ ప్రాంతంలోని గ్వాడాలుపే నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అనేక నివాసాలు నీట మునిగాయి. వీధుల్లోకి భారీగా వరద నీరు చేరింది. ఇప్పటి వరకు 24 మంది మృతి చెందినట్లు స్థానిక అధికారులు ధ్రువీకరించారు. వరదల్లో చిక్కుకున్న దాదాపు 200 మందికి పైగా ప్రజలను రక్షించారు. గ్వాడాలుపే నదీ తీరంలో ఉన్న ప్రముఖ క్రిస్టియన్ క్యాంప్‌లో వేసవి శిక్షణాశిబిరం నిర్వహిస్తున్నారు. ఈ క్యాంప్‌ను వరదలు ముంచెత్తడంతో ఇందులో దాదాపు 23-25 మంది బాలికలు గల్లంతైనట్లు అధికారులు వెల్లడించారు. దీంతో ఈ బాలికల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. వారి ఆచూకీ తెలియజేయాలంటూ సామాజిక మాధ్యమాల్లో ఫొటోలు షేర్ చేస్తున్నారు. మరోవైపు, బాలికల కోసం అధికారులు తీవ్రంగా గాలిస్తున్నారు. పడవలు, హెలికాప్టర్ల సాయంతో గాలింపు చర్యలు చేపట్టారు.

## ట్రంప్ సుంకాలకు తలొగ్గుతారు చూడండి

**పీయూష్ గోయల్ వ్యాఖ్యలకు రాహుల్ కౌంటర్**

**న్యూఢిల్లీ,జులై5 :** ట్రంప్ సుంకాలకు ప్రధాని మోదీ తలొగ్గుతారని.. తన మాటలు నమ్మకపోతే రాసిపెట్టుకోవాలని విపక్షనేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ గుండెలు బాదుకోవడం తప్ప చేసేదేమీ ఉండదని రాహుల్ పేర్కొన్నారు. మూడు నెలల క్రితం భారత్‌పై 26 శాతం సుంకాలు విధిస్తున్నట్లు- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. 90 రోజుల విరామం తర్వాత అది అమల్లోకి రాకుండా ఉండేందుకు వాణిజ్య ఒప్పందం చేసుకోవడానికి భారత్ ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అగ్రనేత కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా పరస్పర సుంకాల సస్పెన్షన్ జులై 9న ముగియనున్నందున, ఆ గడువుకు ముందే చర్చలు పూర్తి చేయాలని ఇరుదేశాలు భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాల విషయంలో భారత్ పటిష్ఠ విధానాలను కలిగిఉందని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. సమయం దాటిపోతున్నా ప్రధాని మోదీ సుంకాల తగ్గింపునకు అగ్రరాజ్యంతో ఎటువంటి చర్చలు జరపట్లేదని ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీ ఇలాగే నిశ్శబ్దంగా ఉండి చివరికి ట్రంప్ విధించిన సుంకాలకు తలొగ్గడం తప్ప వేరే దారి ఉండదని వ్యాఖ్యానించారు.

## మహారాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామం

**ఒకేవేదికను పంచుకున్న ఠాక్రే సోదరులు**

**దాదాపు 20 ఏళ్ల తరవాత ఒక్కటైన వేళ**

**ఇక కలిసే సాగుతామని ఇద్దరూ ప్రకటన**



**ముంబై,జులై5 :** మహారాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. థాక్రే సోదరులు ఉద్ధవ్ థాక్రే, రాజ్ థాక్రే మళ్లీ కలిశారు. దాదాపు 20 ఏళ్ల తర్వాత ఒకే వేదిక పంచుకున్నారు. ఇకపై ఇద్దరం కలిసే ఉంటామని ఈ సందర్భంగా సోదరులు స్పష్టం చేశారు. దాదాపు 20 ఏళ్ల తర్వాత విడిపోయిన అన్నదమ్ములు ఉద్ధవ్ ఠాక్రే, రాజ్ ఠాక్రే శనివారంనాడు ఒకే వేదకను పంచుకోవడం మహారాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామంగా మారింది. కుటుంబ సమేతంగా ఈ ఇరువురు నేతలు పాల్గొన్నారు. తమను ఒకచోట చేర్చడం ఎవరికీ సాధ్యం కాలేదని, బాల్ ఠాక్రే సైతం చేయలేకపోయిన పనిని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ రాష్ట్రానికి వ్యతిరేకంగా నిర్ణయం తీసుకోవడం ద్వారా చేశారని రాజ్ ఠాక్రే ఈ సందర్భంగా వ్యాఖ్యానించడం ఆసక్తిగా మారింది. త్రిభాషా విధానం అమలుకు సంబంధించిన ఉత్తర్వులను మహారాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే ఉపసంహరించు కున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఇవాళ ముంబైలో 'వాయిస్ ఆఫ్ మరాఠీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శివసేన చీఫ్ ఉద్ధవ్ థాక్రే, మహారాష్ట్ర నవ నిర్మాణ సేన చీఫ్ రాజ్ థాక్రే ఇద్దరూ కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇద్దరూ ఆప్యాయంగా మాట్లాడుకున్నారు. 2005లో విడిపోయిన ఈ ఇద్దరు అన్నదమ్ములు 20 ఏళ్ల తర్వాత ఇప్పుడు మళ్లీ కలుసుకోవడం మహా రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది. అన్నదమ్ముల కలయికపై ఇరు పార్టీల కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.మరోవైపు మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ వల్లే తాము కలిశామని రాజ్ థాక్రే వ్యాఖ్యానించారు. సీఎం రాష్ట్రానికి వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయమే తమని కలిపిందన్నారు. అనుకోకుండానే ఒకే వేదికపై చేర్చారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై థాక్రే సోదరులు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఇకపై తామిద్దరం ఒక్కటిగా ఉంటామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. కాగా, అన్నదమ్ములిద్దరూ చివరి సారిగా 2005లో ఒకేవేదికపై కనిపించారు. ఆ తర్వాత శివసేనలో గొడవల కారణంగా రాజ్ థాక్రే పార్టీ వీడారు. 2006 మార్చి 9వ తేదీన సొంతంగా మహారాష్ట్ర నవ నిర్మాణ సేనను స్థాపించారు.కాగా, రాజ్ వ్యాఖ్యలపై దేవేంద్ర ఫడ్నవిస్ తొలిసారి స్పందించారు. ఠాక్రే కజిన్లను కలిపానంటూ తనకు క్రెడిట్ ఇవ్వడంపై ఫడ్నవిస్ థాంక్స్ చెప్పారు.

## వరదలతో కొట్టుకుపోయిన రోడ్లు, భవనాలు, వంతెనలు

**ఇప్పటికే 72 మంది మృతి చెందారని వెల్లడి**

**700 కోట్లకు పైగానష్టం వాటిల్లిందన్న సిఎం సుఖ్వీందర్**



**సిమ్లా,జులై 5 :** హిమాచల్ ప్రదేశ్‌లో రుతుపవనాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. వీటి ప్రభావంతో కురుస్తున్న కుండపోత వర్షాలతో హిమాచల్ ప్రాంతంలో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. నదులు పొంగి ప్రవహిస్తున్నాయి. కొండచరియలు విరిగి పడుతున్నారు. ఇప్పటివరకూ 72 మంది మృతి చెందారు. 40 మంది గల్లంతయ్యారు. ఎడతెరిపి లేకుండా భారీగా కురుస్తున్న వర్షాల కారణంగా 500కి పైగా రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. రాష్ట్రంలో వరద సహాయక చర్యలు ముమ్మరం కొనసాగుతున్నాయి. 7 వరకు భారీ వర్షాలు కొనసాగుతాయని అంచనా నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉన్నారు. ఈ ఏడాది భారీ వర్షాలతో హిమాచల్ ప్రదేశ్ అతలాకుతలమవుతోంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో రాష్ట్రవ్యాప్తంగా ఆకస్మిక వరదలు, భారీగా కొండచరియలు విరిగిపడ్డాయి. జూన్ 20న రుతుపవనాలు ప్రారంభమైనప్పటి నుండి కనీసం 72 మంది ప్రాణాలు కోల్పోయారని, 40 మంది గల్లంతయ్యారని, 100 మందికి పైగా గాయపడ్డారని ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖు నివేదించారు. రాష్ట్రంలో 14 ప్రాంతాల్లో భారీ వర్షాలు సంభవించాయని, మౌలిక సదుపాయాలను తీవ్రంగా దెబ్బతీశాయని ముఖ్యమంత్రి సుఖు చెప్పారు. రాష్ట్ర అత్యవసర ఆపరేషన్ సెంటర్ ప్రాథమిక అంచనాల ప్రకారం, భారీ వర్షాల వల్ల కలిగిన నష్టం రూ.541 కోట్లుగా అంచనా వేయగా, వాస్తవ నష్టాలు రూ.700 కోట్లకు దగ్గరగా ఉండవచ్చని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. నష్టానికి సంబంధించి ఇంకా నివేదికలు వస్తున్నాయి. అనేక భవనాలు, రోడ్లు, వంతెనలు కొట్టుకుపోయాయి. కాంగ్రా, సిర్మౌర్, మండి జిల్లాల్లో ఆదివారం అతి భారీ నుండి అతి భారీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని స్థానిక వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఇక ఇవాళ, సోమ, మంగళవారాల్లో ఉనా, బిలాస్‌పూర్, హమీర్‌పూర్, చంబా, సోలన్, సిమ్లా, కులు జిల్లాలకు కూడా ఆరంజ్ అలర్ట్స్ జారీ చేశారు. ఆరంజ్ అలర్ట్ తీవ్రమైన వాతావరణ ముప్పును సూచిస్తుంది. జిల్లాల వారీగా మృతుల సంఖ్య వివరాలు చూస్తే, మండిలో డజనుకు పైగా చనిపోగా, 40 మంది తప్పిపోయినట్లు- సమాచారం. కాంగ్రా జిల్లాలో 13 మంది మరణించారు. చంబా జిల్లాలో 6 గురు, సిమ్లా జిల్లాలో 5 మంది, బిలాస్‌పూర్, హమీర్‌పూర్, కిన్నౌర్, కులు, లాహౌల్ స్పితి, సిర్మౌర్, సోలన్, ఉనాలో కూడా మరణాలు సంభవించాయి. ఇప్పటికే పలు మార్లు రెడ్, ఆరంజ్ రెయిన్ అలర్ట్స్ జారీ చేశారు.



## ఎన్‌డిఎకు జాతి ప్రయోజనాలే ముఖ్యం

**ఏదేశంతో అయినా ఒప్పందాల్లో ఇదే ప్రధానం**

**కాంగ్రెస్ విమర్శలను తిప్పికొట్టిన కేంద్రమంత్రి పీయూష్**




**న్యూఢిల్లీ,జులై5 :** ఎన్డీఏ ప్రభుత్వానికి జాతీయ ప్రయోజనాలే మొదటి ప్రాధాన్యత అని కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు. దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని సుంకాల విషయంలో ప్రధాని ఓ నిర్ణయం తీసుకుంటారని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం దేశ ప్రజల గురించి పట్టించుకోక పోవడం వల్ల బలహీనంగా మారిన దేశాన్ని బలమైన, అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు ప్రధాని నరేంద్ర మోదీ కృషి చేస్తున్నారన్నని తెలిపారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీపై గోయల్ తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ హయాంలో ఆ పార్టీ నేతలు జాతీయ ప్రయోజనాలకు వ్యతిరేకమైన ఇతర దేశాలతో ఒప్పందాలు చేసుకున్నారని వ్యాఖ్యానించారు. భారత్‌కు ప్రపంచంలోని ఏ దేశంతో అయినా పోటీ- పడగలిగే సామర్థ్యం ఉందని తాము విశ్వాసిస్తున్నామన్నారు. ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగా ఉంటే మాత్రమే ఏ దేశంతో అయినా వాణిజ్య ఒప్పందాలు చేసుకోవడానికి భారత్ సంసిద్ధతను వ్యక్తం చేస్తుందని గోయల్ అన్నారు. అలా కానీ పక్షంలో ఎట్టిపరిస్థితుల్లోనే ప్రపంచ దేశాలతో వాణిజ్య సంబంధాలను ఏర్పరుచుకోమని స్పష్టం చేశారు. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భారత్.. మారిషస్, యునైటె-డ్ అరబ్ ఎమిరేట్స్, ఆస్ట్రేలియా, స్విట్జర్లాండ్, నార్వే, యూకే వంటి దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు చేసుకుందని గోయల్ వెల్లడించారు. ప్రస్తుతం ఈయూ దేశాల కూటమి, అమెరికా, ఒమన్, పెరూ, చిలీ సహా ఇతర అభివృద్ధి చెందిన దేశాలతోనూ వాణిజ్య సంబంధాలు కొనసాగిస్తోందని అన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్‌పై 26 శాతం సుంకాలు విధిస్తానని ప్రకటించిన విషయం తెలిసిందే. యూఎస్ పరస్పర సుంకాల సస్పెన్షన్ జులై 9న ముగియనున్నందున, ఆ గడువుకు ముందే చర్చలు పూర్తి చేయాలని ఇరుదేశాలు భావిస్తున్నాయి. గడువు ఆధారంగా కీలకమైన వాణిజ్య ఒప్పందాలను ఖరారు చేసుకునేందుకు దేశం ఎప్పుడూ తొందరపడదని అన్నారు. రెండు వర్గాలకు లాభదాయకంగా ఉంటేనే అంగీకరిస్తుందన్నారు. అమెరికాతో కుదుర్చుకోనున్న ఒప్పందంలో భాగంగా భారత్ కొన్ని కీలక రంగాల్లో సుంకాల నుంచి అగ్రరాజ్యాన్ని సడలింపు కోరుతోంది. ఇందులో టెక్స్టైల్స్, రత్నాలు, ఆభరణాలు, దుస్తులు, ఎ÷-లాస్టిక్స్, రసాయనాలు, రొయ్యలు, నూనె గింజలు, ద్రాక్ష, అరటిపండ్లు వంటివి ఉన్నాయి. మరోవైపు అమెరికా కొన్ని పారిశ్రామిక వస్తువులు, ఆటోమొబైల్స్ (ముఖ్యంగా ఎలక్ట్రిక్ర్ వాహనాలు), వైన్స్, పెట్రో కెమికల్ ఉత్పత్తులు, పాడి ఉత్పత్తులు రంగాల్లో సుంకాల సడలింపు కోరుతోంది. అయితే ఈ సడలింపులను ఆమోదిస్తే, మన దేశంలో రైతుల ప్రయోజనాలు దెబ్బతింటాయనే ఆందోళన ఉంది. ఇది రాజకీయంగా సున్నిత అంశమైనందున, వ్యవసాయ ఉత్పత్తులపై సుంకం మినహాయింపులకు భారత్ ససేమిరా అంటోంది. వాణిజ్య చర్చల నిమిత్తం ఇటీవల అమెరికా వెళ్లిన భారత బృందం తిరిగివచ్చింది. దీంతో అమెరికా-భారత్ మధ్య ఈనెల 9లోగా మధ్యంతర వాణిజ్య ఒప్పందం కుదిరే అవకాశం ఉన్నట్లు- తెలుస్తోంది.

## అమర్‌నాథ్ మార్గంలో ప్రమాదం


**వరుసగా ఢీకొన్న బస్సులు**

**శ్రీనగర్,జులై5 :** అమర్‌నాథ్ యాత్రికులు వెళ్తోన్న బస్సులకు ప్రమాదం జరిగింది. వరుసగా ఒకదానినొకటి ఐదు బస్సులు ఢీకొనడంతో 36 మంది యాత్రికులు గాయపడ్డారు. జమ్మూకశ్మీర్లోని రాంబన్ జిల్లా చందర్‌కోట్ వద్ద పహల్గాం బేస్ క్యాంప్‌నకు వెళ్తుండగా ఈ ఘటన చోటు-చేసుకుంది. క్షతగాత్రులను రాంబన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. యాత్రికులు అల్పాహారం చేయడం కోసం చందర్‌కోట్ వద్ద వాహనాలు నిలిపిఉంచారు. అప్పుడే ఒక బస్సు నియంత్రణ కోల్పోయి, ఆగిఉన్న వాటిని ఢీకొట్టింది. దాంతో వాహనాలు ఒకదానికొకటి ఢీకొనడంతో యాత్రికులు గాయపడ్డారు. ప్రమాదం జరిగి నప్పటికీ బాధితుల్లో ఎక్కువమంది యాత్రను కొనసాగించడానికే మొగ్గు చూపుతున్నారని రాంబన్ పోలీసు ఉన్నతాధికారి కుల్బీర్‌సింగ్ వెల్లడించారు. అయితే కొందరికి గాయాల తీవ్రత ఎక్కువగా ఉండటంతో వారు ఆగిపోవాల్సి వచ్చిందని చెప్పారు. ఇక దెబ్బతిన్న బస్సులను మార్చడంతో యాత్ర ప్రారంభమైనట్లు- చెప్పారు. జులై 3 నుంచి అమర్‌నాథ్ యాత్ర ప్రారంభమైంది. కట్టుదిట్టమైన భద్రత మధ్య 5,880 మందికి పైగా భక్తుల తొలి బ్యాచ్ బుధవారం జమ్ము నుంచి బయల్దేరింది. సాధారణంగా యాత్రికులు పహల్గాం మార్గంతో పాటు- బాల్తాల్ మీదుగా ప్రయాణిస్తుంటారు. ఈ రెండు మార్గాలను ఇప్పటికే 'నో ఫ్లయింగ్ జోన్'గా ప్రకటించారు. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో ఈసారి భద్రతను మరింత పటిష్ఠం చేసినట్లు- జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా వెల్లడించారు.



# జ్ఞానపీఠ అవార్డు గ్రహీత రావూరి

## జూలై5న రచయిత జయంతి



**విజయవాడ :** జ్ఞానపీఠ అవార్డు గ్రహీత రావూరి భరద్వాజ1927 జూలై 5వ తేదీన కృష్ణా జిల్లా లోని నందిగామ తాలూకా కంచికచర్ల సమీపంలోని మోగులూరు గ్రామంలో రావూరి కోటయ్య, మల్లికాంబ దంపతులకు జన్మించారు. వీరి విద్యాభ్యాసం 8వ తరగతి వరకే సాగింది. వీరిది దేశభక్తుల

కుటుంబం. తండ్రి స్వాతంత్య్ర సంగ్రామంలో పాల్గొన్నారు. పేదరికంతో చినిగిన బట్టలు వేసుకున్నందుకు తరగతి గదిలో జరిగిన అవమానాల కారణంగా 8వ తరగతి అభ్యసిస్తున్నప్పుడు మధ్యలోనే చదుపు ఆపివేశారు. బతుకు పోరాటం కోసం కూలీగా పనిచేశారు. తిండి కోసం సైన్యంలో చేరారు. 1948లో వివాహం అనంతరం తెనాలి చేరి అక్కడ ఒక ప్రెస్సులో పనిచేశారు. కొన్నాళ్ళ తర్వాత ఒక పత్రికకు ఉపసంపాదకుడుగా పనిచేశారు. ఆ ఉద్యోగానికి రాజీనామా చేసి కొన్నాళ్ళు ఒక కంపెనీలో సేల్స్‌మన్‌గా, ఆ తర్వాత హైదరాబాదు ఆకాశవాణి కేంద్రంలో కళాకారునిగా చేరినారు. పేదరికం నుంచి జ్ఞానపీఠ్ అవార్డు వరకు అతను సాగించిన జీవన సమరం ఎన్నో మలుపులు తిరిగింది. భరద్వాజ తన తొలి కథను 16 ఏళ్ల ప్రాయంలో వ్రాశారు. ఇది జానపద శైలిలోసాగే కథ. భరద్వాజపై చలం ప్రభావం అధికంగా ఉన్నది. చిన్నప్పుడు తాను పడ్డ కష్టాలు, బాధలు రావూరి రచనల్లో ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. ఆయన రచనలో సాహిత్యమే కాదు, సాంఘిక విలువలూ కనిపిస్తాయి. రావూరి భరద్వాజను నిలబెట్టే రచనల్లో అతి

ముఖ్యమైనది పాకుడురాళ్లు నవల. భారత దేశపు అత్యున్నత సాహితీ పురస్కారం 'జ్ఞానపీఠ అవార్డు' అందుకున్న మూడవ తెలుగు సాహిత్య దిగ్గజం డాక్టర్ రావూరి భరద్వాజ. ఆయన కలం నుండి జాలువారిన అద్భుత సంచలన నవల 'పాకుడు రాళ్ళు' ఏప్రిల్ 17, 2013న ఈయనకు ప్రకటించబడ్డ జ్ఞాన్‌పీఠ్ అవార్డు తెలుగు సాహిత్యానికే గర్వకారణం. విశ్వనాథ సత్యనారాయణ, సి.నారాయణరెడ్డిల సరసన ఇతన్ని ఈ అవార్డు చేర్చిననూ రచనా ప్రపంచంలో ఇతని శైలి మాత్రం అంతకంటె గొప్పది.

# వారసత్వ ఆస్తి కేసులో సైఫ్‌కు చుక్కెదురు

## ఎనిమీ ప్రాపర్టీపై వేసిన కేసు కొట్టివేత



**భోపాల్ :** దివంగత క్రికెటర్ పటౌడీ కుమారుడు బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌కు మధ్యప్రదేశ్ హైకోర్టులో చుక్కెదురైంది. మధ్యప్రదేశ్‌లోని తన పూర్వీకుల ఆస్తులను ఎనిమీ ప్రాపర్టీగా పేర్కొనాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని సవాలు చేస్తూ సైఫ్ అలీఖాన్ దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టి వేసింది. ఈ ఆస్తికి సంబంధించి ప్రభుత్వానికి హక్కులు సంక్రమిస్తాయి. ఎనిమీ ప్రాపర్టీ కింది ఇవి దఖలు పడ్డాయి. దీనిని సవాల్ చేస్తూ వేసిన పిటిషన్ తిరస్కరణకు గురయ్యింది. సైఫ్ కుటుంబానికి చెందిన రూ.15వేల కోట్ల ఆస్తులను ఎనిమీ ప్రాపర్టీగా నిర్ణయిస్తూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అంతేకాకుండా ఈ విషయంపై మరోసారి విచారణ జరపాలని, ఏడాదిలోగా తుది నిర్ణయం తీసుకోవాలని ట్రయల్ కోర్టును ఆదేశించింది. తాజా పరిణామంతో ఆ ఆస్తుల యాజమాన్య హక్కులపై సందిగ్ధం నెలకొంది. భోపాల్‌లో సైఫ్ కుటు-ంబానికి అతడి నాన్నమ్మ సాజిదా సుల్తాన్ నుంచి పలు విలాసవంతమైన భవంతులు వారసత్వంగా వచ్చాయి. భోపాల్ చివరి నవాబు హమీదుల్లా ఖాన్ కుమార్తె సాజిదా. ఆయన పెద్ద కుమార్తె అబీదా సుల్తాన్ దేశ విభజన నేపథ్యంలో 1950లో పాకిస్థాన్‌కు వలస వెళ్లారు. సాజిదా ఇక్కడే నివసిస్తూ పటౌడీ నవాబు అయిన ఇఫ్తిఖర్ అలీఖాన్(సైఫ్ తా)ను వివాహమాడారు. సాజిదాకు ఆమె తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన ఆస్తులు కాలక్రమంలో ఆమె వారసులైన సైఫ్ కుటు-ంబానికి దక్కాయి. అయితే హమీదుల్లాకు చట్టబద్ధ వారసురాలు అబీదా మాత్రమే అని, ఆమె పాక్‌కు వలస వెళ్లినందువల్ల ఎనిమీ యాక్ట్ ప్రకారం ఆ ఆస్తులను కాందిశీకుల ఆస్తులుగా గుర్తిస్తున్నట్లు కస్టోడియన్ ఆఫ్ ఎనిమీ ప్రాపర్టీ కార్యాలయం 2015లో ప్రకటించింది. దీన్ని సవాలు చేస్తూ సైఫ్ కుటుంబసభ్యులు మధ్యప్రదేశ్ హైకోర్టులో పిటిషన్ వేశారు. తాజాగా దీనిని కోర్టు తిరస్కరించడంతో ఇక ఆశలు వదులుకోవాల్సిందే.

# అతనిదంతా క్రిమినల్ మనస్తత్వం

## క్రికెటర్ షమీపై మాజీ భార్య హసీన్ జహాన్



**కోల్‌కతా :** టీమ్ఇండియా సీనియర్ బౌలర్ మహ్మద్ షమీపై అతడి మాజీ భార్య హసీన్ జహాన్ సంచలన ఆరోపణలు చేశారు. అతడో కర్కశ వ్యక్తిత్తం కలిగిన వ్యక్తి అని దుయ్యబట్టారు. ఇటీవల విడాకుల సందర్భంగా తనకు ఇచ్చే భరణం సరిపోదని ఆమె తెలిపింది. తాజాగా అతడు వ్యక్తిత్వం లేని, క్రూరమైన మనస్తత్వం కలిగిన వాడని, అందుకే తనను ఎంతగానో వేధించాడని ఆమె ఆరోపించారు. వీరి విడాకుల కేసుకు సంబంధించి ఇటీవల కలకత్తా హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. 2018లో హసీన్ అతడిపై గృహహింస కేసు పెట్టింది. దీనిపై కొన్నేళ్లుగా విచారణ జరుగుతోంది. ఈ క్రమంలోనే ఇటీవల హసీన్, ఆమె కుమార్తె సంరక్షణ కోసం రూ.4 లక్షలను భరణం కింద చెల్లించాలని షమీని కలకత్తా హైకోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో షమీని విమర్శిస్తూ హసీన్ జహాన్ ఇన్‌స్టా వేదికగా సుదీర్ఘ పోస్ట్ చేశారు. గత ఏడేళ్లుగా మన మధ్య న్యాయపోరాటం జరుగుతోంది. నీ క్యారెక్టర్ లేనితనం, దురాశ, క్రూరమైన మనస్తత్వంతో సొంత కుటుంబాన్నే చేజేతులా నాశనం చేశావ్. మమ్మల్ని చంపడానికి, మా పరువు తీసి వేధించడానికి, నన్ను ఓడించడానికి నువ్వు ఎంతమంది క్రిమినల్స్‌కు డబ్బు ఇచ్చి ఉంటావ్. దానివల్ల నువ్వు ఏమైనా సాధించావా? పురుషాధిక్య సమాజంలో నాపై నిందలేసి నువ్వు మద్దతు కూడగట్టు-గలవేమో..! కానీ, ఏదో ఒకరోజు నీకు కూడా కష్టకాలం మొదలవుతుంది. అప్పుడు నీకు అండగా నిలిచినవాళ్లే నిన్ను తరిమేస్తారు. చట్టంపై నాకు నమ్మకం ఉందని షమీని ఆమె దుయ్యబట్టారు. క్రిమినల్స్, వేశ్యలకు నువ్వు ఇచ్చిన డబ్బును.. మన కుమార్తె చదువు కోసం వెచ్చించి ఉంటే, మన భవిష్యత్తు కోసం ఉపయోగించి ఉంటే ఇప్పుడు మన జీవితం ఎంతో బాగుండేది. మనమంతా ఎంతో మర్యాదగా జీవించేవాళ్లం అంటూ హసీన్ జహాన్ రాసుకొచ్చారు. నాకు ఆ భగవంతుడు ఎంత ధైర్యాన్ని, సహనాన్ని ఇచ్చాడో చూడు. నిజం కోసం నేను ఏళ్లతరబడి పోరాడుతూనే ఉన్నాను... ఉంటాను కూడా. అందుకే, నువ్వు ఎంతమంది క్రిమినల్స్‌తో చేతులు కలిపినా నన్ను ఏమీ చేయలేకపోతున్నావ్. ఈ 2014లో హసీన్‌తో షమీకి వివాహమైంది. వీరికి కుమార్తె జన్మించింది. అయితే, ఆ తర్వాత వీరిద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో విడివిడిగా ఉంటున్నారు.

# మసూద్ అజహర్, హాఫీజ్ సయీద్‌లు ఎక్కడ?

## మా దగ్గరే ఉంటే అడ్రస్ చెప్పండి

## పాక్ నేత బిలావల్ భుట్టో వ్యంగ్య వ్యాఖ్యలు




**లాహోర్ :** మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది, జైషే మహ్మద్ ముఠా అధినేత మసూద్ అజార్, లష్కరే తోయిబా చీఫ్ హాఫీజ్ సయీద్‌లు ఎక్కడున్నారో చెప్పాలని ఆ దేశ మాజీ మంత్రి, పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ అధినేత బిలావల్ భుట్టో అన్నారు. వీరు పాకిస్థాన్‌లో స్వేచ్ఛగా తిరుగుతున్నారని భారత్ ఎన్నిసార్లు చెబుతున్నా.. పాక్ మాత్రం దాన్ని అంగీకరించట్లేదు. తాజాగా బిలావల్ భుట్టో కూడా మరోసారి అబద్ధాలతో ముందుకు వచ్చి అమాయకత్వం నటించారు. మసూద్ ఎక్కడున్నాడో తమకు తెలియదని అంటున్నారు. అతడు పాక్‌లో ఎక్కడున్నాడో భారత్ చెబితే సంతోషంగా అరెస్టు చేస్తామంటూ వ్యంగ్యంగా మాట్లాడారు. ఓ అంతర్జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో బిలావల్ భుట్టో ఈ వ్యాఖ్యలు చేశారు. హాఫీజ్ సయీద్ స్వేచ్ఛగా తిరుగుతున్నాడంటూ వస్తున్న వార్తలు అవాస్తవం. అతడు పాక్ కస్టడీలోనే ఉన్నాడు. ఇక, మసూద్ అజార్ విషయానికొస్తే అతడు ఎక్కడున్నాడో మేం గుర్తించలేకపోతున్నాం. అరెస్టు చేయలేకపోతున్నాం. గతంలో జరిగిన కొన్ని ఘటనలను గుర్తుచేసుకుంటే.. బహుశా అతడు అఫ్గానిస్థాన్‌లో ఉండి ఉంటాడని భావిస్తున్నాం. ఒకవేళ అతడు పాక్ గడ్డ పైనే ఉన్నట్లు- భారత ప్రభుత్వం మాకు కచ్చితమైన సమాచారం ఇస్తే.. మేం సంతోషంగా అతడిని అరెస్టు చేస్తాం. కానీ, న్యూదిల్లీ ఆ వివరాలు ఇవ్వదని అంటూ భుట్టో ఆరోపణలు చేశారు. ఇటీవల జమ్మూకశ్మీర్‌లో జరిగిన పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ 'ఆపరేషన్ సిందూర్ ను విజయవంతంగా చేపట్టిన సంగతి తెలిసిందే. పాక్, పీఓకేలోని జైషే, లష్కరే ఉగ్రస్థావరాలే లక్ష్యంగా భీకర దాడులకు పాల్పడింది. ఈ దాడుల్లో ఉగ్రముఠాల ప్రధాన కార్యాలయాలు ధ్వంసమయ్యాయి. అంతేకాదు.. భారత్ దాడుల్లో తమ కుటుంబంలో 10 మంది చనిపోయారని మసూద్ అజార్ చెప్పినట్లు వార్తలు వచ్చాయి. ఈ పరిణామాల వేళ.. భుట్టో తాజాగా చేసిన వ్యాఖ్యలు దాయాది ద్వంద్వవైఖరికి అద్దం పడుతున్నాయి. పాక్ కేంద్రంగా పనిచేస్తున్న జైషే మహ్మద్ ఉగ్ర ముఠా అధినేత అయిన మసూద్.. భారత్‌లో పలు భీకర దాడులకు సూత్రధారి. 1995లో భారత్ అతడిని అరెస్టు చేసింది. అయితే, 1999లో కొందరు ఉగ్రవాదులు విమానాన్ని హైజాక్ చేసి అతడిని విడిపించుకున్నారు. ఆ తర్వాత అతడు జైషేను స్థాపించాడు. 2001లో పార్లమెంట్‌పై జరిగిన ఉగ్రదాడి, 2008లో ముంబయిలో జరిగిన బాంబు పేలుళ్లలోనూ ఇతడి ప్రమేయం ఉంది. 2019లో మసూద్‌ను ఐరాస అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించింది. అయినా అతడిని అప్పగించడంలో పాక్ మెలికలు పెడుతునే ఉంది.



# ఆర్థిక వైఫల్యాలకు చికిత్స లేదా?

బ్యాంకులకు లక్షల కోట్లు ఎగవేసిన మాల్యా, నీరవ్ మోడీ లాంటి వారంతా విదేశాల్లో ఎంజాయ్ చేస్తున్నారు. దేశంలోనే ఉన్న మరికొందరు ఎగవేతదారులు రాజకీయాలను అడ్డం పెట్టుకుని దర్జాగా బతికేస్తున్నారు. రాజకీయాల్లో ఉంటూ అవినీతికి పాల్పడుతున్న వారు పదవులు వెలగబెడుతున్నారు. రాష్ట్రాల వనరులను లూటీ చేసిన వారు,దేశ సంపదను లూటీ చేసిన వారు పదవులతో మనలను పాలిస్తున్నారు. రాజకీయ నాయకుల, వ్యాపారుల అవినీతి కారణంగా దేశ వనరులు దెబ్బతింటున్నాయి. ఖజానా ఖాళీ అవుతోంది. వారి జీత భత్యాలు, వారి విలాసాల కారణంగా లక్షల కోట్లు ఏటా వృథా అవుతున్నాయి. ప్రజాస్వామ్యంలో రాజకీయ నాయకులను మేపడానికి అవుతున్న లెక్కలు చూస్తే ఆశ్చర్యం కలగమానదు. అధికారం, దర్పం అనుభవించడానికే చాలామంది రాజకీయాల్లో ఆసక్తి చూపుతున్నారు. కానీ సామాన్యులు, ఓట్లేసిన వారు మాత్రం అడుక్కునే పరిస్థితి కల్పించి వారికి బిచ్చమేస్తున్నారు. కిలోరూపాయి బియ్యం, పెన్షన్ల పందేరాలతో పాలనను చేస్తున్నట్లు భ్రమింప చేస్తున్నారు. అవినీతి, అక్రమాల కట్టడి చేయడంలో పాలకులు పూర్తిగా విఫలం అవుతున్నారు. అనేక అక్రమాలు వెలుగుచూస్తున్నా..అరికట్టడంలో విఫలం అవుతున్నారు. అత్యాచారాలు, హత్యలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా ఇంటర్నెట్ అందుబాటులోకి వచ్చాక అశ్లీలత పెరిగిపోయింది. అశ్లీల వెబ్‌సైట్లను అరికట్టడం లేదు. పాన్,గుట్కా, మందులకు సంబంధించి ప్రకటనలు యదేచ్ఛగా టీవీల్లో వచ్చేస్తున్నాయి. అశ్లీల ప్రకటనలు కూడా యువతను పెడదారి పట్టిస్తున్నాయి. ఇవన్నీ ఒక ఎత్తయితే ఇటీవలి కాలం వరకు లోన్ యాప్ వాల్లు చేసిన హింసాకాండ అంతా ఇంతాకాదు. వడ్డీలతో డబ్బులు సంపాదించాలనుకున్న వారు ఇలా ఏర్పాటు చేసి ప్రజలను పీల్చిపిప్పి చేస్తున్న తీరును చూశాం. ఇక దేశంలో విరవివిగా రుణాలు ఇచ్చి, ఉపాధిరంగాలను ప్రోత్సహిస్తే యువత సమస్య తీరేది. నిరుద్యోగు లకు ఉపాధి దక్కేది. భారతీ-య బ్యాంకులు సామాన్యులకు రుణాలు ఇవ్వండంలో ఎంత కఠినంగా ఉంటున్నాయో వేరుగా చెప్పనక్కర లేదు. సూటుబూటు వేసుకుని వచ్చే వారికి అప్పనంగా వేలకోట్లు కట్టబెట్టి రుణాలు ఇస్తున్న బ్యాంకులు.. సామాన్యులకు మాత్రం లక్ష ఇవాలంటే సవాలక్ష కొర్రీలు పెడుతున్నాయి. మాల్యా, నీరవ్ మోడీ లాంటి వారు ఇలాగే బ్యాంకులకు వేలకోట్లు ఎగవేసి విదేశాల్లో ఎంజాయ్ చేస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోడీ 11 ఏళ్ల పాలనలో వీరిని పట్టుకుని తీసుకుని రావడంలో పూర్తిగా విఫలం అయ్యారు. నిజానికి మన బ్యాంకులు సులభంగా పేద, మధ్య తరగతి ప్రజలకు రుణాలు ఇచ్చినట్లయితే ఉపాధి రంగం బలపడేది. పెట్టుబడుల కోసం విదేశాల చుట్టూ తిరగాల్సిన అవసరం వచ్చేది కాదు. లక్షల కోట్లు ఎగవేసిన మాల్యా, నీరవ్ మోడీ లాంటి వారిని ఏమీ చేయలేక బ్యాక్లరు చేతులెత్తేస్తు న్నారు. రాయపాటి సాంబశివరావు లాంటి రాజకీయవేత్తలు వందల కోట్లు ఎగవేసినా కిమ్మనరు. నిజానికి ఏళ్లతరబడి బ్యాంకుల్లో అకౌంట్లు పెట్టి నడుపుతున్న సామాన్యుల అవసరాలను గుర్తించడంలో బ్యాంకులు పూర్తిగా విఫలమయ్యాయని చెప్పాలి. ప్రధాని ప్రవేశ పెట్టిన రుణ పథకాలు కూడా సామాన్యులందరికీ అందడం లేదు. అలాగే ప్రజలు కూడా ఇచ్చిన రుణాలు చెల్లించాలన్న శ్రద్ధ కనబర్చకపోవడం కూడా ప్రధాన కారణంగా చూడాలి. రుణమిస్తే ఎగవేయవచ్చన్న ఆలోచన కూడా ప్రజల్లో బాగా బలపడిపోయింది. అందుకే ప్రైవేట్ వ్యక్తులు, సంస్థలు ప్రజల అవసరాలను గుర్తించి వారిని లోబర్చుకుంటున్నారు. రుణాల పేరుతో వారిని జలగల్లా పీలుస్తున్నారు. ఎటువంటి ష్యూరిటీ లేకుండా... మన గురించి తెలియకుండా.. కనీసం ముఖం చూడకుండా లోన్ ఇస్తామంటే ఎవరు కాదంటారు? అవసరం ఉన్నా లేకున్నా తీసుకుంటారు! కానీ, ఆ తరువాతే అసలు సినిమా మొదలవుతుంది. ఫోన్లలోనే బెదిరింపులు, వేధింపులు వస్తుంటాయి. అప్పుల యాప్‌ల వలలో చిక్కుకున్నట్లే! అసలుకు ఎన్నో రెట్లు వడ్డీ కట్టిన వారు కొందరయితే... డబ్బులు కట్టలేక... పరువు పోతోందనే ఆవేదనతో ఆత్మహత్మలు చేసుకుంటున్న వారు మరికొందరు! దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల ప్రజలు అప్పుల యాప్‌ల బారిన పడ్డారని.. పెరుగుతన్న బాధితులు సంఖ్యను బట్టి అర్థం చేసుకోవచ్చు. కరోనా కారణంగా చాలామంది ఉద్యోగాలు పోయి..ఉపాధి కూలిపోయి...చేతుల్లో డబ్బులు లేక ఇలాంటి యాప్‌లను ఆశ్రయించరు.చేస్తున్న ఉద్యోగాలు ఊడిపోవడంతో... అప్పు ఇచ్చే వారికోసం చాలామంది ఎదురు చూస్తున్నారు. సరిగ్గా ఇలాంటి వారినే అప్పుల యాప్‌లు వలలో వేసుకుంటున్నాయి. ష్యూరిటీలేదంటూనే... నిబంధనల్లో భాగంగా ఫోన్‌లోని కాంటాక్ట్స్ మె-ుత్తం 'యాక్సెస్' తీసుకుంటాయి. అలా తమ వలలో చిక్కుకున్న వారిని వడ్డీ మీద వడ్డీ లాగుతారు. కట్టలేని పరిస్థితి వస్తే... ఫోన్లు చేసి వేధిస్తారు. బెదిరిస్తారు. అప్పు తీసుకున్న వారి ఫోన్లలోని కాంటాక్ట్స్‌కు మెసేజ్‌లు పంపిస్తారు. జాతీయ బ్యాంకుల అండ లేకపోవడంతో రుణ యాప్ నుంచి అప్పు తీసుకుని... ఎంతోమంది ఊబిలో కూరుకు పోతున్నారు. హైదరాబాద్, బెంగళూరు, ముంబై, చెన్నై లాంటి నగరాలు కేంద్రంగా ఎన్నెన్నో యాప్‌లు పుట్టుకొస్తు న్నాయి. ఈ యాప్‌లు... చైనాకు చెందినవిగా పోలీసులు చెబుతున్నారు. కొందరు దేశంలోని నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్‌తో ఒప్పందం కుదుర్చుకుని, రుణాలిస్తున్నట్లు సైబర్ పోలీసులు అనుమానిస్తున్నారు. మరి కొందరు ఆర్బీఐ మార్గదర్శకాలను పట్టించుకోకుండా అధిక వడ్డీలు వసూలు చేస్తూ వేధింపులకు పాల్పడుతున్నారు. ఇలాంటి వాటిని అరికట్టడమే గాకుండా బ్యాంకుల రుణ పద్దతిని ప్రజల అవసరాలకు అనుగుణంగా మార్చాలి. బ్యాంకులు ప్రజల డబ్బుతో పెద్దలకు దోచిపెట్టడం గాకుండా బతికేందుకు అసవరమైన విధంగా రుణాలు ఇవ్వగలగాలి.

ప్రభాత నేటి సాక్షి
TGTEL/25/A0100 | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..


# పెద్దపులి భయమే చంపేసిందా!?





## కోరుట్ల ఆదర్శ నగర్‌లో 'మర్డర్ మిస్టరీ'?

### సాయంత్రం 'ఐదేళ్ల పాప-మిస్సింగ్' అని సోషల్ మీడియాలో వైరల్
### రాత్రి పక్కింటి 'బాత్రూంలో పాప మృతదేహం లభ్యం'
### గొంతు కోసారని.. నల్లా దిగబడిందని సోషల్ మీడియాలో కథనాలు
### 'అనుమానాస్పద మృతి'పై దర్యాప్తు చేస్తున్న పోలీసులు

కోరుట్ల పట్టణంలో శనివారం రాత్రి ఒక్కసారిగా కలకలం రేగింది. సాయంత్రం ఐదేళ్ల పాప 'కనిపించుట లేదు' అని సోషల్ మీడియాలో 'ఆచూకీ' తెలిస్తే చెప్పండి.. అని మెసేజ్ ఒకటి ఫార్వర్డ్ అయిన రెండు గంటల్లో.. అదే పాప పక్కింటి 'బాత్రూం'లో 'రక్తపు మడుగు'లో శవమై కనిపించడంతో అలజడి మొదలైంది. ప్రతీ ఒక్కరినీ 'కంటతడి' పెట్టించే హృదయవిదారక సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి.. 'ఆదర్శనగర్'కు చెందిన ఆకుల రాము కూతురు 'హితిక్ష'(5) సాయంత్రం వాన చినుకులు వచ్చే కొద్దిసేపటి ముందు నుంచి కనిపించకుండా 'పోయింది'! దీంతో కుటుంబ సభ్యులు వానలోనే తడుస్తూ 'కూతురు' కోసం వెదకడం మొదలెట్టారు. వెంటనే పాప కనిపించడం లేదని 'వాట్సాప్', 'ఫేస్ బుక్'.. 'ఇన్స్టాగ్రామ్'లలో తెలిసిన వారందరూ షేర్ చేయడం మొదలెట్టారు.

- నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య)





### పక్కింటి 'బాత్రూం'లో శవమై..

సాయంత్రం 7 తర్వాత కనిపించకుండా'పోయిన' ఆ చిన్నపాప.. రాత్రి 9-10 గంటల ప్రాంతంలో పక్కింటి 'బాత్రూం'లో 'రక్తపు మడుగు'లో శవమై కనిపించింది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఆ పాప హితిక్షను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



### సోషల్ మీడియాలో 'భిన్న కథనాలు'.?

కనిపించకుండా పోయిన ఆ చిన్నపాప గొంతులో నల్లా దిగబడి చనిపోయిందని కొందరు 'సోషల్ మీడియా'లో మెసేజ్ లు పెడితే.. కాదు కాదు.. ఎవరో గుర్తుతెలియని వారు పాపను 'గొంతుకోసి' చంపేశారంటూ మరికొందరు మెసేజ్ లను ఫార్వర్డ్ చేయడంతో పాప మరణం 'మిస్టరీ'గా మారింది.

### 'పెద్ద' పులి భయమే చంపేసిందా!?

నిజమే అయ్యుంటుందని మరికొందరు అభిప్రాయపడుతున్నారు. వాన వచ్చే కంటే ముందు 'మొహర్రం' వేడుకల్లో భాగంగా వేసిన 'పులి వేషగాళ్లు' పట్టణంలో చివరిరోజైనందున ఇంటింటికి తిరిగారు. ఇందులో భాగంగానే 'ఆదర్శనగర్'కూ వెళ్లి ఉంటారు. సహజంగా పిల్లల్లో ఆసక్తితో పాటు విపరీతమైన 'భయం' కూడా ఉంటుంది. ఈ నేపథ్యంలో 'ఈ-పాప హితిక్ష కూడా 'పెద్ద పులి వేషగాళ్ల'ను చూసి భయపడి బాత్రూంలోకి పరుగెత్తి ఉంటుంది. అందులో టైల్స్ పై జారి, నల్లాపై పడితే గొంతులో నల్లా దిగబడి ప్రాణం కోల్పోయి ఉంటుందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఎహె.. గొంతులో దిగబడేంత 'షార్ప్'గా నల్లాలు ఉంటాయా? ఎవరో 'గుర్తు తెలియని' వారే ఆ 'హితిక్ష' గొంతుకోసి చంపేసి ఉంటారని మాట్లాడుకుంటున్నారు. ఏదిఏమైనా చిన్నపాప దారుణంగా 'చనిపోవడం' మాత్రం ప్రతీ ఒక్కరినీ కలచివేసింది. ఆసుప్రత్రి వద్ద బంధుమిత్రుల రోదనలతో నిండిపోయింది. స్థానిక పోలీసులు 'ఈ-అనుమానాస్పద మృతి'కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా.. 'పాప'మరణ సంఘటన కోరుట్లలో చర్చానీయాంశమైంది.!



### హంతకులు దొరికితేనే..

పాప తల్లిదండ్రులు ఆకుల రాము-నవీనకు కొడుకు.. కూతు-రు ఉన్నారు. పాప తండ్రి రాము దుబాయ్ లో ఉంటారు. వీరి ఇంటిపక్కన కొడిపెల్లి విజయ్ అనే ఓ సైకో మనస్తత్వం గల అతను నివాసం ఉంటారట. అతను తరచూ తన తల్లిదండ్రులను తిడుతూ.. కొడుతూ ఉంటాడట. ఇతనే 'ఆ-పాప'ను గొంతుకోసి చంపేసి ఉంటారని స్థానికులు భయంభయంగా చెబుతున్నారు. కాగా, పోలీసులు హంతకుల కోసం పోలీస్ హెడ్ క్వార్టర్స్ నుంచి 'పోలీస్ డాగ్స్'ను తెప్పించి గాలింపు చర్యలు చేపట్టారు. ట్విస్ట్ ఏంటంటే 'పాప శవమై' కనిపించిన 'బాత్రూం'గల ఇంటి యజమాని కనిపించుటలేదని స్థానికులు ముచ్చటించుకుంటున్నారు. ఈ ఇంటి యజమాని.. ఆ 'సైకో' ఒక్కరేనా? వేర్వేరా? పోలీసుల అన్వేషణలో అసలు హంతకులు దొరికే దాకా 'వీడని మిస్టరీ'యే!

# కేయూ స్నాతకోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి

**నేటి సాక్షి, వరంగల్ (సందెల రాజు):** జూలై 7 వ తేది సోమవారం జరుగు కాకతీయ విశ్వవిద్యాలయ 23 వ స్నాతకోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి తెలిపారు. రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం, పరిక్షల నియంత్రణ అధికారి ఆచార్య రాజేందర్ కట్లతో కలిసి విశ్వ విద్యాలయం సెనెట్ హాల్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో ఆయన మాట్లాడుతూ తెలంగాణా రాష్ట్ర గవర్నర్, విశ్వవిద్యాలయ ఛాన్సలర్ జిష్ణు దేవ్ వర్మ వస్తున్నారని వారితో పాటు ముఖ్య అతిథిగా శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డు గ్రహీత, ఐఐసీటీ డైరెక్టర్ డా. డీ. శ్రీనివాస్ రెడ్డి హాజరు కానున్నారని తెలిపారు. జులై 7 ఉదయం 11 గంటల నుంచి ప్రారంభం అయ్యే స్నాతకోత్సవ కార్యక్రమంలో మొత్తం 564 గోల్డ్ మెడల్ లు, 387 పీహెచ్డీ లు ప్రధానం చేస్తునట్టు సమావేశంలో వెల్లడించారు. స్నాతకోత్సవం



అకడమిక్ సెనేట్ సమావేశంతో ప్రారంభమవుతుందని, అనంతరం గవర్నర్, ముఖ్య అతిథి, వీసీ, రిజిస్ట్రార్, పూర్వపు ఉప కులపతులు, కంట్రోలర్, డీన్స్, పాలక మండలి సభ్యులు సెనేట్ సభ్యులతో కలిసి గ్రూప్ ఫొటో తీసుకుంటారని చెప్పారు. ఆ తర్వాత సెనేట్ సభ్యుల పొసేషన్ నిర్వహించబడుతుందని, వెంటనే బంగారు పతకాలు, పట్టాల పంపిణీ కార్యక్రమం ఆడిటోరియంలో జరుగుతుందని పేర్కొన్నారు. మధ్యాహ్నం స్నాతకోత్సవ కార్యక్రమం ముగియనుంది. ఈ వేడుకను అన్ని విభాగాల సహకారంతో విజయ వంతంగా నిర్వహించాలనే దిశగా చర్యలు తీసుకుంటున్నామని, కార్యక్రమ నిర్వహణ కొరకు ఒక స్టీరింగ్ కమిటీతో బాటు మొత్తం 10 సబ్ కమిటీలను ఏర్పాటు చేశామని, ప్రతి కమిటీలో కన్వీనర్, కో కన్వీనర్ లతో బాటు 10 మంది సభ్యులు ఉన్నారని, టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులతో కలిపి వేసిన ఈ కమిటీలు కష్టపడి స్నాతకోత్సవం విజయవంతంగా నిర్వహించడానికి కృషి చేస్తున్నారని వీసీ అన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు, సిబ్బంది సహకరించి కార్యక్రమాన్ని గౌరవ ప్రదంగా నిలబెట్టాలని కోరారు.

# బాధితుడ్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే ఆల

**నేటి సాక్షి, దేవరకద్ర :** హైదరాబాద్ మలక్ పేట యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడ్ని శనివారం రాత్రి దేవరకద్ర నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి పరామర్శించారు. మహబూబ్ నగర్ రూరల్ మండలం గాజులపేట గ్రామానికి చెందిన జగాల్ రెడ్డి కుమారుడు ఉమాకాంత్ రెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ మలక్ పేట యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి ఆసుపత్రికి వెళ్లి ఉమాకాంత్ రెడ్డిని పరామర్శించారు. ఆయన యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే ఉమాకాంత్ రెడ్డి కి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి కోరారు.



# భారీ ఆధిక్యంలో భారత్

## ఇంగ్లాండ్ 407 ఆలౌట్..




ఇంగ్లాండ్ తో జరుగుతున్న తొలిటెస్టులో భారత్ భారీ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సంపాదించింది. శుక్రవారం మూడోరోజు ఓవర్ నైట్ స్కోరు 77/3 తో ఆటను కొనసాగించిన ఇంగ్లాండ్ 89.3 ఓవర్లలో 407 పరుగులకు ఆలౌటైంది. దీంతో భారత్ కు 180 పరుగుల భారీ ఆధిక్యం దక్కింది. వికెట్ కీపర్ బ్యాటర్ జెమీ స్మిత్ (207 బంతుల్లో 184 నాటౌట్, 21 ఫోర్లు, 4 సిక్సర్లు) తో టాప్ స్కోరర్ గా నిలిచాడు. హైదరాబాదీ పేసర్ మహ్మద్ సిరాజ్ (6/70) ప్రధాన పేసర్ గా ముందుండి జట్టును నడిపించి, హైయ్యెస్ట్ వికెట్లు తీశాడు. ఇప్పటికే వికెట్ క్షీణిస్తుండటంతో నాలుగో ఇన్నింగ్స్ లో బ్యాటింగ్ చేయడం కష్టంగా మారనుంది. దీంతో వీలైనంత త్వరగా పరుగులు సాధించి, ఇంగ్లాండ్ కాస్త భారీ టార్గెట్ ను నిర్దేశించ గలిగితే, ఇండియాకు విజయం దక్కవచ్చని తెలుస్తోంది. ఓవర్ నైట్ స్కోరు తో శుక్రవారం బ్యాటింగ్ ప్రారంభించిన ఇంగ్లాండ్ కు సిరాజ్ డబుల్ షాకిచ్చాడు. ఆట ఆరంభంలోనే జో రూట్ (22), కెప్టెన్ బెన్ స్టోక్స్ ను డకౌట్ చేశాడు. దీంతో 84 పరుగులకే సగం వికెట్లు కోల్పోయింది. ఈ దశలో బ్యాటింగ్ కి వచ్చిన స్మిత్.. హేరీ బ్రూక్ (234 బంతుల్లో 158,17 ఫోర్లు, 1 సిక్సర్) తో కలిసి అద్భుత భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. వీరిద్దరూ ఆరంభం నుంచే ఎదురుదాడికి దిగి, సత్ఫలితాన్ని సాధించారు. వికెట్లు కోల్పోయినా వేగంగా పరుగులు రాబట్టారు. ముఖ్యంగా స్మిత్ దూకుడుగా ఆడుతూ లంచ్ లోపే 80 బంతుల్లో సెంచరీ నమోదు చేశాడు. కాసేపటికే బ్రూక్ కూడా సెంచరీని పూర్తి చేసుకున్నాడు. లంచ్ తర్వాత మొత్తం సెషన్ ఆడి, భారత బౌలర్లను ఒత్తిడిలోకి నెట్టారు. టీ విరామం వరకు బ్యాటింగ్ చేశారు. అయితే ఆరో వికెట్ కు 303 పరుగులు జోడించాక, ఆకాశ్ దీప్ మ్యాజిక్ డెలీవరితో బ్రూక్ ను ఔట్ చేసి ఈ భాగస్వామ్యానికి తెరదింపాడు..స్టార్ పేసర్ జస్ ప్రీత్ బుమ్రా లేని లోటును పూరిస్తూ, అనుభవం గల బౌలర్ గా సిరాజ్ జట్టును ముందుండి నడిపించాడు. ముఖ్యంగా ఇంగ్లాండ్ టెయిల్ ను త్వరగా పెవిలియన్ కు పంపడంతో భారత్ కు భారీ ఆధిక్యం దక్కింది. అంతకుముందు క్రిస్ వోక్స్ (5)ను ఆకాశ్ దీప్ స్లిప్ క్యాచ్ ద్వారా ఔట్ చేశాడు. ఆ తర్వాత సిరాజ్.. వరుసగా బ్రైడెన్ కార్స్, జోష్ టంగ్, షోయబ్ బషీర్ లను డకౌట్లు చేసి ఫైఫర్ తో పాటు ఆరు వికెట్లను తన ఖాతాలో వేసుకున్నాడు. మరోవైపు ఆకాశ్ దీప్ నాలుగు వికెట్లతో రాణించాడు. ఇంగ్లాండ్ ఇన్నింగ్స్ లోని పది వికెట్లను ఈ ఇద్దరు పేసర్లే తీయడం విశేషం. మరో ఎండ్ లో నాటౌట్ గా నిలిచిన స్మిత్.. అత్యధిక వ్యక్తిగత స్కోరు చేసిన ఇంగ్లాండ్ వికెట్ కీపర్ గా రికార్డులకెక్కాడు. ఓవరాల్ గా ఇంగ్లాండ్ ఇన్నింగ్స్ లో ఆరుగురు బ్యాటర్లు డకౌట్ కావడం విశేషం. ఇక తొలి ఇన్నింగ్స్ లో ఇండియా 587 పరుగులకు ఆలౌటైన సంగతి తెలిసిందే.




## అద్భుతంగా రాణించిన మహమ్మద్ సిరాజ్

ప్రస్తుతం భారత్, ఇంగ్లాండ్ మధ్య రెండో టెస్ట్ మ్యాచ్ జరుగుతోంది. భారత్ 244 పరుగుల ఆధిక్యంలో ఉంది. ముందుగా బ్యాటింగ్ చేసిన భారత జట్టు 587 పరుగులు చేసి ఇంగ్లాండ్‌ను తొలి ఇన్నింగ్స్‌లో 407 పరుగుల వద్ద నిలిపింది. మొహమ్మద్ సిరాజ్ చిచ్చుర పిడుగులా ఇంగ్లీష్ జట్టుపై విరుచుకుపడ్డాడు. 19.3 ఓవర్లలో కేవలం 70 పరుగులకు 6 వికెట్లు పడగొట్టాడు. సిరాజ్ ఇప్పటివరకు భారత్ తరపున 37 టెస్ట్ మ్యాచ్‌లు ఆడి 102 వికెట్లు పడగొట్టాడు. ఇంగ్లాండ్‌పై అద్భుతంగా బౌలింగ్ చేయడం ద్వారా సిరాజ్ తన కెరీర్‌లో నాలుగో 5 వికెట్ల ఘనతను సాధించాడు. సిరాజ్ గతంలో ఆస్ట్రేలియా, వెస్టిండీస్, దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లలో ఐదు వికెట్లు తీసిన ఘనతను సాధించాడు. 4 సంవత్సరాల క్రితం బ్రిస్బేన్‌లో ఆస్ట్రేలియాపై తొలిసారిగా ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు పడగొట్టాడు.జూలై 2023లోనూ మొహమ్మద్ సిరాజ్ వెస్టిండీస్‌పై అద్భుతంగా రాణించి 5 వికెట్లు పడగొట్టాడు. ఆ తర్వాత సిరాజ్ 2024 జనవరిలో దక్షిణాఫ్రికాపై కేవలం 15 పరుగులకు 6 వికెట్లు తీసుకున్నాడు. ఇప్పటివరకు అతని టెస్ట్ కెరీర్‌లో ఇవి అత్యుత్తమ గణాంకాలు. ఇప్పుడు మియాన్ భాయ్ ఇంగ్లాండ్‌పై కూడా తన బౌలింగ్ సత్తాను మరోసారి చాటుకున్నాడు. ఇంగ్లాండ్‌తో జరిగిన రెండో టెస్ట్ మ్యాచ్‌లో సిరాజ్ ఓపెనర్ జాక్ క్రౌలీని పెవిలియన్‌కు పంపించాడు. జో రూట్, బెన్ స్టోక్స్ వంటి దిగ్గజ బ్యాట్స్‌మెన్ వికెట్లను టపా టపా పడగొట్టాడు. హైదరాబాద్ కు చెందిన ఈ ఫాస్ట్ బౌలర్ షోయబ్ బషీర్, బ్రైడాన్ కార్స్, జోష్ టంగ్‌లను కూడా తన ప్రదర్శనతో మోకరిల్లేలా చేశాడు.తొలి ఇన్నింగ్స్‌లో స్కోరు బోర్డులో 587 పరుగులు నమోదు చేయడం ద్వారా భారత జట్టు మ్యాచ్‌పై తన పట్టును బలోపేతం చేసుకుంది. ఇంగ్లాండ్ బ్యాటింగ్‌కు దిగినప్పుడు, వారు కేవలం 85 పరుగులకే 5 వికెట్లు కోల్పోయారు. అయితే, హ్యారీ బ్రూక్ , జేమీ స్మిత్ దూకుడుగా బ్యాటింగ్ చేసి ఇంగ్లాండ్ ఇన్నింగ్స్‌ను తిరిగి ట్రాక్‌లోకి తెచ్చారు. ఇంగ్లీష్ జట్టు 407 పరుగులకు ఆలౌట్ అయింది. మూడో రోజు ముగిసే సమయానికి భారత్ తన రెండో ఇన్నింగ్స్‌లో ఒక వికెట్ నష్టానికి 64 పరుగులు చేసింది. ప్రస్తుతం భారత్ 244 పరుగుల ఆధిక్యంలో ఉంది. నాల్గవ రోజు వారు బ్యాటింగ్‌కు దిగినప్పుడు, ఇంగ్లాండ్‌కు భారీ లక్ష్యాన్ని అందించడమే వారి లక్ష్యం.

## అంపైర్‌తో బెన్ స్టోక్స్ వాగ్వాదం!



మూడో రోజు టీమిండియాకు యశస్వి జైస్వాల్ రూపంలో ఒకే ఒక దెబ్బ తగిలింది. రెండో ఇన్నింగ్స్‌లో యశస్వి జైస్వాల్ 22 బంతుల్లో 28 పరుగులు చేసి ఔటయ్యాడు. అయితే యశస్వి జైస్వాల్ ఔటైన బంతికి ఆయన డీఆర్ఎస్ కూడా తీసుకున్నాడు. దీనిపై ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఆ సమయంలో బెన్ స్టోక్స్ అంపైర్లతో వాగ్వాదానికి కూడా దిగారు.అసలు విషయమేమిటంటే.. ఇంగ్లండ్ తరఫున జోష్ టంగ్ 8వ ఓవర్ వేస్తున్నాడు. నాలుగో బంతి యశస్వి జైస్వాల్ ప్యాడ్‌కు తగిలింది. దీంతో ఇంగ్లండ్ గట్టిగా అప్పీల్ చేసింది. అంపైర్ యశస్వి జైస్వాల్‌ను ఔట్‌గా ప్రకటించారు. అయితే యశస్వి నాన్-స్ట్రైకర్‌లో ఉన్న కేఎల్ రాహుల్‌తో చర్చించి డీఆర్ఎస్ తీసుకున్నారు. నిజానికి ఏ జట్టుకైనా 15 సెకన్లలోపు డీఆర్ఎస్ తీసుకోవాలి, కానీ ఇక్కడ యశస్వి జైస్వాల్ డీఆర్ఎస్ తీసుకోవడంలో కాస్త ఆలస్యం చేశాడు. అయినప్పటికీ అంపైర్ సమయానికి గమనించలేకపోయారు, కాబట్టి జైస్వాల్ డీఆర్ఎస్ కాల్‌ను అంగీకరించారు. కానీ ఇదంతా చూసిన బెన్ స్టోక్స్ ఆగ్రహానికి గురయ్యారు. సమయం ముగిసిన తర్వాత కూడా అంపైర్ డీఆర్ఎస్ ఇచ్చినందున ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ నేరుగా అంపైర్‌ల వద్దకు వెళ్లి వాగ్వాదానికి దిగారు. కానీ అంపైర్లు స్టోక్స్ మాట వినలేదు. డీఆర్ఎస్ తీసుకున్నప్పటికీ యశస్వి జైస్వాల్ తన వికెట్‌ను కాపాడుకోలేకపోయాడు. థర్డ్ అంపైర్ కూడా యశస్వి జైస్వాల్ ను ఎల్బీడబ్ల్యూగా ప్రకటించారు. మూడో రోజు ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ 407 పరుగులకే ముగిసింది. ఇంగ్లండ్ తరఫున బ్యాటింగ్ చేస్తూ జేమీ స్మిత్ అత్యధికంగా 184 పరుగులు చేశాడు. దీంతో పాటు హ్యారీ బ్రూక్ 158 పరుగులు చేశాడు. టీమిండియా తరఫున మహ్మద్ సిరాజ్, ఆకాష్ దీప్ అద్భుతంగా బౌలింగ్ చేశారు. మహ్మద్ సిరాజ్ 19.3 ఓవర్లలో 70 పరుగులిచ్చి అత్యధికంగా 6 వికెట్లు పడగొట్టారు. దీనితో పాటు ఆకాష్ దీప్ 20 ఓవర్లలో 88 పరుగులు ఇచ్చి 4 వికెట్లు తీశాడు. మూడో రోజు ఆట ముగిసే సమయానికి టీమిండియా 244 పరుగుల ఆధిక్యాన్ని సాధించింది. ప్రస్తుతం కేఎల్ రాహుల్ 28, కరుణ్ నాయర్ 7 పరుగులతో నాటౌట్‌గా ఉన్నారు.

## చరిత్ర సృష్టించిన వైభవ్ సూర్యవంశీ




ఇంగ్లండ్ గడ్డపై టీమిండియా టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ దుమ్మురేపుతున్నాడు. ఇంగ్లండ్ అండర్ 19 జట్టుతో జరుగుతున్న యూత్ వన్డే సిరీస్‌లో భారత్ అండర్ 19 జట్టు తరఫున బరిలోకి దిగిన వైభవ్ సూర్యవంశీ సరికొత్త చరిత్రను లిఖించాడు. యూత్ వన్డే క్రికెట్ చరిత్రలోనే అత్యంత వేగంగా సెంచరీ బాదిన బ్యాటర్‌గా నిలిచాడు. ఈ క్రమంలో పాకిస్థాన్ బ్యాటర్ కమ్రాన్ గులామ్ పేరిట ఉన్న ఫాస్టెస్ట్ సెంచరీ రికార్డ్‌ను అధిగమించాడు. 2013లో ఇంగ్లండ్ అండర్ 19 జట్టుతో జరిగిన మ్యాచ్‌లో కమ్రాన్ గులామ్ 53 బంతుల్లో శతకం సాధించాడు. తాజాగా 52 బంతుల్లో వైభవ్ సూర్యవంశీ సెంచరీ బాది ఈ 12 ఏళ్ల రికార్డ్‌ను అధిగమించాడు. భారత్ తరఫున రాజ్ అంగద్ బవా.. ఉగాండపై 69 బంతుల్లో సెంచరీ చేశాడు. వైభవ్ తాజా శతకంతో ఈ రికార్డ్ కూడా బద్దలైంది.ఐదు వన్డేల సిరీస్‌లో భాగంగా శనివారం జరిగిన నాలుగో మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీ ఈ ఫీట్ సాధించాడు. ఈ మ్యాచ్‌లో వైభవ్ 78 బంతుల్లో 13 ఫోర్లు, 10 సిక్సర్లతో 143 పరుగులు చేశాడు. అతని ధాటికి ఈ మ్యాచ్‌లో టీమిండియా 28 ఓవర్లలోనే 234 పరుగులు చేసింది.ఈ మ్యాచ్‌లో టీమిండియా టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగింది. కెప్టెన్ ఆయుష్ మాత్రేతో కలిసి ఓపెనర్‌గా బరిలోకి దిగిన వైభవ్ ఆరంభం నుంచే దూకుడుగా ఆడాడు. ఆయుష్ మాత్రే(5) విఫలమైనా.. విహాన్ మల్హోత్రాతో కలిసి చెలరేగాడు. భారీ సిక్సర్లతో 24 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్న వైభవ్.. అనంతరం మరింత దూకుడుగా ఆడి 52 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. దూకుడుగా ఆడుతున్న అతన్ని బెన్ మెయెస్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. దాంతో రెండో వికెట్‌కు నమోదైన 219 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. వైభవ్ ఔటైన తర్వాత భారత్ స్కోర్ నెమ్మదించింది. క్రీజులోకి వచ్చిన రాహుల్ కుమార్(0), హర్వన్ష్ పంగాలియా(0) డకౌటయ్యారు. అభిజ్ఞాన్ కుండుతో కలిసి విహాన్ మల్హోత్ర ఆచితూచి ఆడుతున్నాడు.

## సంజూ శాంసన్‌పై కాసుల వర్షం

### రూ.26.60 లక్షలకు కొచ్చి బ్లూ టైగర్స్ కొనుగోలు




ఐపీఎల్ 2025లో రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్‌గా ఉన్న సంజూ శాంసన్‌పై డబ్బుల వర్షం కురిసింది. కేరళ క్రికెట్ లీగ్(%ఖజూ%) రెండో సీజన్‌లో సంజూ శాంసన్ అత్యంత ఖరీదైన ఆటగాడిగా నిలిచారు. ఈ దిగ్గజ ఆటగాడిని కొచ్చి బ్లూ టైగర్స్ రూ.26.60 లక్షలకు కొనుగోలు చేసింది. సంజూ శాంసన్ బేస్ ధర రూ.3 లక్షలు కావడం విశేషం. కొచ్చి జట్టు సంజూ శాంసన్‌ను రికార్డు ధరకు కొనుగోలు చేసి తమ జట్టులో చేర్చుకుంది. కొచ్చి జట్టు ఆయన్ను రికార్డు ధరకు కొనుగోలు చేసి తమ జట్టులో చేర్చుకుంది. ఈ ఫ్రాంచైజీ రూ.50 లక్షల బిడ్డింగ్‌లో సగానికి పైగా మొత్తాన్ని సంజూ శాంసన్‌పైనే ఖర్చు చేసింది. ఇది కేరళలో సంజూ శాంసన్ ఎంత పెద్ద ఆటగాడో తెలియజేస్తోంది. వేలం సమయంలో ఒక దశలో త్రిస్సూర్ టైటాన్స్ జట్టు సంజూ శాంసన్ కోసం పోటీ పడింది. వారు రూ.20 లక్షలు బిడ్ చేశారు, కానీ ఆ తర్వాత కొచ్చి బ్లూ టైగర్స్ అందరినీ ఆశ్చర్యపరుస్తూ బిడ్‌ను పెంచి సంజూ శాంసన్‌ను తమ సొంతం చేసుకుంది.తిరువనంతపురంలో జరిగిన వేలంలో అన్ని జట్ల బిడ్డింగ్ మొత్తం రూ.50 లక్షలు. అంటే ఒక జట్టు గరిష్టంగా రూ.50 లక్షలు మాత్రమే ఖర్చు చేయగలదు. ఈ పరిస్థితుల్లో కొచ్చి బ్లూ టైగర్స్ తమ సగానికి పైగా డబ్బును సంజూ శాంసన్‌పైనే ఖర్చు చేసింది. ఈ నిర్ణయం అభిమానులను ఆశ్చర్యపరుస్తోంది, కానీ సంజూ శాంసన్ స్థాయిని బట్టి ఏ జట్టు అయినా ఆయన కోసం ఇలా చేయడానికి సిద్ధంగా ఉంటుంది. ఇప్పుడు ఈ సీజన్‌లో కొచ్చి బ్లూ టైగర్స్ కోసం సంజూ శాసన్ ఏం చేస్తాడో చూడాలి.సంజూ శాంసన్‌తో పాటు కేరళ సహచరుడు విష్ణు వినోద్ పైనా భారీగా డబ్బు కురిసింది. ఆయన ఈ సీజన్‌లో రెండో అత్యంత ఖరీదైన ఆటగాడిగా నిలిచారు. ఆయన్ను ఆరీస్ కొల్లం రూ.13.8 లక్షలకు కొనుగోలు చేసింది. అలాగే జలజ్ సక్సేనాను అలప్పీ రిపుల్స్ రూ.12.4 లక్షలకు తమ జట్టులో చేర్చుకుంది.సంజూ శాంసన్ చివరిసారిగా ఐపీఎల్ 2025లో కనిపించాడు. 18వ సీజన్‌లో గాయం కారణంగా సంజూ చాలా మ్యాచ్‌లు ఆడలేకపోయాడు. సంజూ శాంసన్ అందుబాటులో లేకపోవడంతో ఆల్‌రౌండర్ రియాన్ పరాగ్ రాజస్థాన్ రాయల్స్‌కు నాయకత్వం వహించాడు. ఐపీఎల్ 2025లో సంజూ శాంసన్ 9 మ్యాచ్‌లలో 36 సగటుతో, 140 స్ట్రైక్ రేట్‌తో ఆయన 285 పరుగులు చేశాడు. ఇప్పుడు సంజూ శాంసన్ మరోసారి సిక్సర్లు, ఫోర్ల వర్షం కురిపిస్తూ కనిపించనున్నాడు.సంజూ శాంసన్ టీ20 క్రికెట్‌లో దూకుడుగా ఆడే ఓపెనర్‌లలో ఒకరు. తన కెరీర్‌లో ఈ కుడిచేతి వికెట్ కీపర్- బ్యాటర్ 304 మ్యాచ్‌లలో 29.68 సగటుతో 7629 పరుగులు చేశాడు. సంజూ శాంసన్ బ్యాట్ నుంచి 6 సెంచరీలు, 48 అర్ధ సెంచరీలు వచ్చాయి.




## ఉత్కంఠ పోరులో భారత మహిళల జట్టు పరాజయం

### ఇంగ్లాండ్ 5 పరుగుల తేడాతో విజయం

ఇంగ్లాండ్ జట్టుతో లండన్ వేదికగా జరిగిన మూడో టీ20లో భారత మహిళల జట్టు పరాజయాన్ని చవిచూసింది. చివరి వరకు నువ్వా నేనా అన్నట్లు సాగిన ఉత్కంఠ పోరులో భారత్‌పై ఇంగ్లాండ్ పైచేయి సాధించింది. ఈ మ్యాచ్‌లో భారత జట్టుపై ఇంగ్లాండ్ 5 పరుగుల తేడాతో విజయం సాధించింది. ముందుగా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 171 పరుగులు చేసింది. ఇంగ్లాండ్ ఓపెనర్లు సోఫియా డంక్లీ 75 పరుగులు, వ్యాట్ హాడ్జ్ 66 పరుగులతో అద్భుతంగా రాణించారు. భారత బౌలర్లలో అరుంధతీ రెడ్డి, దీప్తి శర్మలు తలో 3 వికెట్లు పడగొట్టగా.. శ్రీ చరణి 2, రాధా యాదవ్ ఒక వికెట్ తీశారు.ఆ తర్వాత 172 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ బరిలోకి దిగిన టీమిండియా 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 166 పరుగులు మాత్రమే చేసింది. చివరి 2 ఓవర్లలో టీమిండియా విజయానికి 20 పరుగులు అవసరం కాగా.. 19వ ఓవర్లో 8 పరుగులు వచ్చాయి. చివరి ఓవర్‌లో టీమిండియా విజయానికి 12 పరుగులు అవసరమయ్యాయి. క్రీజులో హర్మన్ ప్రీత్ కౌర్ ఉండడంతో విజయం భారత్‌దే అని అంతా భావించారు. కానీ చివరి ఓవర్ వేసిన ఇంగ్లండ్ పేసర్ లారెన్ బెల్ అద్భుతంగా బౌలింగ్ చేసి తొలి 5 బంతుల్లో 6 పరుగులు మాత్రమే ఇచ్చింది. చివరి బంతికి 6 రన్స్ అవసరం కాగా కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ క్యాచ్ ఔటైంది. ఈ క్రమంలో భారత్ 5 పరుగుల తేడాతో పరాజయాన్ని చవిచూడాల్సి వచ్చింది.భారత బ్యాటర్లలో ఓపెనర్లు స్మృతి మంధాన(49 బంతుల్లో 56) అర్ధ శతకం బాదగా.. షఫాలీ వర్మ(27 బంతుల్లో 47) చెలరేగిపోయింది. జెమీమా రోడ్రిగ్స్(20), హర్మన్ ప్రీత్ కౌర్(23) పరుగులు చేశారు. టీమిండియా ఇప్పటికే రెండు మ్యాచ్ ల్లో విజయం సాధించింది. ఈ మ్యాచ్ లో విజయం సాధిస్తే సిరీస్ కైవసం చేసుకుని ఉండేది. ఇంగ్లండ్ బౌలర్లలో లారెన్ ఫైలర్ రెండు వికెట్లు తీయగా.. ఎకిలిస్టోన్, వాంగ్ తలో వికెట్ సాధించారు. ఇరు జట్ల మధ్య నాలుగో టీ20 ఈ నెల 9న మాంచెస్టర్ వేదికగా జరగనుంది.

నేటి సాక్షి
TGTEL/25/A0100 | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా...



# రాజాసాబ్ ముగింపులో ప్రభాస్



కథానాయకుడు ప్రభాస్ 'ది రాజాసాబ్' చిత్రీకరణను ముగించే పనిలో ఉన్నారు. అలాగే ప్రభాస్‌తో హను రాఘవపూడి చేస్తోన్న చిత్రాన్ని చకచకా పరుగులు పెట్టిస్తున్నారు. ఇక ఇప్పుడు మరోవైపు 'స్పిరిట్'ను పట్టాలెక్కించేందుకు జోరుగా సన్నాహాలు చేసుకుంటున్నారు. 'యానిమల్' విజయం తర్వాత సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న బహుభాషా చిత్రమిది. భద్రకాళి పిక్చర్స్ ప్రొడక్షన్స్, టీ--సిరీస్ ఫిల్మ్స్ సంస్థలు నిర్మిస్తున్నాయి. త్రిప్తి దిమ్రీ కథానాయిక. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనుల్లో ఉన్న ఈ సినిమాని సెప్టెంబరు నుంచి సెట్స్‌పైకి తీసుకెళ్లేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు- సమాచారం. ఇప్పటికే దీని కోసం ప్రభాస్ బల్క్ డేట్స్ కేటాయించినట్లు- సమాచారం ప్రస్తుతం దీనికి తగ్గట్లు-గానే పూర్వ నిర్మాణ పనుల్ని వేగవంతం చేసినట్లు తెలిసింది. హైఓల్టేజ్ కాప్ యాక్షన్ థ్రిల్లర్‌గా ముస్తాబవుతున్న ఈ సినిమాలో ప్రభాస్ శక్తిమంతమైన పోలీసు పాత్రలో కనువిందు చేయనున్నారు. దీన్ని తొమ్మిది భాషల్లో ప్రపంచవ్యాప్తంగా ఒకేసారి విడుదల చేయనున్నారు. ఈ చిత్రానికి సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్.



# శేఖర్ కమ్ములతో సినిమా.. పవర్‌ఫుల్ పాత్రలో సమంత!

"శేఖర్ కమ్ములతో సినిమా చేయాలని ఉంది. హీరోయిన్లకు ఆయన మంచి పాత్రలు రాస్తారు" అన్నట్లుగా ఓ సందర్భంలో సమంత పేర్కొన్నారు. ఇప్పుడు ఆ సమయం ఆసన్నమైనట్లు తెలుస్తోంది. ఇటీవల నాగార్జున%-%ధనుష్‌తో 'కుబేర' వంటి హిట్ మూవీ ఇచ్చిన శేఖర్ కమ్ముల.. తదుపరి ఒక ఫిమేల్ ఓరియంటెడ్ సినిమా చేయాలనుకుంటున్నారని సమాచారం. ఈ చిత్రంలో సమంత కథానాయికగా నటిస్తారనే టాక్ వినిపిస్తోంది. ఒక బలమైన అంశం చుట్టూ తిరిగే ఈ చిత్రంలో కథానాయిక పాత్ర చాలా వపర్‌ఫుల్‌గా ఉంటుందట. ఇదిలా ఉంటే నాని హీరోగా శేఖర్ కమ్ముల ఓ సినిమా చేయనున్నారనే వార్త వచ్చిన విషయం తెలిసిందే. "ఈ సినిమాకి సంబంధించిన చర్చ ఇంకా ప్రారంభ దశలోనే ఉంది. పూర్తి స్క్రిప్ట్ రెడీ అయ్యాక ఈ సినిమా గురించిన వివరాలను షేర్ చేస్తాను" అని ఆ మధ్య శేఖర్ కమ్ముల స్పష్టం చేశారు. ఈలోపు సమంతతో ఆయన సినిమా చేయనున్నారనే వార్త తెరపైకి వచ్చింది. మరి... శేఖర్ కమ్ముల దర్శకత్వంలో నెక్స్ట్ రానున్న సినిమా ఏంటి? అది హీరో ఓరియంటెడ్ మూవీనా? లేక హీరోయిన్ ఓరియంటెడా? ఎవరు నటిస్తారు? అనేది తెలియాలంటే కొన్నాళ్లు వేచి చూడక తప్పదు.




## ఐశ్వర్-అభిషేక్ బచ్చన్‌ల

# విడాకుల పుకార్లు

### రూమర్స్‌ను మేము పట్టించుకోమన్న అభిషేక్

కొన్ని రోజులుగా అభిషేక్ బచ్చన్, ఐశ్వర్య రాయ్ విడాకులు అంటూ నానా రకాల రూమర్స్ వస్తున్నాయి. కానీ వాటిపై వీరిద్దరూ స్పందించట్లేదు. తరచూ వీరిద్దరూ వేర్వేరుగా కనిపిస్తుండటంతో ఈ రూమర్లు మరింత పెరుగుతున్నాయి. తాజాగా అభిషేక్ బచ్చన్ వీటిపై ఇన్ డైరెక్ట్ గా స్పందించాడు. సోషల్ మీడియాలో వచ్చే వాటిని మా ఇంట్లో పెద్దగా పట్టించుకోం. కేవలం వర్క్ గురించి మాత్రమే మేం డిస్కస్ చేసుకుంటాం. ఖాళీగా ఉంటే అందరం కుటుంబ విషయాలను పంచుకుంటాం. మా అమ్మ, నా భార్య బయటి విషయాలను ఇంట్లోకి అస్సలు తీసుకురారు. బయట ఎన్ని రకాల రూమర్లు వచ్చినా వారు పెద్దగా పట్టించుకోరు. రీసెంట్ గా ఇలాంటివి మా గురించి ఎక్కువగా వస్తున్నాయి అంటూ అభిషేక్ పరోక్షంగా తమ విడాకుల రూమన్స్‌పై తెలిపాడు. మా కుటుంబం అంతా చాలా సంతోషంగా ఉన్నాం. ఎలాంటి సమస్యలు లేవు. నేను ఐశ్వర్యరాయ్ ను స్విట్జర్ లాండ్ లో 1995లో ఫస్ట్ -టైమ్ కలిశాను. అప్పుడే ఆమె నాకు ఎంతో నచ్చింది. ఫస్ట్ టైమ్ మేం డిన్నర్ కు వెళ్లాం. అప్పటి నుంచే ఇద్దరి మధ్య క్లోజ్ నెస్ పెరిగింది. ఆమె వ్యక్తిత్వం అంటే నాకు ఎంతో ఇష్టం. మా నాన్నగారి సినిమాల్లో నటిస్తుందని తెలిసి ఇంకా సంతోషించాను. మెల్లిమెల్లిగా ఇద్దరం ఒకరికొకరం అర్థం అయ్యాం. మా ఇద్దరి మధ్య అప్పుడు ఎంత ప్రేమ ఉందో ఇప్పుడు కూడా అంతే ఉంది. ఎప్పటికీ మేమంతా కలిసే ఉంటాం. నా కూతురు ఆరాధ్య అంటే మాకు ఎంతో ఇష్టం. ఇప్పటికీ ఆమెకు ఫోన్ లేదు. ఆమె మా ఇంటి గౌరవాన్ని కాపాడుతోంది. ఆమె ఎదుగుదల పట్ల మేం ఎంతో సంతోషంగా ఉన్నాం. ఎప్పటికీ ఆమె వ్యక్తిత్వానికి మేం గౌరవం ఇస్తూనే ఉంటాం అని చెప్పారు అభిషేక్ బచ్చన్.

# ఓ భామ అయ్యో రామ అంటోన్న సుహాస్ ..

సినిమా సినిమాకు డిఫరెంట్ కథలను ఎంచుకుంటూ దూసుకెళుతున్న కథానాయకుడు సుహాస్ తాజాగా నటిస్తున్న రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్ 'ఓ భామ అయ్యో రామ'. మలయాళంలో జో అనే చిత్రంతో అందరి హృదయాలను దోచుకున్న నటి మాళవిక మనోజ్ ఈ చిత్రంతో తెలుగులో కథానాయికగా పరిచయమవుతోంది. రామ్ గోధ దర్శకుడు. వీ ఆర్ట్స్ పతాకంపై హరీష్ నల్ల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రముఖ కథానాయకుడు రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా ఈ చిత్రాన్ని విడుదల చేయనుంది. జులై 11న ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ చిత్రం నుంచి తాజాగా మేకర్స్ థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేశారు.ట్రైలర్ చూస్తుంటే.. ఇదొక క్యూట్ అండ్ ఎంటర్-టైనింగ్ లవ్‌స్టోరీలా అనిపిస్తుంది. ట్రైలర్‌లోని ప్రతి ఫ్రేమ్ కలర్‌ఫుల్‌గా ఉంది. సుహాస్ ఎంతో ఎనర్జీగా కనిపించాడు. హీరోయిన్ మాళవిక, హీరో సుహాస్ మధ్య వచ్చే సన్నివేశాలు ఎంతో వినోదాన్ని పంచాయి. ఇక ఈ చిత్రంలో దర్శకులు హరీశ్ శంకర్, మారుతి అతిథి పాత్రల్లో మెరవబోతున్నారు.



# ఫిష్ వెంకట్‌కు ప్రభాస్ సాయంఅంటూ ప్రచారం

## అదంతా ఉత్తిదే అని కొట్టి పారేసిన కుటుంబం



తన భర్త ఆరోగ్యం రోజురోజుకూ క్షీణిస్తోందని, దీనస్థితిలో ఉన్న తమను ఆదుకోవాలంటూ నటుడు ఫిష్ వెంకట్ భార్య సువర్ణ కోరుతున్నారు. వెంకట్ నాలుగేళ్లుగా రెండు కిడ్నీలూ చెడిపోవడంతో డయాలసిస్ ద్వారా చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం ఆయన బోడుప్పల్‌లోని ఆర్బీఎం ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. అయితే వెంకట్ ఆరోగ్య పరిస్థితిపై నటుడు ప్రభాస్ స్పందించి రూ.50లక్షలు ఆర్థిక సాయం అందించారని వస్తున్న వార్త అవాస్తవమని ఆయన భార్య సువర్ణ తెలిపారు. ప్రభాస్‌కు ఈ విషయం తెలియక పోవచ్చని.. తెలిస్తే తమకు తప్పకుండా సాయం చేస్తారని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సినీ పెద్దలు, దాతలు ముందుకు వచ్చి తన భర్తను కాపాడాలని కోరారు. తీవ్ర అనారోగ్యంతో టాలీవుడ్ సహాయ నటుడు ఫిష్ వెంకట్ ప్రస్తుతం కిడ్నీ సంబంధిత సమస్యలతో ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. ఆయనకు తప్పనిసరిగా కిడ్నీ మార్పిడి చేయాల్సి ఉండగా... ఆపరేషన్‌కు రూ.50 లక్షల వరకూ ఖర్చవుతుందని వైద్యులు తెలియజేశారు. అయితే ఎవరైనా దాతలు ఉంటే సాయం చేయాలని కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు. వెంకట్ కుమార్తె సహా కుటుంబ సభ్యులు ఇప్పటికే పలుమార్లు ఆర్థిక సహాయం కోరినప్పటికీ, సినీ పరిశ్రమ నుంచి పెద్దగా స్పందన రాలేదట. కుటుంబం చేసిన విజ్ఞప్తికి గబ్బర్ సింగ్ గ్యాంగ్ (కొంతమంది సహనటులు) మాత్రమే స్పందించారని, మిగిలిన వారు ఎవరు కూడా రెస్పాండ్ కాలేదని వార్తలు వచ్చాయి. అయితే ప్రముఖ హీరో ప్రభాస్ ఫిష్ వెంకట్‌కు రూ. 50 లక్షల సాయం ప్రకటించారని స్థానిక, జాతీయ మీడియాల్లో వార్తలు వచ్చాయి.ఆపరేషన్‌కి కావల్సిన సాయం అందిస్తామని ప్రభాస్ టీం నుండి ఒకరు కాల్ చేసినట్టు జోరుగా ప్రచారాలు అయితే నడిచాయి. దీనిపై కొందరు ప్రభాస్ టీమ్‌ని వివరణ కోరగా, తాము కాల్ చేయలేదని, ఏదైన విషయం ఉంటే మీడియా ద్వారా తెలియజేస్తామని అన్నారట. దీంతో ప్రభాస్ సాయంకి సంబంధించి వచ్చిన వార్తలు అన్నీ ఫేక్ అని తేలింది. కుటుంబ సభ్యులు ఒక కిడ్నీని దానం చేయాలన్నా కూడా వారిది మ్యాచ్ కావడం లేదట. నా తండ్రి రక్తం గ్రూపు నాది మ్యాచ్ కాకపోవడంతో డాక్టర్స్ తిరస్కరించారు. నాన్న తమ్ముడి బ్లడ్ గ్రూప్ మ్యాచ్ అయినా కూడా ఆయనకు పలు అనారోగ్య సమస్యలు ఉన్నాయి. దాతలు ఎవరైనా ఉన్నారేమోనని డోనర్ సంస్థలను సంప్రదిస్తున్నాం అని కుటుంబ సభ్యులు తెలియజేశారు. ఫిష్ వెంకట్ విలన్, హాస్య పాత్రలతో ప్రేక్షకులకి మంచి వినోదాన్ని పంచారు.. గబ్బర్ సింగ్, బన్నీ, దిల్, నాయక్, అత్తారింటికి దారేది, డీజే టిల్లు, అదుర్స్, ఢీ, మిరపకాయ్ వంటి హిట్ సినిమాలలో నటించి మంచి పేరు తెచ్చుకున్నారు. ఇటీ-వల ఆహాలో రిలీజ్ అయిన 'కాఫీ విత్ ఎ కిల్లర్' మూవీలో కూడా నటించి అలరించారు. అలాగే, 'మా వింత గాధ వినుమా' మూవీలో కనిపించి సందడి చేశారు.



Printed, Published and Owned by **SHAIK FAREED,** and Printed at Sunday Printing Press, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006. and Published from 6-1-303, SIDDIPET, TELANGANA - 505528, Telangana State. Editor: **SHAIK FAREED. RNI NO : TGTEL/25/A0100** Email: netisakshinews@gmail.com. Phone No: **9119949944, 966605221**

నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..
ఆదివారం
6 జూలై 2025


# పేట రాజకీయంలో సామాజిక కార్యకర్త..!

## అంచలంచలుగా ఎదుగుతున్న భీష్మ ఫౌండేషన్ చైర్మన్ రాజ్ కుమార్ రెడ్డి

**నేటి సాక్షి,నారాయణపేట, జూలై 5 :** నారాయణపేట నియోజకవర్గం లో సామాజిక కార్యకర్తగా తెరమీదికి రానున్నారు. నారాయణపేట నియోజకవర్గంలోని కాకుండా జిల్లా వ్యాప్తంగా అతని పేరు,,,, కొనియాడ తగినవి. ప్రతి సంవత్సరం తన సంపాదనలో సగం సేవా కార్యక్రమాలకు వినియోగిస్తుంటారు. పేద ప్రజలకు సహాయం చేయాలనే సంకల్పంతో భీష్మ ఫౌండేషన్ను స్థాపించడం జరిగిందని నియోజకవర్గంలో ప్రజలు చర్చించుకుంటున్నారు. ఎవరైనా సేవదృక్పథంతో ఇస్తూనే ఫౌండేషన్ ద్వారా పైసా మిగిల్చుకోకుండా పేదల కోసమే విరాళాలు ఇస్తుంటారని ప్రజలు చర్చించుకుంటున్నారు. నియోజకవర్గంలో వైద్యానికి చదువులకు ఉంటారని నియోజకవర్గంలో ప్రజలు చర్చించుకుంటున్నారు. ఎదగాలంటే ఒక ఎమ్మెల్యే స్థానానికి పోటీ చేయాలంటే కోట్లాది రూపాయలు ఖర్చు చేయాల్సి ఉంటుంది. భీష్మ ఫౌండేషన్ స్థాపకుడు అయిన రాజకుమార్ రెడ్డి నియోజకవర్గంలో ఏ పార్టీ నుంచి అయినా నిలబడితే విజయం సాధిస్తారని నారాయణపేట నియోజకవర్గం లో ప్రజలు చర్చించుకుంటున్నారు. పేట నియోజకవర్గంలో ప్రతిరోజు భీష్మ ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు



చేస్తూ నియోజకవర్గ ప్రజల మధ్యనే ఉంటూ ప్రజాసేవకు రాజ్ కుమార్ రెడ్డి అంకితం గా ఉన్నారని ప్రజలు చర్చించు కుంటున్నారు. నారాయణపేట నియోజకవర్గం నుండి కాకుండా పేట జిల్లాలో రాజ్ కుమార్ రెడ్డి పేరు అంచలంచెలుగా ఎదుగుతున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు. ప్రజలకు ఎలాంటి ఆపదలు వచ్చినా ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తూ ఉంటారని ప్రజలు చర్చించుకుంటున్నారు. భీష్మ ఫౌండేషన్ అధినేత ఏ రాజకీయ పార్టీ నుండి పోటీ చేసిన గెలిపించేందుకు నియోజకవర్గ ప్రజలు చర్చిస్తున్నట్లు తెలిసింది. నారాయణపేట నియోజకవర్గం లోని ప్రతి గ్రామంలో మా ఫౌండేషన్ అధినేత రాజ్ కుమార్ రెడ్డి కి మంచి పేరు ఉందని ప్రజలు చర్చించుకుంటున్నారు. శాసనసభ ఎన్నికలు ఇంకా మూడు సంవత్సరాలు ఉన్నప్పటికీ భీష్మ ఫౌండేషన్ అధినేత రాజ్ కుమార్ రెడ్డి రాజకీయ వైపుగా అడుగులు వేస్తున్నారు. అన్ని జిల్లాల కంటే నారాయణపేట జిల్లా వెనుకబాటు తనాన్ని నిర్మూలించడానికి భీష్మ ఫౌండేషన్ను నారాయణపేట జిల్లాలో స్థాపించడం జరిగిందని తెలిసింది. నారాయణపేట నియోజకవర్గం ప్రజలకు కోడుగుడ్డ ఉపాధి వైద్యం అలాగే విద్య కూడా అందించే లక్ష్యంతో వర్గం అభివృద్ధిపై భీష్మ ఫౌండేషన్ ప్రత్యేక శ్రద్ధ వహించిందని నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో ప్రజలు చర్చించుకుంటున్నారు. సేవా కార్యక్రమాలను గుర్తిస్తూ భీష్మ ఫౌండేషన్ అధినేత రాజ్ కుమార్ రెడ్డి పేరు నారాయణపేట నియోజకవర్గం లోని అంచలంచెలుగా ఎదుగుతున్నారని నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో ప్రజలు చర్చించుకుంటున్నారు.

# నారాయణపేట జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు

## మూఢనమ్మకాలపై జిల్లాలో గ్రామాల వారిగా అవగాహన సదస్సులు నిర్వహించాలి- గున్ముకుల మాజీ ఎంపీటీసీ గౌని శ్రీనివాసులు

**నేటి సాక్షి, నారాయణపేట, జులై 5 :** నారాయణపేట జిల్లాలోని ధన్వాడ మండలం యంనాన్ పల్లి గ్రామంలో ప్రతి అమావాస్య రోజు ప్రతి శనివారం 150 రూపాయలు టోకెన్ తీసుకొని అమాయక ప్రజలను మోసం చేస్తున్న పూజారి రాజు అమాయక ప్రజలు ఆయన మాట నమ్మి మోసపోతున్నారు ఇప్పుడే విచారించగా అక్కడకు వెళ్లడం జరిగింది. ప్రజలను నిలదీశాను అక్కడ ఉన్న హనుమాన్ పూజారి కృష్ణయ్య గారిని నిలదీయడం జరిగింది. అమాయక ప్రజలను ఇలా చేయడం పద్ధతి కాదు ప్రతి ఆలయంలో ప్రభుత్వం నెల పదివేల రూపాయలు పూజారులకు ఇస్తుంది. మన మూడో నమ్మకాన్ని ప్రోత్సహించవద్దు గ్రామ సెక్రెటరీ గారి కూడా చెప్పడం జరిగింది ధన్వాడ ఎమ్మార్వో గారి కూడా చెప్పడం



జరిగింది. ధన్వాడ మండలంలో చాలా గ్రామాల్లో ఇలాంటి దొంగ పూజారులు ప్రజలను మూడో నమ్మకాలతో నమ్మిస్తూ డబ్బులు వసూలు చేస్తూ మోసం చేస్తూ ఉన్నారు. ప్రజలు గ్రహించాలి నారాయణపేట జిల్లా కలెక్టర్ గారు ఈ మూడో నమ్మకం పై ప్రతి గ్రామంలో అవగాహన సదస్సులు నిర్వహించాలని ఇటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలి

- పేదల సమస్యలపై పోరాటం ఆపేది లేదు
- రాజకీయ విమర్శలను పక్కన పెట్టి...
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ బాల నరసింహా.

**నేటి సాక్షి, నారాయణపేట,జులై 5 :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)నారాయణపేట జిల్లా రెండవ మహాసభలు మరికల్ మండలంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సమాజంలో ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ బాల నరసింహా గారు మహాసభ ప్రారంభంలో ఎర్రజెండా అరుణ పతాకాన్నిఎగురవేశారు అనంతరం ఆయన మాట్లాడుతూ :- కమ్యూనిస్టు పార్టీ మనదేశంలో ఏర్పడి నేటికీ 100 సంవత్సరాలు అయ్యిందని అప్పటినుండి ఇప్పటివరకు ఎప్పుడు అధికారంలో లేకున్నా నిరంతరం పేద ప్రజల పక్షాన ప్రజలకు అండగా నిలబడి వారికి జరిగే అన్యాయాల పైన దోపిడీల పైన వెట్టి చాకిరి విముక్తి పైన అనేక పోరాటాలు చేసిన పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ. మనదేశంలో చాలా పార్టీలు ఉన్నాయి కానీ పేద ప్రజల పక్షాన నిలబడే పార్టీ ఏదైనా ఉంది అంటే అది భారత కమ్యూనిస్టు పార్టీ అని ఆయన అన్నారు.అదేవిధంగా మనదేశంలో బిజెపి ప్రభుత్వంలో ప్రజాస్వామ్యానికి స్వేచ్ఛ లేకుండ పోయింది ఈ దేశంలో ఉన్న మేధావులకు గాయకులకు కవులకు ప్రశ్నించే హక్కు లేకుండా మరి గొంతు నొక్కడమే ప్రధానపనిగా ఈ బీజేపీ ప్రభుత్వం చేస్తుంది ఈ దేశంలో మూడుసార్లు అధికారం లోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం ఒక కొత్త పరిశ్రమను కూడా తీసుకురాలేదు విద్యార్థుల గురించి మనదేశంలో ఒక యూనివర్సిటీ కూడా తీసుకురాలేదు సంవత్సరానికి



రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తాను ఈ ప్రభుత్వం సంవత్సరానికి 20వేల ఉద్యోగాలను కూడా భర్తీ చేయలేకపోయింది అధికారం వచ్చిన మొదట్లో ప్రపంచంలో ఉన్న నల్ల ధనం తీసుకొచ్చి పేదలకు పంచుతానని చెప్పిన నరేంద్ర మోడీ గారు పేద ప్రజలకు జన్ధన్ ఖాతా ఓపెన్ చేయించి ఒక్క రూపాయి కూడా పేద ప్రజల ఖాతాలో వేయకుండా తిరిగి వారి నుండే సంవత్సరానికి బ్యాంకు చార్జెస్ పేరుపైన 300 నుంచి 500 వరకు కోతలు విధిస్తున్నదని ఆయన అన్నారు. భారతదేశంలో అనేక మతాలకు చెందిన వారు జీవిస్తున్నారు వాళ్ల మధ్యన ఏనాడు మత ఘర్షణలు లేవు కానీ ఈ బీజేపీ ప్రభుత్వం అధికారంలో వచ్చినప్పటి నుంచి హిందూ మతం పేరు పైన మత రాజకీ యాలు చేస్తూ ఎన్నికలలో నెగ్గుతూ వస్తుంది ఇది ప్రధానంగా బిజెపి ప్రధాన ఎన్నికల స్టంట్ మన రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామన్న మాటను ఇప్పటిదాకా నెరవేర్చుకోలేదు అదేవిధంగా రైతు భరోసా ఎకరాకు ఒక సంవత్సరానికి పదివేల నుంచి 15 వేల రూపాయలు ఇస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు పూర్తిస్థాయిలో చెల్లించలేదు తక్షణమే ఈ రెండిటిని పూర్తిస్థాయిలో అమలు చేయాలని అదేవిధంగా ఇందిరమ్మ ఇళ్ళ విషయంలో ఎటువంటి రాజకీయ ప్రమేయం లేకుండా మొదటి విడతలో ఇస్తున్న ఇండ్లను ఇల్లులేని పేద ప్రజలకు ఇల్లు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కామ్రేడ్ విజయ రాములు నారాయణపేట జిల్లా కౌన్సిల్ సభ్యులు నరసింహా వెంకటేష్ సంతోష్ రాము కోస్గి శ్రీను నాగరాజు వివిధ మండలాల గ్రామాల ప్రజలు ప్రతినిధులు కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే చొరవతో ట్రాన్స్ఫార్మర్ రిపేర్

## ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన మాజీ కౌన్సిలర్ శేఖర్ రెడ్డి

**నేటిసాక్షి, మిర్యాలగూడ :** పట్టణంలోని రెడ్డి కాలనీ 20వ వార్డులోని కోదండ రామాలయం ఎదురుగా ఉన్నటువంటి ట్రాన్స్ఫారం గుడికి వచ్చి పోయే భక్తులకు ఇబ్బందిగా ఉంటూ, తరచూ రిపేర్లు వస్తున్నాయని ట్రాన్స్ఫారంను మార్చాలని ఆలయ నిర్వహకులు గత పది సంవత్సరాలుగా గత ప్రభుత్వ నాయకులకు పలుమార్లు విన్నవించుకున్నప్పటికీ ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదని రెడ్డి కాలనీ మాజీ కౌన్సిలర్ దేశపు శేఖర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో ఎన్నోసార్లు గత శాసనసభ్యులకు మా ట్రాన్స్ఫారం సమస్యను విన్నవించుకున్నప్పటికీ వారు మా మాటలు పెడచెవిన పెట్టి నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించారు. ఈ ట్రాన్స్ఫారం వలన దేవాలయానికి వచ్చే భక్తులకు మరియు ఆలయ పూజారికి చాలా ఇబ్బందిగా ఉందని ఎమ్మెల్యే బిఎల్ఆర్ గా దృష్టికి తీసుకు వెళ్ళగానే వారు వెంటనే స్పందించి, విద్యుత్ అధికారులతో మాట్లాడి 15 రోజుల్లోగా ఆ ట్రాన్స్ఫారం పని అయి-



పోవాలని శనివారం ఆదేశించినట్లు తెలిపారు. 20వ వార్డులో ఏ సమస్య వచ్చినా, ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్ళగానే సత్వరమే స్పందించి మమ్ములను కార్యోన్ముఖులను చేస్తున్నందుకు ఎమ్మెల్యే బిఎల్ఆర్ కి మా వార్డు ప్రజల తరుపున ప్రత్యేక ధన్యవాదాలు అని అన్నారు. ఈ కార్యక్రమంలో 25వ వార్డు ఇంచార్జి గోదాల జానకి రామ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు మారుతి వెంకటరెడ్డి, జెర్రిపోతుల నగేష్, భాను, రఘు, శ్రీనివాస్, రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ ఓసి అందజేసిన ఎమ్మెల్యే



**నేటి సాక్షి, దేవరకద్ర జులై 5 :** మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని మదనాపురం మండలం గోపాన్ పేట గ్రామానికి చెందిన ఎం. సుధాకర్ నాయక్ వైద్యం కోసం శనివారం దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి(జిఎంఆర్) రూ. 90 వేల ఎల్ఓసి అందజేశారు. సుధాకర్ నాయక్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స చేసుకోవడానికి ముఖ్యమంత్రి సహాయ నీధి ద్వారా వచ్చిన ఈ ఎల్ ఓ సిని ఆయన కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పేకాట స్థావరంపై దాడి

**నేటి సాక్షి - కోరుట్ల ( రాధారపు నర్సయ్య ) :** కోరుట్ల మండలం లోని సంగెం రోడ్డు లోని వ్యవసాయ భూమి వద్ద నడుస్తోన్న పేకాట స్థావరంపై దాడి చేసినట్టు కోరుట్ల ఎస్ ఐ చిరంజీవి తెలిపారు. నలుగురు వ్యక్తులు పేకాట ఆడుతుండగా,ఈ పేకాట స్థావరంపై జగిత్యాల సిసిఎస్ పోలీస్ మరియు కోరుట్ల పోలీసు వారు సంయుక్తంగా దాడి చేసి ఆ నలుగురు వ్యక్తులని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ ఐ తెలిపారు.వారి వద్ద నుండి రూ. 7210 లు మరియు రెండు సెల్ ఫోన్లను సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు.

# తాగునీటి విడుదల



**నేటి సాక్షి,నారాయణపేట జులై 5 :** తెలంగాణ రాష్ట్ర పాడిపరిశ్రమ,మత్స్య, యువజన సర్వీస్,స్పోర్ట్స్ శాఖ మంత్రివర్యులు గారి ఆదేశాల మేరకు నారాయణపేట జిల్లాలోని మక్తల్ నియోజకవర్గం లోని భూత్పూర్ రిజర్వాయర్ నుండి రాష్ట్ర మంత్రివర్యులు డా .వాకిటి శ్రీహరి గారి ఆదేశాల మేరకు ఎగువన కురుస్తున్న వర్షాలకు క్రిష్ణ నదికి భారీ ఎత్తున వరద వస్తున్న సందర్భంగా మక్తల్ నియోజక వర్గంలోని రైతులకు వర్షాకాలం పంటలకు తాగు,సాగు నీటిని ఎడమ,కుడి కాలువల ద్వారా ఇరిగేషన్ అధికారులు డి ఈ సతీష్ కుమార్ .నీరు విడుదల చేశారు నియోజకవర్గ ముఖ్య నాయకులు మార్కెట్ కమిటీ చైర్మన్ రాధా లక్ష్మారెడ్డి వైస్ చైర్మన్ గణేష్ కుమార్ కట్ట సురేష్ కృష్ణయ్య గౌడ్ బిల్డర్ తాయప్ప, రామ్ రెడ్డి, నాగిరెడ్డి, రాములు నారాయణ కే చెన్నయ్య గౌడ్ జనార్దన్ గౌడ్, బొంబాయి నరసింహ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య



**నేటి సాక్షి - జగిత్యాల ( రాధారపు నర్సయ్య ) :** జగిత్యాల రూరల్ మండల్ జాబితాపూర్ గ్రామానికి చెందిన కాటిపెల్లి నిత్య(21) హైదరాబాద్ లోని కెపిహెచ్బి కాలనీలోని ఓ హాస్టల్లో ఉంటూ బీటెక్ థర్డ్ ఇయర్ చదువుతోంది. ఇటీవల నిత్యను చదువులో వెనుకబడ్డావంటూ స్నేహితులు వైష్ణవి, సంజన అవమానించారు. దీంతో ఇంటికి వచ్చిన నిత్య ఈ నెల 2న గడ్డి మందు తాగి ఆత్మహత్య కి పాల్పడగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదుతో స్నేహితురాళ్ళు వైష్ణవి, సంజనలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సదాకర్ తెలిపారు.

# గోరింటాకు సంబరాలు



**నేటి సాక్షి - జగిత్యాల ( రాధారపు నర్సయ్య ) :** ఆషాఢ మాసం సందర్భంగా శనివారం తపోవన్ హైస్కూల్లో గోరింటాకు సంబరాలు నిర్వహించారు. పాఠశాలలోని విద్యార్థులు అందరూ గోరింటాకుతో తమ చేతులను అలంకరించుకున్నారు. స్కూల్ కరెస్పాండెంట్ గోరింటాకు విశిష్టతను మన సాంప్రదాయాన్ని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఎంతో సంబరంగా పాల్గొన్నారు. చిన్నారులు తమ ఆటపాటలతో అందరినీ అలరించారు. ఈ కార్యక్రమంలో కరెస్పాండెంట్ అనుమల్ల శ్యామ్ ప్రిన్సిపల్ శ్రీమతి శ్వేత ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..

10 ఆదివారం 6 జూలై 2025


# దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

**జూలై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చిన ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు ఇరుగురాల భూమేశ్వర్**

**నేటిసాక్షి (కె గంగాధర్)పెగడపల్లి :** పెగడపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్మిక సభలో ఇరుగురాల భూమేశ్వర్ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలు నిరసనగా కేంద్ర రాష్ట్ర కార్మిక సంఘాలు ఈ నెల 9న జరిగే సమ్మెను కార్మికులు కర్షకులు ప్రజలు దేశభక్తి సమయం విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు కేంద్రంలో మూడవసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం దేశంలో బడా పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తుందని దానిలో భాగంగానే పేద మధ్యతరగతి ప్రజలు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను పూర్తిగా నిర్వీర్యం చేసి నాలుగు లేబర్ కోడులుగా విభజించడానికి మేము తీవ్రంగా ఖండిస్తున్నాం ఇప్పటికే కార్మిక చట్టాలను కార్మికులకు పూర్తిస్థాయిలో ఉపయోగపడటం లేదు అనుకుంటే ఇప్పటికీ కార్పొరేట్ శక్తులకు ఎస్బిఐ లకు అనుకూలంగా చట్టాలను మారుస్తున్నారు ఎనిమిది గంటల పని విధానం సమ్మె చేసే హక్కు కనీస వేతన చట్టాలను హక్కులను కార్మికులు కోల్పోతే కార్మికులు తీవ్రంగా నష్టపోతారని ఇప్పటికే దేశ సహజ సంపదలను పూర్తిగా దేశంలోని కార్పొరేట్ శక్తులకు ధారథం చేశారని అదే క్రమంలో ఉద్యోగులను కార్మికులను దోపిడీ చేసే విధంగా కాంట్రాక్టు అవుట్సోర్సింగ్ కార్మికులను గుర్తించి ప్రభుత్వం సమాన పనికి సమాన వేతనం 26000 ఇవ్వాలని కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఫిక్స్ టర్మ్ అప్రిటీస్ థర్డ్ పార్టీ ట్రైనీలుగా పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని కనీస వేతన చట్టం 26000 అమలు చేయాలని పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని స్కీన్ వర్కర్స్ కి కనీస వేతనం ఈఎస్ఐ పిఎఫ్ గ్రాట్యుటి రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని వ్యవసాయ ఉత్పత్తి దారులకు కనీస మద్దతు ధర ఇవ్వాలని ఉపాధి హామీ చట్టాన్ని పట్టణాలకు విస్తరించాలని సంవత్సరానికి ₹200 రోజులు పని కల్పించాలని రోజు కూలి వేతనంగా 600 ఇవ్వాలని పలు కార్మిక సంఘాల డిమాండ్లు సాధించాలని సంకల్పంతో ఏఐటీయూసీ ఇతర సంఘాలతో ఐక్య పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఏఐటిసి



జిల్లా నాయకులు శనిగరపు ప్రవీణ్ ఏఐటియుసి మండల కన్వీనర్ రాచర్ల సురేష్ మండల నాయకులు గుడ్ల శ్రీనివాస్ దీకొండ రవి సుంకే ప్రకాష్ సి పెల్లి బాబు లింగంపల్లి కొమురయ్య ఆత్మకు రాజేషులు పాల్గొన్నారు

# 42 శాతం రిజర్వేషన్లతో ఎన్నికలు జరపాలి

**సావిత్రిబాయ్ పూలే ఫౌండేషన్ ఉపాధ్యక్షురాలు దాసరి రజనీ**



**నేటి సాక్షి - జగిత్యాల ప్రతినిధి :** రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన మీదటే ఎన్నికలు నిర్వహించాలని సావిత్రిబాయ్ పూలే ఫౌండేషన్ ఉపాధ్యక్షురాలు దాసరి రజనీ అన్నారు. శనివారం రజనీ మాట్లాడుతూ.రాష్ట్రంలో కుల గణన చేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట నిలబెట్టుకున్న మాదిరిగానే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ,మండల పరిషత్, జిల్లా పరిషత్, మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ అమలు చేసీ తమిళనాడు తరహాలో రిజర్వేషన్ ప్రకటించాకే ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వాన్ని రజని కోరారు.

# ఒక మార్పు అభివృద్ధికి మలుపు

**కొనసాగుతున్న 100 రోజుల కార్యక్రమం**



**నేటి సాక్షి, కోరుట్ల టౌన్ (గణేష్ గొల్లపల్లి) :** 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మున్సిపల్ కమిషనర్ రవీందర్ పలు వార్డులలో జరుగుతున్న పారిశుద్ధ పనులను మరియు డంపింగ్ యార్డ్ లో జరుగుతున్న రోడ్డు పనులను పరిశీలించడం జరిగింది. మరియు మున్సిపల్ కమిషనర్ రవీందర్ ఆదేశాల మేరకు పలువార్డులలో తడి చెత్త, పొడి చెత్త, హానికార చెత్త గురించి అవగాహన కల్పించారు. 23వ వార్డులో మిషన్ భగీరథ వాటర్ లో క్లోరినేషన్ లెవెల్స్ పరిశీలించారు.మురికి కాలువలను శుభ్రం చేస్తూ రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కల్ని తొలగించడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవీందర్, డి.ఈ సురేష్, సానిటరీ ఇన్స్పెక్టర్ రాజేంద్రప్రసాద్,అశోక్, పర్యవేక్షణ అధికారులు, వార్డ్ ఆఫీసర్లు మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీశక్తి పీఠం లో మహా పూర్ణాహుతి

**శ్రీ మాతాజీ కి 500 వివిధ రకాల కిలోల పుష్పాలతో పుష్పాభిషేకం**



**నేటి సాక్షి, రామచంద్రాపురం :**రాయలు చెరువు లో వెలసిన శ్రీ శక్తి పీఠంలో జరుగుతున్న శ్రీ వారాహి దేవీ నవరాత్రులు ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి అనంతరం శనివారం అమ్మ వారికి 108 రకాల విశిష్ట సుగంధ ద్రవ్యాలతో వేద పండితులు మంత్రోచ్ఛారణల నడుమ మహా పూర్ణాహుతి వేడుకగా జరిగింది అనంతరం కుర్తాళం పీఠాధిపతి శ్రీ సిద్ధేశ్వరానంద భారతీ స్వామి దివ్య సమక్షంలో మాతాజీ మంత్ర మహేశ్వరి శ్రీ శక్తి పీఠాధీశ్వరి శ్రీ రమ్యానంధ భారతీ మాతాజీ కి 500 కిలోల వివిధ రకాల పుష్పాలతో పు□ష్పాభిషేకం వైభవోపేతంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు శ్రీ రమ్యానంధ భారతీ మాతాజీ ఆశీర్వచనం అందించారు అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసిన అనంతరం భోజనం ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల,జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు

# మొహర్రం.. త్యాగాలకు ప్రతిరూపం



**నేటి సాక్షి కొమరం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి జులై 5 :** పండుగ.సందర్భంగా సిర్పూర్ టీ లో ఈరోజు హెచ్.పీ గ్యాస్ ఎదురుగా ఉన్న మదీనా చికెన్ సెంటర్ యజమాని మహమ్మద్ యూసుఫ్ & సన్స్. మండలం కేంద్రంలో షర్బత్ పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఇమామే హసేన్ హుస్సేన్ త్యాగాలకు ప్రతిరూపంగా ప్రతి ఒక్క ముస్లిం ఇలాంటి కార్యక్రమం చేయాలని. కార్యక్రమంలో ఇఫత్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు

# మావోయిస్టు దామోదర్ లొంగిపోతాడనేది బూటకం

**సీతక్కను హెచ్చరిస్తూ తాము ఎలాంటి లేఖ విడుదల చేయలేదంటూ స్పష్టికరణ**

**నేటి సాక్షి - తెలంగాణ బ్యూరో రాధారపు నర్సయ్య :**జూన్ 1వ తేదీన తెలంగాణ రాష్ట్ర కమిటీ నేత 'బడే దామోదర్' లొంగిపోతున్నట్లు దిన పత్రికలలో, సోషల్ మీడియాలలో విస్తృతంగా జరిగిన ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని మావోయిస్టు అధికార ప్రతినిధి జగన్ పేరిట ఒక పత్రికా ప్రకటన విడుదలైంది మీడియా చేసిన ఈ ప్రకటనలలో ఎలాంటి వాస్తవం లేదని.. పోలీసులే కావాలని ఉద్దేశ పూర్వకంగా ఈ దుష్ప్రచారం చేస్తున్నారని జగన్ ఆరోపించారు. గతంలో కూడా దామోదర్ ఎన్ కౌంటర్ లలో చనిపోయినట్లు లేదా లొంగిపోతున్నట్లు అనేక సార్లు ప్రచారం చేశారన్నారు. విప్లవ ప్రజలను గందరగోళ పరచడానికి మానసిక యుద్ధంలో భాగంగానే ఈ దుష్ప్రచారం కొనసాగుతోందన్నారు.

**సీతక్కను తాము హెచ్చరించలేదు**

ఇటీవల మా పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ పేరుతో 26.06 2025న మంత్రి సీతక్కపై వచ్చిన పత్రిక ప్రకటనకు మా పార్టీకి ఎలాంటి సంబధం లేదని జగన్ ఆ ప్రకటనలో స్పష్టం చేశారు.అదే విధంగా కేంద్ర (బీజేపీ) ప్రభుత్వం మావోయిస్టు పార్టీపై కొనసాగిస్తున్న పాశవిక 'ఆపరేషన్ కగార్' ను తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం వ్యతిరేకిస్తున్నది. ఎన్ కౌంటర్ లు ఆపాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండు చేస్తున్నది. మావోయిస్టు పార్టీ సమస్య సామాజిక, రాజకీయ సమస్యని, అణిచివేతల ద్వారా మావోయిస్టు పార్టీని నిర్మూలించడం సరైనది కాదనీ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన సంగతి ప్రజలందరికీ తెలిసిందే. ఇది ఇలా ఉంటే తెలంగాణలో మావోయిస్టు పార్టీ కార్యకలాపాలు లేకపోయినప్పటికీ పోలీసులు. మాత్రం మావోయిస్టు పార్టీకి ప్రజలు ఎలాంటి



సహకారాన్ని అందించకూడని, సహకరించిన వారిపై కఠినంగా వ్యవహరిస్తామని, మావోయిస్టు పార్టీ వస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఆసిఫాబాద్ జిల్లాలలో అమాయక ఆదివాసి ప్రజలను పోలీస్ స్టేషన్ లకు పిలిచి బెదిరింపులకు గురి చేస్తున్నారు. ఇది తెలంగాణ ప్రజలు గమనించాలని తెలియజేస్తున్నామని.అధికార ప్రతినిధి జగన్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
తెలంగాణ రాష్ట్ర కమిటీ

పత్రికా ప్రకటన


[illegible]

జగన్



# మీరు చేసే చర్యలకు ప్రతి చర్య తప్పకుండా ఉంటుంది.!

- **నాన్న గారు లేరనో.. అన్నయ్య లేరనో దాడులు చేస్తారా..?**
- **తప్పుడు కేసులు పెట్టడం, దాడులు చేయడం దుర్మార్గం**
- **బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పిన చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి**



**నేటి సాక్షి తిరుపతి జిల్లా (బాదూరు బాల) :** చంద్రగిరి నియోజకవర్గం అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ఎంతో కృషి చేశాం.. మా పార్టీ కార్యకర్తలపై మీరు చేస్తున్న చర్యలకు ప్రతి చర్య తప్పకుండా ఉంటుందన్న విషయం గుర్తు పెట్టుకోండి.. ఈ రోజు నాన్న గారు లేరనో... అన్నయ్య లేరనో పార్టీ క్యాడర్‌పై భౌతిక దాడులు చేస్తారా..? అక్రమ కేసుల్లో నాన్నగారిని, అన్నయ్యను జైలుకు పంపినా.. మా క్యాడర్‌ను కాపాడు కోవడంలో ఎంత మాత్రం వెనుకంజ వేయబోం.. తప్పుడు కేసులు పెట్టడం, దాడులు చేయడం, గాయపడిన వారిపైనే కేసులు పెట్టించడం దుర్మార్గం.. ఇంతకన్నా నీచమైన పని మరొకటి ఉండదు.. దీనంతటికీ సమాధానం చెప్పే రోజు ఒకటి వస్తుంది.. అప్పటి వరకు మీరు ఎన్ని రకాలుగా ఇబ్బందులు పెట్టినా భరిస్తాం.. మేమే కాదు.. మా పార్టీ క్యాడర్ కూడా అలాగే భరిస్తుంది.. మాకంటూ ఒక రోజు వచ్చినపుడు మేము ఏమిటో కూడా చూపిస్తాం.." అంటూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి టీడీపీ గూండాలకు సున్నితంగా హెచ్చరించారు.చంద్రగిరి మండలంలో జరిగిన వరుస దాడుల్లో గాయపడిన వారిని చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి శనివారం పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా పనపాకం హరిజనవాడకు చెందిన అజయ్‌కుమార్ కుటుంబీకులపై టీడీపీ వర్గీయులు దాడి చేయడాన్ని తెలుసుకున్న ఆయన ఆ గ్రామంలో తిరిగి తమ పార్టీ కార్యకర్తల పట్ల అమానుషంగా ప్రవర్తించిన వారిని తక్షణం అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు ఏక పక్షంగా వ్యవహరిస్తే న్యాయస్థానాల్లో ప్రయివేటు కేసులు పెడతామని హెచ్చరించారు. దాడి చేసిన వారిని అరెస్టు చేయకుండా దాడిలో గాయపడిన వారిని పోలీస్ స్టేషన్‌కు రావాలని పోలీసులు పిలవడం చూస్తుంటే దొంగలను కాపడటానికే పోలీసు స్టేషన్లు వున్నట్టుందన్నారు. అజయ్‌కుమార్ కుటుంబీకులకు తాము అండగా నిలబడతామని, గ్రామంలో కూడా గొడవలు లేకుండా అన్ని రాజకీయ పార్టీల నేతలు కలసిపోవాలని, ఉత్సవాలు, జాతర్ల మాటున ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవడం ఎవ్వరికీ మంచిది కాదని హితవు పలికారు. అనంతరం ముంగిలిపుట్టు సర్పంచ్ భారతీ ఇంటికి చేరుకున్న హర్షిత్‌రెడ్డి ఆ గ్రామంలో జరిగిన గొడవ గురించి తెలుసుకున్నారు. సర్పంచ్ భారతిపై దాడి చేసే సమయంలో పక్కనే వున్న నడింపల్లి నుంచి టీడీపీ రౌడీలు ముంగిలిపుట్టుకు వచ్చి తమపై దాడులు చేశారని, ఆ సమయంలో ఎమ్మెల్యే పులివర్తి నాని గారు కూడా నడింపల్లిలోనే వుండి పింఛన్లు పంచుతున్నారన్నారు. గ్రామంలో వీధి లైట్లు వేయించడానికి వెళ్లిన ఒక మహిళా సర్పంచ్‌పై గ్రామంలో దాడి చేసి తన కుమారుని చేయి వరిచేస్తే పోలీసులు కేసు పెట్టడానికి కూడా ఆలోచిస్తున్నారన్నారు. ముంగిలిపుట్టు గ్రామంకు తాము తీసుకువెళ్లిన వాహనాలను పోలీసులు ఇప్పటి వరకు తెచ్చివ్వలేదని, మేమే వెళ్లి తీసుకుంటామని చెబితే వద్దని చెబుతున్న పోలీసులు తమ వాహనాలను ఎందుకు తెచ్చివ్వడం లేదో తెలియడం లేదని సర్పంచ్ భారతి భర్త దామోదర్‌నాయుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. తమపై దాడి చేసిన వారిని వదిలేసి మాపైనే కేసులు పెట్టడానికి పోలీసులు సిద్ధమవుతున్నారని, తాము పోలీస్ స్టేషన్‌కు వెళితే అవమానకర మాటలతో వేధిస్తున్నారని కన్నీరు పెట్టుకున్నారు. అయితే ఇదంతా చెవిరెడ్డి అందుబాటులో లేరని తెలుసుకునే చేస్తున్నారని, వీలైనంత త్వరగా ఈ సమస్యలకు పరిష్కారం వస్తుందని చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి బాధిత కుటుంబాల వారిని ఓదర్చారు. నాకు ఏం జరిగినా.. సుబ్రమణ్యం నాయుడిదే బాధ్యత.. నాకు.. నా కుటుంబానికి ఏం జరిగినా టీడీపీ నేత, సీడీసీఎం ఎస్ ఛైర్మన్ పల్లినేని సుబ్రమణ్యం నాయుడిదే బాధ్యత.. నాపై ఇప్పటికే హత్యాప్రయత్నాలు కూడా చేయిస్తున్నారు. నేను చావడానికి సిద్ధమే.. నా కుటుంబంపై దాడి చేస్తే సహించేది లేదు.. అందుకే నేను కూడా తెగించి తిరుగుతున్నా.. నాకు నచ్చిన పార్టీకి పనిచేయడం తప్పా.. వాళ్లు చంపినా నేను చెవిరెడ్డి కుటుంబానికి విధేయునిగానే చచ్చిపోతా.. అంటూ పనపాకం పంచాయతీకి చెందిన అజయ్ కుమార్ చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి ముందు కన్నీరు పెట్టుకున్నారు. రాజకీయంగా ఆయన ఎదగడానికి మా గ్రామంలో బంధువుల మధ్యనే చిచ్చులు పెట్టి చంపించే ప్రయత్నాలు చేస్తున్నారని, భవిష్యత్తులో నాకు ఏ ఇబ్బంది కలిగినా బాధ్యత ఆయనదే అవుతుందన్న విషయం రాత పూర్వకంగా మా కుటుంబీకులకు రాసిచ్చిపెట్టానని కూడా వివరించారు. అనంతరం చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి మాట్లాడుతూ అంతవరకు ఏమీ రాదు.. మీకు ఏం కాదు.. వాళ్లకు అవకాశం వచ్చింది దాడులు చేస్తున్నారు.. మనకు అవకాశం వచ్చేదాకా వేచి చూడాల్సిందే.. మీకు మేము అండా ఉంటామని భరోసా కల్పించారు. అనంతరం ఆ కుటుంబంకు తోడుగా నిలబడతామని హామీ ఇచ్చారు. అంతకు ముందు జిల్లా పార్టీ అధ్యక్షులు భూమన కరుణాకర్ రెడ్డితో కలసి నరశింగాపురం పంచాయతీ పార్టీ అధ్యక్షులు ప్రవీణ్ కుమార్ తల పగలగొట్టడంతో ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు.

# త్రిశక్తి ఆలయంలో 'వారాహి మాత'కు హెూమ యజ్ఞం

- ముగిసిన 'వారాహి నవరాత్రోత్సవాలు'
- లక్ష పుష్పార్చన..హెూమ యజ్ఞంతో వైభవంగా వేడుకలు



**నేటి సాక్షి - కోరుట్ల ( రాధారపు నర్సయ్య ) :**కోరుట్ల పట్టణంలో గణేశ నవదుర్గ మండలి ఆధ్వర్యంలో త్రిశక్తి మాత దేవాలయంలో వారాహి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిరహించారు.గత నవరాత్రులు లక్ష పుష్పార్చన..చివరి రోజున హెూమ యజ్ఞంతో నవరాత్రోత్సవాలు ముగిశాయని గజ్జల.శంకర్ తెలిపారు. ఇందులో భాగంగా వారాహి మాత కు శుక్రవారం రాత్రి అమ్మవారి సన్నిధిలో లక్ష్మీ గణపతి, చండీ, వారాహి రుద్ర హెూమం నిర్వహించారు. వారాహి నవరాత్రులు ఆషాఢ మాసంలో 9 రోజుల పాటు జరుపుకునే ఒక ముఖ్యమైన పండుగ అని ఈ సమయంలో వారాహి దేవిని పూజించడం ద్వారా భక్తులు శత్రువుల నుండి రక్షణ పొందుతారని, కోరిన కోరికలు నెరవేరుతాయని నమ్ముతారు. ఈ నవరాత్రులు జూన్ 26 నుండి జూలై 4 వరకు నవరాత్రులు నిర్వహించారు.శనివారం నాడు వారాహి మాత నిమజ్జనం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.గణేశ్ నవదుర్గ మండలి అధ్యక్షులు కటుకం గణేష్, ప్రధాన కార్యదర్శి గజ్జల శంకర్ మాట్లాడుతూ.. గత మూడు సంవత్సరాల నుండి వారాహిదేవి నవరాత్రులు జరుపుతున్నామని, ఈ సంవత్సరం నుండి ప్రత్యేకంగా అమ్మవారి విగ్రహం పెట్టి వారాహి పూజలు నిర్వహించామని వారు తెలిపారు. వారాహి మాత నవరాత్రులు జరుపుకోవడం కోరుట్ల పట్టణంలో ఇదే మొదటి మొదటిసారి అని ప్రతిరోజు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుంటున్నారని వారు పేర్కొన్నారు. దసరా నవరాత్రులకు, వారాహి నవరాత్రులకు తేడా ఉంటుందని వారాహి నవరాత్రులను 'గుప్త నవరాత్రులు' అంటారని, ఈ మాతకు రాత్రి వేళ పూజిస్తారని, వారాహి మాతకు రాత్రి వేళలో ధూపం, దీపం, నైవేద్యం అభిషేకం హెూమం ఉంటాయని, సూర్యాస్తమ సమయములో పూజ కార్యక్రమాలు జరుపుకుంటారని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో గణేశ్ నవదుర్గ మండలి గౌరవ అధ్యక్షులు కట్ట నారాయణ, అధ్యక్షులు కటుకం గణేష్, ప్రధాన కార్యదర్శి గజ్జల శంకర్, కోశాధికారి అడువాల ప్రభాకర్ కార్యవర్గ సభ్యులు గాజుల రమేష్, లక్కంపల్లి విజయ్, నవీన్ మండలి సభ్యులు సంకు అశోక్, కటుకం గంగారాం, చింతకింది సత్యనారాయణ, కార్తీక్, ప్రవీణ్, రాము, కళ్యాణ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# జగిత్యాలలో ముగిసిన వారాహీదేవి నవరాత్రి ఉత్సవాలు



**నేటి సాక్షి - జగిత్యాల ప్రతినిధి :** సకల చరాచర సృష్టిని పాలించే సృష్టి స్థితి లయకారిని శ్రీ చక్రవాసిని, శ్రీ లలితమాత సైన్యాధిపతి వారాహీ దేవి నవరాత్రి ఉత్సవాలు శనివారం తో ముగిశాయని పొలాస 108 శ్రీ చక్ర సహిత శ్రీ లలితామాత దేవాలయ ఫౌండరీ ట్రస్టీ చైర్మన్ చెల్లం స్వరూప సత్తయ్య తెలిపారు. జగిత్యాల రూరల్ మండలంలోని గత నెల26 న పొలాసలో కొలువై ఉన్న లలితమాత ఆలయంలో ప్రారంభమైన వారహీదేవి నవరాత్రి ఉత్సవాలు రోజుకో విధమైన అలంకారంలో వారహీదేవి దర్శనమియగా భక్తులు, సుహాసినిలు మూలమంత్రం పిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం కుంకుమ పూజలు, లలితామాత సహస్రనామా పారాయణం గావించారు. 9 రోజుల పాటు ఆలయంలో సాయంత్రం వేళలో వారాహీదేవిని అందంగా అలంకరించి అత్యంత భక్తి శ్రద్ధలతో కొలిచారు.వారాహిదేవిమాలధారణ చేసిన భక్తులు 9 రోజులు ఉదయం, సాయంత్రం పూజ కార్యక్రమాలు చేస్తూ ఏకభూక్తం పాటించి శనివారం విరమణ చేశారు. నవరాత్రుల్లో లలితామాత ఆలయం భక్తులతో కిటకిటలాడిందని, అమ్మవారి నామస్మరణతో మారుమ్రోగిందని చెల్లం స్వరూప తెలిపారు.నవరాత్రి ఉత్సవాల్లో పాంపట్టి రవీందర్, మార కైలాసం, మార రాజేశం, చెల్లం సత్తయ్య, జగిత్యాల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎన్నం కిషన్ రెడ్డి, ఉటూరి కళ్యాణి, అర్చన, గోపతి స్వప్న, బొడ్డు వనిత, పొన్నం లావణ్య, మహేందర్, లలితామాత సేవా ట్రస్ట్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# కండ్లపెల్లి ఎస్టీలకు ఇళ్ళు మంజూరు చేయాలి

- తండాకు రోడ్డు, బస్సు సౌకర్యం కల్పించాలి
- మంత్రి సీతక్కకు కాంగ్రెస్ నేత మహంకాళి రాజన్న విజ్ఞప్తి



**నేటి సాక్షి - జగిత్యాల ప్రతినిధి:** ఊరికి ఆమడ దూరంలో అడవిలో విసిరేసినట్టు ఉన్న ఎస్టీలకు ఇళ్ళు లేక నాన ఇబ్బందులు పడుతున్నారని వారికీ ఇళ్ళు మంజూరు చేయడమే కాకుండా ఆ తండాకు రోడ్డు, బస్సు సౌకర్యం కల్పించాలని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క కు మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకులు మహంకాళి రాజన్న విజ్ఞప్తి చేశారు.సానుకూలంగా స్పందించిన మంత్రి సీతక్క విచారించి అర్హులందరికి తక్షణమే ఇళ్ళు మంజూరు చేయాలనీ జగిత్యాల జిల్లా కలెక్టర్ ను అదేశించారాని రాజన్న శనివారం తెలిపారు.జగిత్యాల జిల్లా బీరుపూర్ మండలం కండ్లపెల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని గల నాయకపు తండాలో 62 ఎస్టీ కుటుంబాలున్నాయని వారు గుడిసెల్లో జీవనాన్ని సాగిస్తూ ఇళ్ళు లేక, రోడ్డు సౌకర్యం లేక ఎన్నో రకాల ఇబ్బందులు పడుతున్నారని మంత్రి సీతక్క దృష్టికి తీసుకువచ్చనని రాజన్న తెలిపారు.తండా వాసులు నిత్యావసర వస్తువులు, రేషన్ సరుకులు, జబ్బు పడితే మందులకోసం వేరే గ్రామానికి వెళ్లాలంటే చాలా కష్టపడుతున్నారని వాపోయారు.కిలోమీటర్ కు పైగా దూరం ఉన్నందున రోడ్డు నిర్మాణం చేపట్టాలని, అలాగే తండాకు బస్సు సౌకర్యం కల్పించాలని మంత్రికీ దృష్టికి మహంకాళి రాజన్న తీసుకెళ్లారు.ఎస్టీ కుటుంబాలు ఎదురకొంటున్న సమస్యలను విన్న మంత్రి సీతక్క ఇళ్ల నిర్మాణం చేపట్టి, రోడ్డు, బస్సు సౌకర్యం కల్పించేవిధంగా జిల్లా కలెక్టర్ పరిశీలించి చర్యలు తీసుకోవాలని అదేశించారాని రాజన్న తెలిపారు.

# ఖరీఫ్ సీజన్ కు దాన్యం కొనుగోలుకు సిద్ధం చేయండి

**జిల్లా రెవెన్యూ అధికారులు కలెక్టర్ జే.శ్రీనివాస్**



**నేటిసాక్షి, నల్లగొండ :** రానున్న ఖరీఫ్ సీజన్ లో దాన్యం కొనుగోలుకు కావలసిన సామగ్రి కై ముందు నుండే సిద్ధం కావాలని, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ అధికారులకు సూచించారు అయన తన చాంబర్లో ఖరీఫ్–2025 సీజన్ కు ఆయా వ్యవసాయ మార్కెట్ యార్డులు,.ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ప్రస్తుతం ఉన్న సౌకర్యాలు, కల్పించాల్సిన సౌకర్యాలపై సంబంధిత అధికారులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో 10 వ్యవసాయ మార్కెట్ యార్డులు ఉండగా, ఇటీవల జిల్లా యంత్రాంగం రెండు వ్యవసాయ మార్కెట్ యార్డులకు మొబైల్ గ్రైన్ డ్రయ్యర్లు కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. అలాంటి మొబైల్ గ్రైన్ డ్రయ్యర్లను అన్ని వ్యవసాయ మార్కెట్ యార్డ్ ల లో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలని సమావేశంలో నిర్ణయించారు. రబీలో 2000 మెట్రిక్ టన్నులకు మించి ధాన్యం వచ్చిన 110 ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఆటోమేటిక్ ప్యాడి క్లీనర్ లను ఏర్పాటు చేసే విషయం, తూకం, తేమ కొలిచే యంత్రాలకు మరమ్మతు చేయించి సిద్ధంగా ఉంచుకోవడం, అలాగే ఆయా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు మరిన్ని టార్పాలిన్లను ఇచ్చే విషయం సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకురాలు ఛాయాదేవి, పౌరసరఫరాల జిల్లా అధికారి వెంకటేశం, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ హరీష్, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి, డిసీఓ పత్యా నాయక్, తదితరులు హాజరయ్యారు.

# మత్తు మందు చల్లి నగలు దోచుకెళ్లాడు

**రాయికల్ కేశవ నగర్లో ఘటన**

**నేటిసాక్షి, రాయికల్ :** గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లో చొరబడి వృద్ధురాలిపై మత్తు మందు చల్లి 5తులాల బంగారం దోచుకెళ్లిన ఘటన రాయికల్ పట్టణంలోని కేశవనగర్లో శనివారం జరిగింది. స్థానికులు, బాధిత కుటుంబీకుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కేశవనగర్కు చెందిన రాధమ్మ అనే వృద్ధురాలు ఇంట్లో ఉండగా కుటుంబసభ్యులు తోట పనికి వెళ్లారు. ఎవరో గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లోకి వెళ్లి రాధమ్మ పై మత్తు మంది చల్లి ఆమె ఒంటిపై ఉన్న బంగారం కడియం, గొలుసు ఎత్తుకెళ్లినట్లు బాధితురాలు ఎస్ఐ సుధీర్రావుకు తెలిపారు. బాధిత కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా విచారణ జరుపుతున్నట్లు ఎస్ఐ వివరించారు. కాగ రాయికల్ పట్టణంలో గత పక్షం రోజుల నుండి నాలుగు చోట్ల చోరీలు జరుగడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కాగ రాయికల్ మండలం మైతాపూర్ గ్రామంలో ఇరువురు రైతుల వ్యవసాయ మోటర్లను గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లినట్లు రైతులు పోలీసులకు ఫిర్యాదు చేసారు. పోలీసులు తక్షణ చర్యలు తీసుకొని దొంగతనాల ఆట కట్టించాలని ప్రజలు కోరుతున్నారు.

# అర్హులందరిని ఓటర్లుగా నమోదు చేయాలి

**జగిత్యాల ఆర్డీఓ మధుసూధన్**



**నేటిసాక్షి, రాయికల్ :** గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరిని ఓటర్గా నమోదు చేయాలని జగిత్యాల ఆర్డీఓ పులి మధుసూధన్ బూత్ లెవల్ అధికారులకు సూచించారు. రాయికల్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం బూత్ లెవల్ అధికారులకు ఓక రోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మృతి చెందిన వారి వివరాలు సేకరించి ఓటర్ జాబితాలో నుండి వారి పేర్లను తొలగించాలన్నారు. ఓటర్ లిస్టును క్షుణ్ణంగా పరిశీలించి తప్పులుంటే సవరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగర్జున, ఎంపిడిఓ బింగి చిరంజీవి, బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నారు.

# పాఠశాలల ఆకస్మిత తనిఖీలు



**నేటి సాక్షి, నారాయణపేట, జులై 5 :** నారాయణపేట జిల్లాలోని మక్తల్ లోని బీసీ కాలనీ, మరియు జగ్జీవన్గర్ లో కొత్త పాఠశాలల ఏర్పాటు, సంబంధిత విషయాలపై ఇవాళ మధ్యాహ్నం, గౌరవ జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులు గారిని కలిసి,అక్కడి పరిస్థితిని వివరించిన డీటీఫ్ జిల్లా అధ్యక్షురాలు హైమావతి, ప్రధాన కార్యదర్శి సూర్యచంద్ర.పై విషయంతో పాటుగానే జడ్.పి.హెచ్.ఎస్ మంతన్ గోడ్ పాఠశాలలోని, ఫిజికల్ సైన్స్ టీచర్ కొరతను,లి మరియు మక్తల్ మండల సమీపాన ఉన్న లిఖానాపూర్ యుపిఎస్ పాఠశాలలోని టీచర్ల కొరతను వివరించి,సమస్యల పరిష్కారానికి విన్నవించాము. ముఖ్యంగా, బీసీ కాలనీలో కొత్త పాఠశాల ఏర్పాటుకు సంబంధించి, మేము రాత్రి పెట్టిన మెసేజ్ కు పొద్దుగాల 7 గంటలకె మాకు ఫోన్ చేసి, పాఠశాల ఏర్పాటుపై,అక్కడి పరిస్థితిపై ప్రత్యేక శ్రద్ధను కనపరిచి,చర్యలకు ఉపక్రమించి,తగు హామీని ఇచ్చిన లిగౌరవ రాష్ట్ర మంత్రివర్యులు వాకిటి శ్రీహరి గారికి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.

# ఇసుక ట్రాక్టర్ పట్టివేత



**నేటి సాక్షి మిర్యాలగూడ రూరల్ జూలై 5 :** అనుమతి లేకుండా నిబంధనలకు విరుద్ధంగా ఇసుక ట్రాక్టర్లు నడిపినట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎన్నిసార్లు చెప్పినా కొంతమంది అలాగే ఇసుక తరలిస్తూ ఉన్నారని వారిపై కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని మిర్యాలగూడ గ్రామీణ ఎస్సై లక్ష్మయ్య అన్నారు. శుక్రవారం రాత్రి పొద్దు పోయాక తక్కెళ్లపాడు గ్రామ శివారులోని మూసి నుండి అక్రమముగా ఇసుకను తరలిస్తున్నారు అనే సమాచారం మేరకు యాదగిరిపల్లి గ్రామ శివారులో పెట్రోలింగ్ సిబ్బంది వెళ్లగా ఏపీ 24, 7142 నెంబరు గల ట్రాక్టరు ఇసుక నింపుకొని వస్తూ పోలీస్ వారిని చూసి ట్రాక్టర్ డ్రైవర్ ట్రాక్టర్ ను వదిలి పారిపోయినాడని ట్రాక్టర్ను పోలీస్ స్టేషన్ కు తరలించి కాల్వపల్లి తండాకు చెందిన ట్రాక్టర్ డ్రైవరు ధీరావత్ కృష్ణ, యాజమాని ధీరావత్ లక్ష్మీపతి ల పైన కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్ఐ లక్ష్మయ్య తెలిపారు

# విపత్తుల నిర్వహణకు ఎప్పుడు సిద్ధంగా ఉండాలి


## జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**నేటిసాక్షి, నల్లగొండ :** విపత్తుల నిర్వహణకు జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ సంసిద్ధంగా ఉంటుందని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి జాతీయ విపత్తుల నిర్వహణ అథారిటీ అధికారులకు తెలిపారు. శనివారం జాతీయ విపత్తుల నిర్వహణ అథారిటీ అధికారుల బృందం జాయింట్ అడ్వైజర్ నావెల్ ప్రకాష్, అండర్ సెక్రెటరీ అభిషేక్ బీస్వాల్, వసీం ఇక్బాల్ బృందం రాష్ట్ర విపత్తుల నిర్వహణ అధికారి గౌతమ్ ఆధ్వర్యంలో ఒక్క రోజు నల్లగొండ జిల్లా పర్యటనలో భాగంగా శనివారం జిల్లా కలెక్టర్ ను జిల్లా కలెక్టర్ చాంబర్ లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి జాతీయస్థాయిలో విపత్తుల నిర్వహణ అథారిటీ ఉన్నట్లుగానే జిల్లా స్థాయిలో జిల్లా విపత్తుల నిర్వహణ అథారిటీని ఏర్పాటు చేశామని, అన్ని శాఖల అధికారులను భాగస్వామ్యం చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. వివిధ సందర్భాలలో వచ్చే విపత్తులను ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగాన్ని సంసిద్ధం చేయడం జరిగిందని, ప్రత్యేకించి వడదెబ్బ, వరదలు, తుఫానులు, ప్రమాదాలు, తదితర సమయాల లో తీసుకోవాల్సిన చర్యలపై ఇదివరకే సమావేశాలు నిర్వహించినట్లు ఆమె వెల్లడించారు. జిల్లాలో తుఫాను, వరదలు, తదితర ప్రకృతి వైపరీత్యాల పరిధిలో లేనప్పటికీ ఒకవేళ విపత్తులు సంభవిస్తే ఆయా సమయాల్లో ఎలా స్పందించాలో ప్రణాళిక ఉన్నట్లు చెప్పారు. అనంతరం జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ పవర్ మాట్లాడుతూ, పోలీస్ తరఫున జిల్లాలో 12వ పోలీస్ బెటాలియన్ ఉందని, ఒక కంపెనీ దళాలు (సుమారు 80 నుండి 100 మంది)కి విపత్తు నిర్వహణపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ విపత్తుల నిర్వహణ అథారిటీ జాయింట్ అడ్వైజర్ నావెల్ ప్రకాష్ మాట్లాడుతూ, జాతీయ విపత్తుల నిర్వహణ అథారిటీ కింద 2021లో ఆపదమిత్ర వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేయడం జరిగిందని, అన్ని జిల్లాలలో ఆపదమిత్రలను ఏర్పాటు చేస్తున్నామని, అంతేకాక విపత్తుల సమయంలో అవసరమైన రిసోర్సెస్ ఏర్పాటు చేస్తున్నామని, ఆపద మిత్రుల శిక్షణ, విపత్తుల్లో వారు తీసుకోబోయే చర్యలపై అవసరమైన సహాయం అందజేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, ఆర్ డిఓ వై.అశోక్ రెడ్డి, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

# ప్రజా సంక్షేమమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యం

## మణికొండ మున్సిపల్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**నేటి సాక్షి (ఎడ్ల శివ కుమార్ ) రాజేంద్రనగర్,:** ప్రజా సంక్షేమమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యం అని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు.రాజేంద్రనగర్ నియోజకవర్గం మణికొండ మున్సిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేశారు. శివ నగర్ కమ్యూనిటీ హాల్ వార్డు నెం.18 లో 42.00 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన శివ నగర్ కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవం చేశారు.ఆల్కాపూర్ లోని పార్క్ 1 వార్డు నెం. 9 లో 100.00 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించిన పార్క్-1 ని సందర్శించారు.స్పెక్ట్రమ్ విల్లాస్ వద్ద బాక్స్ కల్వర్ట్ వార్డు నెం 7 లో 75.00 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించిన బాక్స్ కల్వర్ట్ ప్రారంభోత్సవం చేశారు.వెంకటేశ్వర కాలనీలో సీసీ రోడ్డు వార్డు నెం. 4 లో 50.00 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు ఉదయం శంకుస్థాపన చేశారు.అలిజాపూర్ రోడ్డులో సెంట్రల్ మీడియన్ వార్డు నెం 6 లో 50.00 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించనున్న సెంట్రల్ మీడియన్‌కు శంకుస్థాపన తిరుమల హిల్స్ పార్క్ వార్డు నెం. 17 లో 60.00 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించిన తిరుమల హిల్స్ పార్క్ ప్రారంభోత్సవం చేశారు.శివాజీ నగర్ కమ్యూనిటీ హాల్ వార్డు నెం. 14 లో 125.00 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించిన శివాజీ నగర్ కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవం చేశారు. హెచ్ఎండబ్ల్యూఎస్,ఎస్ బి కార్యాలయం సమీపంలో కమ్యూనిటీ హాల్ వార్డు నెం. 13 లో 275.00 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించిన కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవం చేశారు.మొత్తం 777.00 లక్షల రూపాయల విలువైన ఈ అభివృద్ధి పనులతో మణికొండ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమాలకు, స్థానిక నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దొంగతనాలను అడ్డుకునేందుకు సీసీ కెమెరాలు ఎంతో కీలకం




**నేటి సాక్షి, బెజ్జంకి:** ఈ ఆధునిక కాలంలో దొంగలు గ్రామాల్లో ముందుగానే రిక్కీ నిర్వహించి, ఒంటరిగా ఉన్న ఇళ్లను టార్గెట్ చేయడం వల్ల గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలని, రాత్రి వేళల్లో జరిగే దొంగతనాలను అడ్డుకునేందుకు సీసీ కెమెరాలు ఎంతో కీలకమని బెజ్జంకి ఏఎస్ఐ శంకర్ రావు స్పష్టం చేశారు. గ్రామ పంచాయతీలో ఏర్పాటుచేసిన కంట్రోల్ సిస్టమును ఎస్ఐ తిరుపతిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వీరాపూర్ గ్రామంలో అన్ని వర్గాల ప్రజలతో మమేకమై నిర్వహించిన సమావేశంలో దొంగతనాలు, అసాంఘిక కార్యక్రమాలపై నిఘా పెరుగుతుందని, వాస్తవాలను గ్రామస్తులకు వివరించారు. గ్రామాలలో ఎలాంటి అనుమానాస్పద కార్యకలాపాలు చోటుచేసుకున్నా సీసీ కెమెరాలు ఉండటం వలన వ్యక్తులను గుర్తించవచ్చుని, గ్రామ భద్రతపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందని వివరించారు. సామూహిక భద్రత కోసం గ్రామస్తుల సహకారంతో వీరాపూర్ గ్రామంలో మొత్తం 8 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. అలాగే నేను సైతం కార్యక్రమంలో భాగంగా 3 కిరాణా దుకాణాల్లో 6 కెమెరాలు నెలకొల్పారు. గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన కంట్రోల్ సిస్టమ్ ద్వారా నిత్యమూ కెమెరాల ఫుటేజ్‌ను పరిశీలిం చవచ్చున్నారు. ఈ కార్యక్రమానికి గ్రామ సెక్రటరీ, గ్రామస్తుల సహకారంతో బృహత్తర ప్రణాళికగా చేపట్టారు. గ్రామ భద్రతకు ఈ చర్య ఒక మైలురాయిగా నిలుస్తుందని ఎస్ఐ గారు తెలిపారు. అలాగే, సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన గ్రామస్తులందరికీ ఆయన హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

# మద్యం మత్తులో డ్రైవింగ్ చేస్తే చట్టపరమైన చర్యలు

## ఎస్ఐ బి. తిరుపతి రెడ్డి



**నేటి సాక్షి, బెజ్జంకి:** బెజ్జంకి మండలంలోని వీరాపూర్ గ్రామంలో గ్రామ కమిటీ ఆధ్వర్యంలో పోలీసులు నిర్వహించిన అవగాహన సమావేశంలో సైబర్ మోసాలు, గంజాయి, రోడ్డు భద్రత, ఇతర సామాజిక అంశాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. బెజ్జంకి ఎస్ఐ తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు గ్రామస్తులకు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై తిరుపతి రెడ్డి మాట్లాడుతూ సైబర్ మోసాలు, ఆధునిక టెక్నాలజీ వాడకం పెరిగిన ఈ కాలంలో ఫేక్ మెసేజ్‌లు, ఓటిపి స్కామ్స్, డబ్బులు ఎర చూపే లింకులు వంటి వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని, నమ్మి మోసపోవద్దని హితవు పలికారు. భూ సమస్యలు, మనస్పర్ధలు, చిన్న విషయాలపై గొడవలు పెట్టుకోకుండా లీగల్ మార్గంలో పరిష్కారాలు వెతుక్కోవాలని గ్రామస్థులకు సూచించారు. మద్యం సేవించి బైక్ నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయని, హెల్మెట్ లేకుండా బైక్ నడపరాదని, మద్యం మత్తులో డ్రైవింగ్ చేసినవారికి చట్టపరమైన చర్యలు తప్పవని పేర్కొన్నారు. ఈ మధ్య యువతలో గంజాయి వాడకం పెరుగుతోందని, తల్లిదండ్రులు తమ పిల్లలపై నిఘా ఉంచాల్సిన అవసరం ఉందని, గంజాయి అమ్మకం లేదా సేవించినవారిపై తీవ్ర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.గ్రామ శాంతి భద్రతలకై అందరూ భాగస్వామ్యంగా ఉండాలని పోలీసులు పేర్కొన్నారు.

# విద్యార్థినికి ఉపాధ్యాయుడి ఆర్థిక సాయం



**నేటి సాక్షి, బెజ్జంకి:** బెజ్జంకిలోని తెలంగాణ మోడల్ స్కూల్ హిందీ ఉపాధ్యాయులు డాక్టర్ బిగుల్ల బాబు ఓ ఉదాత్తమైన ఉదాహరణగా నిలిచారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో 414 మార్కులు సాధించి మండల స్థాయిలో మొదటి ర్యాంకు సాధించిన తల్లిదండ్రులు లేని విద్యార్థిని కర్ర భూమికకు రూ. 6500/- ఆర్థిక సాయం అందించారు తిమ్మాపూర్ మండలంలోని రేణికుంట గ్రామానికి చెందిన భూమిక చిన్నతనంలో తల్లిదండ్రులను కోల్పోయి తన నాయనమ్మ మధరవ్వ సంరక్షణలో, బెజ్జంకి మోడల్ స్కూల్ వసతి గృహంలో ఉంటూ చదువుతోంది. అద్భుతమైన ప్రతిభను చూపిన ఆమెకు ప్రోత్సాహం ఇవ్వాలనే లక్ష్యంతో ఈ సహాయాన్ని అందించినట్లు క్లాస్ టీచర్ కవిత సమక్షంలో డా. బాబు తెలిపారు. గత ఐదేళ్లుగా తల్లిదండ్రుల బాగోగులు లేని విద్యార్థులకు సహాయం చేస్తూ వస్తున్నట్లు డా. బాబు వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సంగీత మాలోత్, ఉపాధ్యాయులు ఖలీదా షిరీన్, జె. శ్రీనివాస్, రమేష్, కె. శ్రీనివాస్, బాలరాజు, ఎన్. శ్రీనివాస్, రామాంచ సంజీవ్, శారద, లక్ష్మీ తదితరులు డా. బాబును అభినందించారు.

# పద్మశాలి సంఘానికి నూతన కార్యవర్గం ఎన్నిక



**నేటి సాక్షి, బెజ్జంకి:** బెజ్జంకి మండలంలోని గుగ్గిళ్ల గ్రామంలో శనివారం శివ భక్త మార్కండేయ పద్మశాలి కుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.ఈ సమావేశంలో సుంకరపెల్లి లక్ష్మణ్ అధ్యక్షుడిగా, తుమ్మ శ్రీనివాస్ ఉపాధ్యక్షుడిగా, వొడ్నాల రాజేశం కోశాధికారిగా, నాగుల కనకయ్య ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ తమ నియామకానికి సహకరించిన సంఘ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కుల సంఘ అభివృద్ధికి మరియు సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సంఘ సభ్యులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

# తోటల పెంపకంలో రైతులకు అవగాహన అవసరం

## సస్యరక్షణ అధికారి వీరయ్య చౌదరి



**నేటి సాక్షి తిరుపతి జిల్లా (బాదూరు బాల) రామచంద్రాపురం :** ఉద్యానవన తోటల పెంపకం పై రైతులకు అవసరమని కేంద్రీయ సస్య రక్షణ అధికారి వీరయ్య చౌదరి పేర్కొన్నారు శనివారం మండలంలోని రామచంద్రాపురం, గంగిరెడ్డిపల్లి, కమ్మ కండ్రిగ, నడవలూరు గ్రామాల్లో రైతులతో ఆయన ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ ఇటీవల కొంతమంది రైతులు పంటల్లో వలన తీవ్రంగా నష్టపోయారని మాకు ఫిర్యాదు అందాయని ఆ ఫిర్యాదుల మేరకు మీ మీ గ్రామాల్లోని పంటల తోటలను మీ సమక్షంలో క్షుణ్ణంగా పరిశీలించడం జరిగిందని అన్నారు మీరు పంటలు నష్టపోకుండా ఉద్యానవన శాఖ అధికారులు సూచించిన సలహాలు సూచనలను ద్వారా మామిడికాయల నాణ్యతను పెంపొందించుకోవాలని సూచించారు పండ్ల ఈగల నివారణకు చిట్కాలు బుట్టలు కట్టడం, కవర్లు చుట్టడం ద్వారానే సాధ్యం అవుతుందని తెలిపారు కోతల అనంతరం సమగ్ర యాజమాన్యం పాటించాలన్నారు ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారి శివకుమారి,వి యం పూజిత లు పాల్గొన్నారు

నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాల వార్తలుగా..
ఆదివారం
6 జూలై 2025


# నిరుపయోగంగా బెజ్జంకి సమీకృత మార్కెట్



**నేటి సాక్షి, బెజ్జంకి :** బెజ్జంకి మండల కేంద్రంలో నిర్మించిన సమీకృత మార్కెట్ ప్రజలకు ప్రయోజనం లేకుండా నిరుపయోగంగా మారడం పట్ల అఖిల భారత యువజన సమాఖ్య మండల కమిటీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ బెజ్జంకి మండల కార్యదర్శి దొంతర వేణి మహేష్ మాట్లాడుతూ, లక్షలాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన సమీకృత మార్కెట్ ఖాళీగా ఉ ండటం దారుణమన్నారు. ప్రతి సోమవారం జరిగే వారసంతను రోడ్డుపై నిర్వహించడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని, ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు. బస్టాండ్ ఆవరణలో మాంసం దుకాణాలు, డ్రైనేజీలపై విక్రయాలు, వ్యర్థాలను ఇష్టానుసారంగా వేయడం వలన దారుణమైన పరిస్థితులు ఏర్పడుతున్నాయని అన్నారు. మార్కెట్ వాడకంలో పాలకుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ద్వారా మాంసాహార దుకాణాలపై తనిఖీలు జరపాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శి తక్షణమే స్పందించి మార్కెట్ వాడకాన్ని అమలు చేయాలని, లేకపోతే ఏఐవైఎఫ్ ఆధ్వర్యం లో కలెక్టర్ కు ఫిర్యాదు చేసి అవసరమైతే నిరసనలు చేపడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మాజీ జిల్లా అధ్యక్షుడు బోనగిరి శ్రావణ్, నాయకులు రోడ్డ చరణ్, దార్ల శ్రీనివాస్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# జగ్జీవన్ రావు ఆశయ సాధనకు కృషి చేయాలి

## ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**నేటి సాక్షి మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి :** దేశ సామాజిక న్యాయం సాధనకు గొప్ప కృషి చేసినడాక్టర్ బాబు జగ్జీవన్ రావు ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం హబ్సి గూడ చౌరస్తా లో డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన బాబు జగ్జీవన్ రావు విగ్రహా ఆవిష్కరణలో పద్మశ్రీ అవార్డు గ్రహీత ఏం ఆర్ పి ఎస్ అధినేత మంద కృష్ణ మాదిగ తో కలిసి పాల్గొనడం జరిగింది. ఈ సందర్భగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ అట్టడుగు వర్గాల అభ్యున్నతి, అణగారిన ప్రజల సమాన హక్కుల కోసం బాబు జగ్జీవన్ రామ్ చేసిన పోరాటం మర్చిపోలేనిది. స్వాతంత్ర్య సమరయోధుడిగా, ఉపప్రధానిగా దేశసేవకు అంకితమైన ఆయన జీవితం స్ఫూర్తిదాయకం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏం ఆర్ ఓ గౌతమ్ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మి నారాయణ, మాజీ కౌన్సిలర్లు యాదగిరి, కైలాష్ పతి గౌడ్ సీనియర్ నాయకులు డాక్టర్ చారి , సోమి రెడ్డి , మనోహర్ నవీన్ దినేష్, నరేంద్ర రాజు బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగుల హక్కుల పరిరక్షణ చట్టంపై అవగాహన



**నేటి సాక్షి, కొడిమ్యాల జులై 05 శనివారం :** జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని అనేకమంది దివ్యాంగులు ఉ న్నప్పటికీని వారి యొక్క హక్కులను పొందు కోలేకపోతున్నారు. పిడబ్ల్యుడి ఆక్ట్ 2016 ప్రకారం దివ్యాంగుల శ్రేయస్సుకై అభివృద్ధికై ప్రభుత్వం అందిస్తున్న దివ్యాంగుల పథకాల విషయంలో చట్టాల విషయంలో అవగాహన లేనందున ముఖ్యంగా గ్రామాల్లోని దివ్యాంగులు దయనీయ జీవనాన్ని కొనసాగించవలసిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి దీనిపైన మహిళా స్వశక్తి సంఘాలు స్వచ్ఛంద సంస్థలు, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు మానవతా దృక్పథంతో సమన్వయంతో ఆలోచించి సదస్సులు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలి. అంతే కాకుండా ఆయా గ్రామాల్లో మండలాల్లో దివ్యాంగుల కొరకై స్వశక్తి గ్రూపులను ఏర్పాటు చేసి నిర్వహణ కొనసాగించాలి దివ్యాంగులు కేవలం ప్రభుత్వము అందించే పెన్షన్ మాత్రమే ఉపయోగించుకుంటూ వారి హక్కులను గురించి పథకాలను గురించి ఆలోచించలేక పోతున్నారు, అంతేకాకుండా పట్టణాల్లో ఉన్న ఆలోచన పరులైన దివ్యాంగులు మాత్రమే వివిధ పథకాల్లో లబ్ధిని పొందుకుంటున్నారు గ్రామాల్లోని దివ్యాంగులకు పథకాల గురించి అవగాహన లేనందున వినియోగించు కోలేక పోతున్నారు కావున ప్రభుత్వం ఆయా గ్రామస్థాయి మొదలుకొని రాష్ట్రస్థాయి వరకు దివ్యాంగుల హక్కుల పైన చట్టాల పైన పథకాల పైన అవగాహన సదస్సులను ఏర్పాటు చేసి వారి యొక్క విన్నపాలను సలహాలను సూచనలను ఆలోచించి అమలు పరచడమే కాకుండా బ్యాంకుల ద్వారా రుణాలు అందించే విధంగా ప్రోత్సహించి దివ్యాంగుల అభ్యున్నతికై కృషి చేయాలి కేవలం డిసెంబర్ 23న ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం జరిపి కార్యక్రమాన్ని చేపట్టి చేతులు దులుపుకోవడం కాకుండా ప్రతినెల గ్రామాల్లో ప్రత్యేకంగా సదస్సులను ఏర్పాటు చేసి అవగాహనలు కల్పించాలి దివ్యాంగుల చట్టాలు పథకాలు పట్టణాలకే పరిమితం కాకుండా గ్రామాల దివ్యాంగులకు అమలయ్యేలా చూడాలని సామూహిక కార్యకర్త. ఎలకుర్తి కిరణ్, తెలిపారు.

# సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



## ప్రాథమిక హక్కుల రక్షణ కై జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

**నేటి సాక్షి ప్రతినిధి గద్వాల్ : ( రమేష్ ) :** భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కుల రక్షణ కై జరిగే జూలై 9 దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పేర్ నరసింహ కార్మిక వర్గానికి ప్రజలకు పిలుపునిచ్చారు. సమ్మె ను జయప్రదం చేయాలని శనివారం జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్,గంజిపేట, చింతలపేట, గోదాం హమాలీలు, వ్యవసాయ మార్కెట్ హమాలీలతో కరపత్రాన్ని విడుదల చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులకు నేడు ముప్పు ఏర్పడిందని అన్నారు. కార్పొరేట్ల ప్రయోజనాల కోసం నాలుగు లేబర్ కోడ్ లను అమలులోకి తెచ్చారని, 8 గంటల పనిని రద్దు చేసి 12 గంటల పనిని చట్టబద్ధం చేస్తున్నారని విమర్శించారు. సామాజిక భద్రత పథకాలకు నిధులు తగ్గిస్తూ, చివరికి కార్మిక సంఘాలను సైతం రద్దు చేసేందుకు కూడా బరితెగించిందని విమర్శించారు. యాజమాన్యాలతో బేరసారాలు ఆడే అనే హక్కును తొలగించి భారత్ న్యాయ సంహిత చట్టం ద్వారా నాన్ బేయిలబుల్ కేసులుగా మార్చడం, పని స్థలాల వద్ద గేటు మీటింగ్లో కరపత్రాలు పంపిణీ వంటి వాటిని సైతం నిషేధించడం ద్వారా రాజ్యాంగం కల్పించిన హక్కులన్నిటిని తుంగలోకి తొక్కుతున్నారని విమర్శించారు. చట్టాలు అమలు చేయని యాజమాన్యాలకు శిక్షలు తగ్గించడం కార్మిక శాఖను పూర్తిగా ఫెసిలిటెట్ విభాగంగా మార్చడం స్కీం వర్కర్లను కార్మికులకు గుర్తించకుండా వెట్టి చేసే విధంగా లేబర్ కోడ్ లను రూపొందించాలని విమర్శించారు. కార్మికులకు సమ్మె చేయలేని పరిస్థితులను కల్పించి నాలుగు లేబర్ కోడ్ ల ద్వారా కార్మికులను తిరిగి బానిసత్వంలోకి నెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. కార్మిక చట్టాలను రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి ప్రజలు కార్మికులు సిద్ధంగా ఉండాలని, జూలై 9న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులు ప్రజల అధిక సంఖ్యలో పాల్గొని తమ నిరసనను తెలియజేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో భవన నిర్మాణ కార్మిక సంఘం పట్టణ అధ్యక్షులు రామకృష్ణ సివిల్ సప్లై యూనియన్ జిల్లా ఉ పాధ్యక్షులు శివ హమాలీ సంఘం అధ్యక్షులు రంగన్న, కార్మికులు రాముడు రాజు గోపాల్ శ్రీహరి రామకృష్ణ కళ్యాణ్ రామాంజనేయులు సింగోటం చిన్నా నరేష్ హనుమన్న తదితరులు పాల్గొన్నారు. ధన్యవాదాలతో ఉ ప్పేర్ నరసింహ జిల్లా ఉపాధ్యక్షులు జోగులాంబ గద్వాల జిల్లా

# గోరింటాకు సంబరాలు



**నేటి సాక్షి, కోరుట్ల టౌన్ (గణేష్ గొల్లపల్లి) :** ఆషాడ మాసం సందర్భంగా పురస్కరించుకొని శనివారం PRBM జూనియర్ కళాశాలలో యాజమాన్యం గోరింటాకు సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినిలు అందరూ గోరింటాకును సేకరించి, నూరి, తమ చేతులకు అందంగా అలంకరించుకొని, సంబరాలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. కళాశాల కరస్పాండెంట్ పోతని ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ప్రకృతి సిద్ధంగా లభించే గోరింటాకు ఈ మాసంలో వాడితే శరీరంలో వేడిని తొలగించి, కొన్ని రకాల అనారోగ్య సమస్యలను కూడా ఔషధరూపంగా పనిచేస్తుందని, గోరింటాకు సంతోషానికి, అభివృద్ధికి ప్రతీక పని తెలియజేశారు. విద్యార్థులు ఆనంద ఉత్సవాల మధ్య సంబరాలు జరుపుకున్నారని తెలిపారు.

# ఈర్ష, అసూయ, అహం, ద్వేషాలను త్యజించాలి

## బ్రహ్మశ్రీ గర్రెపల్లి మహేశ్వరిశర్మ




**నేటి సాక్షి, కోరుట్ల టౌన్ (గణేష్ గొల్లపల్లి) :** మనిషి తనలోని ఈర్ష, అసూయ, అహం, ద్వేషాలను విడిచిపెడితే పరిపూర్ణ ఆనందం లభిస్తుందని శృంగేరి శారదాపీఠ ఆస్థాన పౌరాణికులు బ్రహ్మశ్రీ డాక్టర్ గర్రెపల్లి మహేశ్వరశర్మ పేర్కొన్నారు. సనాతన ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో కోరుట్ల వాసవి కళ్యాణ భవనంలో 'శ్రీ నారద మహా పురాణ సప్తాహం' 2వ రోజు శనివారం వైభవంగా జరిగింది. సమితి అధ్యక్షులు మంచాల జగన్, కోశాధికారి రేగుంట రాజారాం దంపతులు గురువందన కార్యక్రమం నిర్వహించారు. ప్రవచనంలో భాగంగా వ్యాసుల వారు రచించిన అష్టాదశ మహా పురాణాలు మన దైనందిన జీవన విధానానికి మార్గదర్శకాలని మహేశ్వరశర్మ అన్నారు. ఈర్ష, అసూయ, అహంకారం, ద్వేషం అనే గుణాలు కలిగి ఉన్నవారు శత్రువులను పెంచుకుంటారని నారద పురాణంలో చెప్పబడిందన్నారు. ఈ గుణాలు కలిగిన వ్యక్తులు బంధు, మిత్రులకే కాకుండా చివరికి భార్య, బిడ్డలకు కూడా శత్రువుగా మారుతారని పేర్కొన్నారు. ఈ గుణాలను అదుపు చేసుకొని, జయించిన వ్యక్తి అందరి చేత ప్రేమించబడి గౌరవప్రదంగా జీవిస్తాడని వేదవ్యాస భగవానులు చక్కగా వివరించారని డాక్టర్ గర్రెపల్లి మహేశ్వరశర్మ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సమితి ప్రధాన కార్యదర్శి బట్టు హరికృష్ణ, నిర్వహణ కమిటీ చైర్మన్ పడిగెల శ్రీనివాస్, కన్వీనర్ మోటూరి రాజు, నిర్వాహకులు శక్కరి వెంకటేశ్వర్, భోగ శ్రీధర్, మేడి లక్ష్మీకాంతం, ఎలిమి శంకర్, కంటాల రవీందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

## గువ్వలదిన్నె జంబయ్య మాదిగ-ఎమ్మార్పీఎస్ కే టి దొడ్డి మండల ఇంచార్జీ



**నేటి సాక్షి ప్రతినిధి గద్వాల్ : ( రమేష్ ) :** వివరణ :– ఈ దేశ కుల వ్యవస్థలో అణగారిపోయిన కులాలన్ని ఏ కులానికి ఆ కులం సామాజిక చైతన్యమై అంతిమంగా మహాజన సమూహంగా అన్ని కులాలు ఏకం కావాల్సిన అవసరం ఉందని ఎమ్మార్పీఎస్ కే టి దొడ్డి మండల ఇంచార్జి గువ్వలదిన్నె జంబయ్య మాదిగ అన్నారు జంబయ్య మాట్లాడుతూ. మంద కృష్ణ మాదిగ మొదలుపెట్టిన ఎమ్మార్పీఎస్ ఉద్యమ ప్రభావం అన్ని అణగారిన కులాల్లో సామాజిక చైతన్యానికి రగిలించిందని అన్నారు. ప్రతి కులం తమ అస్తిత్వాన్ని చాటుకోవడానికి సంఘాల ఏర్పాటు చేసుకొని పోరాట బాటలోకి వచ్చాయని అన్నారు. వారికి కావాల్సినంత ప్రోత్సాహాన్ని సహకారాన్ని మంద కృష్ణ మాదిగ అందించారు. అందువల్ల ఎమ్మార్పీఎస్ ఉద్యమం కేవలం మాదిగల ప్రయోజనాల వరకే పరిమితం కాకుండా అన్ని అణగారిన కులాల సంక్షేమం కోసం కృషి చేసిందని అన్నారు. అందులో భాగంగా ఆరోగ్యశ్రీ, ఆసరా పెన్షన్లు,రేషన్ బియ్యం పెంపు,తెలంగాణ అమరుల కుటుంబాలకు ఉద్యోగాలు, మహిళల కోసం ఫాస్ట్ ట్రాక్ కోర్టులు మొదలైనవి ఎమ్మార్పీఎస్ పోరాడి సాధించిందని అన్నారు. ఈ ఫలితాల అన్ని వర్గాలు పొందుతున్నారని అన్నారు. అందువల్ల సమస్త అణగారిన కులాలకు కేంద్ర బిందువుగా ఎమ్మార్పీఎస్ నిలుస్తుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న అణగారిన కులాలన్ని ఏ కులానికి ఆ కులం చైతన్యమై మందకృష్ణ మాదిగ గారి నేతృత్వంలో మహజనులుగా ఏకం మై తెలంగాణ రాజకీయల్లో మూడో ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగాల్సిన అవసరం ఉందని అన్నారు. ఆ దిశగా అన్ని కులాలు ఆలోచించాలని అన్నారు. ఎస్సీ వర్గీకరణ పోరాటం విజయం సాధించిన నేపథ్యంలో జూలై 7న జరుగు ఎమ్మార్పీఎస్ 31 వ ఆవిర్భవ దినోత్సవ వేడుకల్ని అన్ని గ్రామాల్లో అన్ని కులాల సమక్షంలో పెద్ద ఎత్తున జరుపుకోవాలని పిలుపునిచ్చారు.

నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..
14
ఆదివారం
6 జూలై 2025

# 31 మంది మందు బాబులకు జైలు శిక్ష

## వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

**నేటి సాక్షి ఉమ్మడి వరంగల్ (సందెల రాజు) :** మద్యం సేవించి వాహనం నడపడం ద్వారా గత వారంలో 31 మంది వాహన దారులు జైలు శిక్ష అనుభవించారని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. వానదారులు మద్యం సేవించి వాహనం నడపడం ద్వారా పత్యక్షంగాని, పరోక్షంగాని రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారకులు కావడంతో కొన్ని సందర్భల్లో సదరు మద్యం సేవించి వాహనదారుడు సైతం రోడ్డు ప్రమాదాలకు గురై మృత్యువాత పడుతున్నారు. తద్వారా ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఇది దృష్టిలో వుంచుకోని వరంగల్ పోలీస్ కమిషనరేట్ మద్యం సేవించి వాహనదారుల వలన కలిగే రోడ్డు ప్రమాదాల నివారణకై వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతోంది. ఇందులో భాగం వరంగల్ ట్రైసిటి పరిధిలో ట్రాఫిక్ మరియు లా అండ్ ఆర్డర్ పోలీసులు నిరంతరం డ్రంక్ అండ్ డ్రైవ్ తనీఖీలు చేపట్టడం జరుగుతుందని. అలాగే గ్రామీణా ప్రాంతాల్లోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనీఖీలు నిర్వహించ బడుతున్నాయి. ప్రధానం వరంగల్ ట్రై పరిధిలో ట్రాఫిక్ పోలీసులు చేపట్టే డ్రంక్ అండ్ డ్రైవ్ తనీఖీల్లో పట్టుబడిన వాహనదారులకు ముందుగా కమిషనరేట్ కార్యాలయమ-ులోని ట్రాఫిక్ ట్రైనింగ్ సెంటర్ వాహనదారుల కుటుంబ సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించిన అనంతరం కోర్టులో న్యాయమూర్తి ఎదుట పర్చడం ద్వారా వాహనదారులకు కోర్టులో జైలు శిక్ష లేదా జరిమానా విధించడం జరుగు తుందని వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో ట్రైసిటి ట్రాఫిక్ పోలీసులు ముమ్మరంగా జరిపిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనీఖీల్లో మొత్తం 376 కేసులు నమోదు కాగా, ఇందులో 31 మందికి వాహన దారులకు జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు ఇవ్వగా, 3 లక్షల 83 వేల రూపాయలు వాహన దారులపై ఫైన్ రూపం లో కోర్టు లో జరిమానాలు చెల్లించారని పోలీస్ కమిషనర్ వెల్లడి పరచారు. నమోదైన కేసుల్లో అత్యధికంగా హన్మకొండ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో 138 కేసులు నమోదు కాగా ఇందులో 10 మందికి జైలు శిక్ష పడగా, 96వేల ఎనిమిది వందల రూపాయల్లో వాహనదారులు కోర్టు లో జరిమానా చెల్లించారు. ఇదే రీతిలో వరంగల్ పరిధిలో 134కేసులో 15మంది కి జైలు శిక్ష, 1లక్ష 77వేల ఒక వంద రూపాయల జరిమానా, కాజీపేట పరిధిలో మొత్తం 104 కేసులు నమోదు కాగా ఇందులో అరుగురికి జైలు శిక్ష పడగా, మిగితా కేసుల్లో మొత్తం ఒక లక్ష 9వేల వందల రూపాయలు జరిమానా చెల్లించారని పోలీస్ కమిషనర్ వెల్లడించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ వాహన దారులకు సూచన చేస్తూ మీ కుటుంబాన్ని దృష్టి లో వుంచుకోని వాహన దారులు మద్యం సేవించి వాహనం నడపవద్దని, మీరు చేసే




తప్పిదాలతో ఇతరులు కూడా ప్రాణాలు కోల్పోయినవారు కొందరైతే మరి కొందరు అంగ వైకల్యంగా జీవితాలను కొనసాగిస్తూన్నారని ఇకన్కెన వాహనదారులు మద్యం సేవించి వాహానాలు నడపవద్దని. మీ గమ్యానికి సురక్షితంగా చేరుకోవడమే వరంగల్ కమిషనరేట్ పోలీసుల ప్రధాన లక్ష్యమని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు.

# నేటి సాక్షి వార్తకు స్పందన
## వెలిగిన హైమాస్ట్ లైట్లు



**నేటి సాక్షి,నారాయణపేట, జూలై5 :** నారాయణపేట జిల్లా లో ని మరికల్ మండల కేంద్రం లో ని ఇందిరా గాంధీ చౌరస్తాలో గల గ్రామ పంచాయతీ సంబంధించిన హైమాస్ట్ లైట్లు వెలగడం లేదని నేటి సాక్షి దినపత్రిక లో వచ్చిన వార్తకు శనివారం నాడు మరికల్ గ్రామ పంచాయతీ అధికారుల ఆధ్వర్యం లో మరమ్మత్తులు చేయించి హై మస్ట్ లైట్లును వెలిగేలా చేశారు.

# మెరుగైన వైద్య సేవలను అందించాలి

## హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

**నేటి సాక్షి ఉమ్మడి వరంగల్ (సందెల రాజు) :** పరకాల సామాజిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే పేషెంట్స్ కు మెరుగైన వైద్య సేవలు అందించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. శనివారం హనుమకొండ జిల్లా పరకాల లోని సామాజిక ఆరోగ్య కేంద్రం (సి. హెచ్.సి) ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. సామాజిక ఆరోగ్య కేంద్రంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా క్షయ వ్యాధి కేసుల గుర్తింపు, ఓపీ సేవలు, చికిత్సకు అందుబాటులో ఉన్న మందులు, ఎక్స్ రే పని తీరును గురించి సీహెచ్సీ సూపరింటెండెంట్ డాక్టర్ గౌతమ్ చౌహాన్, వైద్యులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఓపి వివరాలు నమోదు చేసిన రికార్డుతో పాటు ఫార్మసీని తనిఖీ చేశారు. అదేవిధంగా గర్భిణులకు అందిస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రంలోని ఇతర విభాగాలను పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవల గురించి వైద్యులు, సిబ్బందికి జిల్లా కలెక్టర్ పలు సూచనలు చేశారు. అనంతరం మీడియా ప్రతినిధులు అడిగిన పలు ప్రశ్నలకు జిల్లా కలెక్టర్ సమాధానమిచ్చారు. సామాజిక ఆరోగ్య కేంద్రంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్క్రీనింగ్ ఎలా చేస్తున్నారని పరిశీలించినట్లు తెలిపారు. ఓపి పేషంట్ల నమోదు, ఆరోగ్య కేంద్రం నిర్వహణ, మందులకు



సంబంధించిన రికార్డులను పరిశీలించినట్లు చెప్పారు. ఆరోగ్య కేంద్రంలో చిన్నచిన్న లోపాలను సవరించు కోవాలని సూచించినట్లు పేర్కొన్నారు. ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు మెరుగ్గా ఉన్నాయని అన్నారు. వారం రోజుల్లో మరోసారి ఆరోగ్య కేంద్రం సందర్శనకు రానున్నట్లు పేర్కొన్నారు. అనంతరం పరకాలలో నూతనంగా నిర్మిస్తున్న వంద పడకల ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. పనుల పురోగతి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. నూతన ఆసుపత్రి నిర్మాణ పనులు త్వరగా పూర్తయ్యే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా టీబీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హిమబిందు, ఎన్ సి డి ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అహ్మద్, ఆర్ఎంఓ డాక్టర్ బాలకృష్ణ, డిఈ రాజశేఖర్, ఏఈ నాగరాజు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యుత్ ఘూతానికి గురై గేదె మృతి



**నేటి సాక్షి ఉమ్మడి వరంగల్ (సందెల రాజు) :** విద్యుత్ ఘూతానికి గురై పాడి గేదె మృతి చెందిన సంఘటన గ్రేటర్ పరిధిలో ని 55వ డివిజన్ భీమారం శ్యామల చెరువు కట్ట శివారులో చోటు చేసుకుంది. బాధితుడు కొండం అశోక్ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం శనివారం మేతకు వెళ్ళిన సూడి గేదె విద్యుత్ స్తంభానికి ఉన్న ఎర్తింగ్ తీగకు తగిలి మృత్యువాత పడిందని తెలిపారు. మృతి చెందిన పాడి గేదె విలువ సుమారు లక్ష ఇరవై వేల రూపాయలు ఉంటుందని అన్నారు.

# బాధ్యతాయుతంగా ప్రజలకు సేవలందించాలి

## వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్



**నేటి సాక్షి ఉమ్మడి వరంగల్ (సందెల రాజు) :** ప్రజలకు బాధ్యతా యుతంగా సేవలందిస్తే సమాజంలో పోలీసుల పట్ల గౌరవ మర్యాదలు పెరుగుతాయని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలియజేశారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఏ. ఎస్. ఐ లుగా పదోన్నతి పొందిన పి. శ్యాం సుందర్, ఎస్. ప్రభాకర్, టి. కట్టస్వామి, వి. శంకర్, ఏ. అర్జున్ లు శనివారం వరంగల్ పోలీస్ కమిషనర్ ను మర్యాద పూర్వకంగా కలుసుకొని పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా పదోన్నతి పొందిన అధికారుల భుజాలపై నక్షత్రాలను అలంకరించి అభినందనలు తెలియజేసారు. అనంతరం సీపీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితులకు పోలీసుల పట్ల భరోసా నమ్మకాన్ని కలిగించడంతో పాటు, నిరుపేద ప్రజలకు పోలీస్ అధికారులు అండగా నిలవాలని ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ పదోన్నతి పొందిన ఏఎస్ఐలకు సూచించారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులపై కలెక్టర్ సమీక్ష

**నేటి సాక్షి ఉమ్మడి వరంగల్ (సందెల రాజు) :** ప్రభుత్వ విద్యాసంస్థల్లో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులపై విద్య శాఖ, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కేజీబీవీ, ప్రభుత్వ పాఠశాలల్లో మొదటి, రెండో దశలో చేపట్టిన అభివృద్ధి పనులు, వాటి పురోగతి గురించిన వివరాలను డీఈవో వాసంతి, ఇంజనీరింగ్ అధికారులు జిల్లా కలెక్టర్ కు వివరించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ జిల్లాలోని తొమ్మిది కేజీబీవీ పాఠశాలల్లో పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులను చేయడంపై వారం రోజుల్లో తెలియ జేయాలన్నారు. విద్యార్థులకు అవసరమైన వివిధ సదు-పాయాలను పాఠశాలలకు కేటాయించేందుకు ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీ, కళాశాలలు, గురుకులాలు, అంగన్వాడీ కేంద్రాల లో తాగునీరు, విద్యుత్, టాయిలెట్స్, తదితర అభివృద్ధి పనులను పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాల ల్లో



చేపట్టనున్న అభివృద్ధి పనులకు టెండర్లు పిలవాలన్నారు. ఈ సమావేశంలో ఈఈ నరేందర్ రెడ్డి, డిఈ రవీందర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పీర్లను సందర్శించిన పేట డిఎస్పి

## పేట డిఎస్పి కి ఘన సన్మానం



**నేటి సాక్షి,నారాయణపేట, జులై 5 :** మొహరం పండుగ సందర్భంగా డి.ఎస్.పి నల్లపు లింగయ్య గారు ఈరోజు సాయంత్రం నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఇమామ్ హుస్సేన్ అశ్రుఖాన పల్లా బుర్జు, యాద్గిరి అశ్రుఖాన, మక్కా మసీద్ దగ్గర పీర్ల ను దర్శించుకోవడం జరిగింది. అనంతరం డీఎస్పీ గారు మాట్లాడుతూ... మొహరం పండుగ సందర్భంగా ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నారాయణపేట టౌన్ లో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆర్గనైజర్స్ కి సూచించారు. ప్రజలు కులమతాలకు అతీతంగా మొహరం పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వెంకటేశ్వర్లు, ముస్లిం మత పెద్దలు లు తదితరులు పాల్గొన్నారు.

# మన్యంకొండలో వైభవంగా తీరుచ్చి సేవ

## భక్తులకు అలంకరణలో దర్శనమిచ్చిన స్వామివారు

**నేటి సాక్షి, దేవరకద్ర జులై 5 :** మహబూబ్ నగర్ మన్యంకొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం రాత్రి స్వామి వారి తిరుచ్చి సేవ పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతి శనివారం రాత్రి స్వామి వారి తిరుచ్చి సేవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా అవుతుంది. అందులో భాగంగానే ఈ పవిత్ర పూజా కార్యక్రమాన్ని సాంప్రదాయ రీతిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానంలోని గర్భగుడి నుండి శోభాయ మానంగా అలంకరించిన తిరుచ్చి వాహనంపై స్వామివారిని దేవస్థానం ముందున్న మండపం వరకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. పురోహితుల వేదమంత్రాలు, సన్నాయి వాయిద్యాలు, భక్తుల హరినామశ్చరణ, కాగడాల వెలుతు-రులో స్వామివారి సేవ ముందుకు కదిలింది. మండపంలో స్వామివారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం స్వామివారిని మళ్లీ గర్భగుడిలోకి తీసుకెళ్లి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు తదితర పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా



స్వామివారు అలంకరణలో తీరుచ్చి వాహనం పై దేవస్థానం పురవీధుల గుండా ఊరేగుతూ భక్తకోటికి దర్శనం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్ కుమార్, అళహరి రామకృష్ణ, ఈఓ శ్రీనివాసరాజు, ప్రధాన పూజారులు రాజేష్, నరసింహయ్య పర్యవేక్షకుడు నిత్యానంద చారి లతోపాటు దేవస్థానం సిబ్బంది, పురోహితులు, వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.